thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 36 కరీంనగర్ గురువారం, 17 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## అయోధ్య బాల రాముడికి వెండి కిరీటం

చెన్నై: అయోధ్య రామాలయానికి అఖిల భారత హిందూ మహాసభ తరపున 2 కిలోల వెండి కిరీటం అందించనున్నారు. ఈ మహాసభ ఆధ్వర్యంలో గత ఏడాది అయోధ్య శ్రీరాముడు ఆలయానికి 1.75 కిలోల బరువుతో తయారుచేసిన రామపాదం అందజేయగా, ప్రస్తుతం శ్రీరాముడికి 2 కిలోల వెండి కిరీటం అందించనున్నారు. అనుప్పర్‌పాళయంలో తమిళ నూతన సంవత్సరం సందర్భంగా కిరీటం తయారీ ప్రారంభించారు. ఈ 26వ తేది తిరుప్పూర్ రానున్న మహాసభ జాతీయ అధ్యక్షుడు చక్రపాణి మహారాజ్ నేతృత్వంలో అవినాశి లింగేశ్వర ఆలయంలో వెండి కిరీటానికి ప్రత్యేక పూజల అనంతరం అయోధ్య రామాలయానికి తరలించనున్నట్లు మహాసభ యువజన విభాగం వల్లైబాలా, రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి సతీష తెలిపారు.




# అమల్లోకి భూ భారతి..

## రైతులకు లాభమా..? నష్టమా..?

## భూ భారతి కొత్త రూల్స్ తెలుసా?

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్ ప్రారంభమైంది. భూ భారతి పోర్టల్‌ను హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

తొలుత పైలట్ ప్రాజెక్ట్ గా ఈ పోర్టల్ ను ప్రయోగాత్మకంగా 4 మండలాల్లో అమలు చేయనున్నారు. మద్దూరు (నారాయణపేట జిల్లా), లింగంపేట (కామారెడ్డి), వెంకటాపూర్ (ములుగు), నేలకొండపల్లి (ఖమ్మం) మండలాలను ఎంపిక చేశారు. జూన్ 2 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ఈ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**మనిషికి ఆధార్.. భూమికి భూ దార్..** భూ భారతి పోర్టల్ ఆవిష్కరణ తర్వాత సీఎం రేవంత్ ప్రసగించారు. ఈ మేరకు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. భూ భారతి పోర్టల్ ద్వారా ఎవరి భూమి లెక్క వారికి పక్కాగా అప్పజెప్తామని తెలిపారు. “మనిషికి ఆధార్ ఎట్లనో.. ప్రతి ఒక్కరి భూమికీ భూధార్ తెస్తం. రాబోయే రోజుల్లో ప్రతి కమతాన్ని కొలిచి, హద్దులు గీసి రైతుల సమస్యలకు శాశ్వతంగా చెక్ పెడ్తం” అని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని సాధించిన రెవెన్యూ సిబ్బందికి భూమి హద్దులు నిర్ణయించడం పెద్ద సమస్య కాదని, రాబోయే రోజుల్లో వివాదరహిత భూ విధానం ఉండేలా చేస్తామన్నారు.

**భూ భారతి VS ధరణి మార్పులు ఇవే...** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణిని బాంగాళాఖాతంలో కలిపేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అధికారంలోకి రాగానే అన్నంత పని చేశారు. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి పోర్టల్ ను తీసుకొచ్చారు. మరి ధరణికి భూ భారతి కి మధ్య తేడాలేంటి? అనభవదారు కాలమ్ ధరణిలో రద్దు చేశారు. కానీ భూ భారతిలో అనుభవ దారు కాలమ్ కు చోటు కల్పించారు. ధరణిలో పార్ట్- బీ(వివాదాస్పద భూములు) జాబితాకు పరిష్కారం లేదు. భూ భారతిలో వివాదాస్పద భూములకు పరిష్కారం ఉంది. ధరణిలో భూ వివాదాలు తలెత్తితే పరిష్కరించే అధికారాలు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్లకు లేవు. కానీ భూ భారతిలో తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్లకు అధికారాలు అప్పజెప్పారు. ధరణిలో రిజిస్ట్రేషన్ జరిగితే అప్పీలుకు అవకాశం లేదు. సివిల్ కోర్టులకు వెళ్లాల్సిందే. కానీ భూ భారతిలో అప్పీల్ అవకాశం ఉంది. రెవెన్యూ యంత్రాంగం లేదా ట్రిబ్యునల్లో కేసులు పరిష్కరించుకోవచ్చు. ఇక ధరణి రికార్డు శాశ్వతం. కానీ భూ భారతిలో భూ సర్వే అనంతరం సమగ్ర రికార్డును తయారు చేస్తారు. భూమికి, రికార్డుకు మధ్య లింకు కలుపుతారు. ధరణిలో భూముల రిజిస్ట్రేషన్, వెంటనే మ్యుటేషన్ జరిగేది. కానీ భూ భారతి చట్టంలో భూముల రిజిస్ట్రేషన్, వెంటనే మ్యుటేషన్, ఆ తర్వాత ఏ మేరకు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారో సర్వే చేసి రైతు చేతికి మ్యాప్ ఇవ్వనున్నారు. ధరణిలో వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ జరిగితే అప్పీల్ కు అవకాశం లేదు. భూ భారతిలో వారసత్వంగా దక్కిన భూములను విరాసత్ కోసం దరఖాస్తు చేసుకుంటే వారసులందరికీ నోటీసులు జారీ చేసి, అభ్యంతరాల అనంతరమే రికార్డుల్లో వివరాలు నమోదు(మ్యుటేషన్) చేస్తారు. ధరణిలో అసైన్డ్ భూములకు పట్టాదార్ పాసు పుస్తకం లేదు. 13బీ, 38ఈ లకు పాస్ పుస్తకాలు పొందే అవకాశం లేదు. అయితే భూ భారతి చట్టంలో అసైన్డ్ భూములకు పాస్ పుస్తకాలు జారీ చేస్తారు. ఆర్డీఓ విచారణ అనంతరం పాసు పుస్తకం లభించనుంది. ధరణిలో లేని మరో అంశం ఏంటంటే ప్రతి రైతుకి ఆధార్ లాగానే భూ ధార్ ఇస్తారు. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, ప్రత్యేకంగా భూమి ట్రైబ్యునల్ ఏర్పాటు జరగనుంది. భూ సమస్యలకు జిల్లా స్థాయిలోనే పరిష్కారం లభించనుంది. ధరణిలో రికార్డుల్లో తప్పులు ఉంటే సివిల్ కోర్టుకు వెళ్లడం ఒక్కటే పరిష్కారం. కానీ భూ భారతి చట్టంలో జిల్లా స్థాయిలో రెండు అంచెల అప్పీలు వ్యవస్థ, ప్రత్యేకంగా భూమి ట్రైబ్యునల్ ఏర్పాటు జరగనుంది. భూ సమస్యలకు జిల్లా స్థాయిలోనే పరిష్కారం జరగనుంది. ధరణిలో ఉచిత న్యాయ సహాయం లేదు. గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దు అయింది. కానీ భూ భారతిలో ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో అప్పీలు చేసుకోలేని రైతులకు ప్రభుత్వమే ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తుంది. గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్దరణ, ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ అధికారిలాగా గ్రామ ప్రజాపాలన అధికారి నియామకం జరుగుతుంది. భూ భారతి చట్టం ప్రకారం ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేస్తే తహసీల్దార్ పై కఠిన చర్యలు తీసుకోనుంది ప్రభుత్వం. అవసరమైతే ఉద్యోగం నుంచి తొలగించనుంది.

**భూ భారతి చట్టం రూల్స్..** 1. ధరణి స్థానంలో కొత్తగా భూమి హక్కుల రికార్డు (ఆర్ ఓ ఆర్) రూపొందించవచ్చు. 2. ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ధరణిలో తప్పులను సవరించవచ్చు. 3. ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు రూపొందించవచ్చు. 4. ధరణిలో తప్పుల సవరణ కోసం దరఖాస్తులు స్వీకరించి రికార్డు సరి చేయవచ్చు. 5. భూమి పై హక్కులు ఉండి రికార్డులో లేని వారు దరఖాస్తు చేసుకునే అవకాశం. విచారణ చేసి పాస్ పుస్తకాలు ఇవ్వవచ్చు. 6. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు మ్యాప్ తప్పనిసరి. లైసెన్సు డ్ సర్వేయర్ల ద్వారా భూముల సర్వే. గెట్టు వివాదాలు, డబుల్ రిజిస్ట్రేషన్లకు చెల్లు చీటి. 7. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తు పరిష్కారం. 8. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ. డీమ్డ్ మ్యుటేషన్ కు అవకాశం. 9. భూమి హక్కులు ఏవిధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులకు ఎక్కించే అవకాశం. 10. పాస్ పుస్తకాలలో భూమి పటం. 11. రికార్డులను పరిశీలించి తాత్కాలిక భూ ధార్ కార్డుల జారీ. దీనితో ధరణి రికార్డుల ప్రక్షాళన. 12. భూముల సర్వే చేసి కొత్త హక్కుల రికార్డు తయారీ, శాశ్వత భూ ధార్ కార్డుల జారీ. 13. ఆర్ ఓ ఆర్ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ. 14. జిల్లా స్థాయిలో భూమి ట్రిబ్యునల్స్ ఏర్పాటు. 15. రైతులకు ఉచిత న్యాయ సహాయం. ఇందుకోసం జిల్లాల్లో న్యాయ సహాయ కేంద్రాల ఏర్పాటు. 16. ధరణి వెబ్ పోర్టల్ స్థానంలో భూ భారతి పేరుతో కొత్త పోర్టల్ ఏర్పాటు. 17. రెవిన్యూ సదస్సులు నిర్వహించి గ్రామ స్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి అవకాశం. 18. పహాణి, ఇతర గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ. 19. ప్రభుత్వ, భూ దాన్, అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములకు తప్పుగా పట్టాలు జారీ చేస్తే ఎవరైనా కంప్లైంటు ఇచ్చే అవకాశం. రికార్డులను సవరించడానికి రివిజన్ అధికారాలు. 20. మోసపూరితంగా రికార్డులు మారిస్తే అధికారుల పై చర్యలకు అవకాశం.



## జపాన్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం

హైదరాబాద్: వారం రోజుల పర్యటన నిమిత్తం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం జపాన్ చేరుకుంది. అక్కడి భారత రాయబారి శింబు జార్జ్.. సీఎం, అధికారులకు ఆతిథ్య విందు ఇచ్చారు. టోక్యోలోని వందేళ్ల నాటి ఇండియా హౌజ్‌లో ఇచ్చిన విందులో సీఎం రేవంత్ బృందంతో పాటు పలువురు తమిళనాడుకు చెందిన ఎంపీలు పాల్గొన్నారు. వివిధ అంశాలపై రాయబారి, తమిళ ఎంపీలతో సీఎం రేవంత్ చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. గురువారం టోక్యోలోని సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ.. జెట్రో, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్, వివిధ సంస్థలతో సమావేశం కానున్నారు.

## కంచ భూముల వివాదం.. ఐఏఎస్ స్మితా సబర్వాల్.. ఏమన్నారంటే..?

తెలంగాణకు చెందిన పర్యాటక శాఖ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 12న కంచ గచ్చి బౌలీ అంశంపై సోషల్ మీడియా వేదికగా ఏఐ పోస్ట్ ను రీట్వీట్ చేశారన్న ఘటనపై బీఎన్ఎస్ %దీమీ% 179 సెక్షన్ కింద నోటీసులు జారీ చేశారు. అయితే.. మార్చి 31న “హాయ్ హైదరాబాద్” అనే ఎక్స్ హ్యాండిల్ లో ఉన్న పోస్టును.. స్మిత సబర్వాల్ రీట్వీట్ చేశారు. దీనిలో జింకలు, నెమళ్ల గిబ్లీ చిత్రాలు ఉన్నాయి. అయితే.. ప్రస్తుతం ఇదే పెద్ద కాంట్రవర్సీగా మారింది. అయితే..ఈ విషయంపై పోలీసులు నోటీసులు జారీ చేసిన అంశం ఒక్కసారిగా తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. దీనిపై ఏకంగా సీనియర్ అధికారిణి స్మిత సబర్వాల్ రంగంలోకి దిగి మరీ క్లారిటీ ఇచ్చారు. తాను ఎక్కడ కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు చేయలేదన్నారు. అదే విధంగా కేవలం తాను చేసిన పోస్టు ప్రతీకాత్మక చిత్రం అని స్పష్టం చేశారు. అది ఏఐ ఫేక్ ఫోటో కాదు.. ప్రతీకాత్మక చిత్రం అని చెప్పారు. అయితే.. పోలీసులు తనకు కేసు నోటీసుల కాపీని ఇవ్వాలన్నారు. అదే విధంగా పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరిస్తానన్నారు. మహిళలకు సంబంధించి.. పోలీసుల స్టేషన్ కు రావాల్సిన అవసరం లేదని స్మిత సబర్వాల్ స్పష్టం చేశారు. పోలీసులకు తన పరిధి దాటలేదని, ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కలిగే విధంగా ప్రవర్తించలేదని సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్పష్టం చేశారు. అయితే.. సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణల్ని కూడా సీనియర్ అధికారిణి కొట్టిపారేశారు.




# కొలువుల జాతర మొదలు

## తెలంగాణలో ఇక భారీగా ఉద్యోగాలు




తెలంగాణలో నిరుద్యోగ యువత ఎదురు చూస్తున్న ఉద్యోగ ప్రక్రియలు మళ్లీ ప్రారంభం కానున్నాయి.

గత ఏడాది నుంచి ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని కేంద్రంగా చేసుకుని నిలిపివేసిన ప్రభుత్వ నోటిఫికేషన్లు ఇప్పుడు ఒకదాని వెంట ఒకటి వెలువడనున్నాయి. గతంలో విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను రీషెడ్యూల్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ముఖ్యమంత్రితో పాటు మంత్రుల బృందం ప్రత్యేకంగా సమావేశమై స్పష్టమైన కార్యాచరణ రూపొందించనుంది.

**ఎస్సీ వర్గీకరణ చట్టంతో ఆగిన ప్రక్రియ...** తెలంగాణ ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించి పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీకి ముందుగానే ప్రణాళిక రూపొందించింది.

మొత్తం 20 నోటిఫికేషన్లను జారీ చేసి, విభిన్న శాఖల్లో నియామకాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఆ సమయంలో షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు రావడంతో కొత్త నోటిఫికేషన్లను నిలిపివేసింది. ఫలితంగా సెప్టెంబర్ 2024 నుంచి నియామక ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది.

**ఇప్పుడు క్లారిటీ... మరింత స్పీడుగా నియామకాలు!....** ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ చట్టంపై స్పష్టతకు రావడంతో, ఆ నిర్ణయాన్ని కేంద్రంగా చేసుకుని రోస్టర్‌ను ఫిక్స్ చేసి, నియామక ప్రక్రియను మళ్లీ ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా గడచిన ఏడాది కాలంలో అనేక శాఖల్లో ఉద్యోగులు రిటైర్ అవడంతో ఖాళీలు మరింతగా పెరిగాయి. ఈ పెరిగిన ఖాళీలను పరిగణనలోకి తీసుకుని అప్‌డేటెడ్ జాబ్ క్యాలెండర్‌ను రూపొందించనున్నారు.

**ఈ నెలాఖరులో రెండు కీలక నోటిఫికేషన్లు...** ఈ నెలాఖరులోగా తొలి విడతగా రెండు పెద్ద నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశం ఉంది. మహిళా, శిశు సంక్షేమ శాఖలో 14,236 అంగన్‌వాడీ ఉద్యోగాలు, హెల్త్ డిపార్టుమెంట్‌లో 4 వేలకు పైగా పోస్టుల కోసం నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్టీసీలో మూడు వేలకుపైగా పోస్టులకు ఇప్పటికే అనుమతి లభించిందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

ఈ మూడు విభాగాలనూ మొదటి విడతలో పూర్తి చేసి యువతకు కొలువులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

**గ్రూప్, పోలీస్, గురుకుల ఉద్యోగాలు తర్వాతే...** ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఏప్రిల్‌లో పోలీసు విభాగంలో నియామక ప్రక్రియ మొదలవ్వాలి. మేలో గ్రూప్-2 నోటిఫికేషన్, జూలైలో గ్రూప్-3 నోటిఫికేషన్ రావాల్సి ఉంది. అలాగే ఫిబ్రవరిలో షెడ్యూల్ చేసిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నోటిఫికేషన్ కూడా వాయిదా పడింది. ఇవన్నీ ఎస్సీ వర్గీకరణ కారణంగా ఆలస్యమయ్యాయి. ఇప్పుడు వీటిని మళ్లీ షెడ్యూల్ చేయనున్నారు. అలాగే గురుకుల, సింగరేణి కాలరీస్, ఇంజినీరింగ్ విభాగాల్లో నియామకాలు కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది

**ఎప్పుడు ఏ పరీక్ష స్పష్టత ఇవ్వనున్న ప్రభుత్వం...** ప్రతీ పరీక్ష నిర్వహణకు అటు అఖిల భారత పరీక్షల షెడ్యూల్, ఇటు రాష్ట్రంలోని ఇతర పరీక్షల సమయాన్ని పరిగణనలోకి తీసుకుని షెడ్యూల్ ఖరారు చేయాలి. అందుకే మంత్రుల బృందం ఈ విషయంపై ప్రత్యేకంగా సమీక్షించి స్పష్టత ఇవ్వనుంది. ఎప్పుడు ఏ నోటిఫికేషన్ విడుదల చేయాలి? ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహించాలి? అన్న దానిపై త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం వెలువడనుంది

**అర్హులందరికీ అవకాశాలు రిజర్వేషన్ల ప్రకారం నియామకాలు...** ఈసారి విడుదలయ్యే నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ చట్టానికి అనుగుణంగా రిజర్వేషన్‌ను అమలు చేయనున్నారు. కొత్తగా రూపొందించబోయే రోస్టర్ ప్రకారం ప్రతి విభాగానికి న్యాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వెనకబడిన తరగతులకు పెద్ద మొత్తంలో అవకాశాలు దక్కనున్నాయి.

**నిరుద్యోగులకు ఊరటనిచ్చే శుభవార్త...** కొనసాగుతున్న నిరుద్యోగ సమస్యల మధ్య, ఈ ప్రకటనలు రాష్ట్ర యువతకు శుభవార్తగా మారనున్నాయి. నెలల తరబడి ఎదురు చూస్తున్న యువతకు త్వరలోనే కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ నియామక ప్రక్రియలు తుది దశకు చేరుకున్న వేళ, కొలువుల జాతర మొదలైపోయిందనే సంకేతాలు ప్రభుత్వవర్గాల నుంచి స్పష్టంగా వెలువడుతున్నాయి.




దిల్లీ: హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు లో బుధవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. చెట్లు కొట్టేసే ముందు 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారా? లేదా? స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. అనుమతులతోనే ఆ భూముల్లో జామాయిల్ తరహా చెట్లు, పొదలను తొలగించినట్లు ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ తెలిపారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని.. దాని ప్రకారం ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ చెప్పారు. అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టివేసినట్లు తేలితే సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. 1996 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు ఏమాత్రం విరుద్ధంగా వ్యవహరించినా చూస్తూ ఊరుకోబోమన్నారు. రూ.10వేల కోట్లకు మార్టిగేజ్ చేశారని సీఈసీ నివేదికలో చెప్పిందని అమికస్ క్యూరీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములను మార్టిగేజ్ చేశారా.. అమ్ముకున్నారా? అనేది తమకు అనవసరమని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. చెట్లు కొట్టివేసే ముందు అనుమతి ఉందా? లేదా? అనేది మాత్రమే ముఖ్యమని చెప్పారు. 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి.. ఆ తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి తదితర వివరాలను అభిషేక్ మను సింఘ్వీ వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేసింది.




దేశంలో నిత్యం కోట్లాది మంది ప్రయాణికులకు సేవలందిస్తోన్న భారతీయ రైల్వే కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టింది. 1853 ఏప్రిల్ 16న ముంబయి నుంచి ఠాణెకు మొదలైన ఈ రైలు దేశంలో తొలిసారి ప్యాసింజర్ రైలుగా చరిత్రలో నిలిచిపోయింది. నేటితో 172 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశంలో వీటి ప్రారంభం గురించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తొలిరైలు మూడు ఇంజిన్లతో బయలుదేరిన విషయాన్ని గుర్తుచేశారు. "172 సంవత్సరాల క్రితం, 1853 ఏప్రిల్ 16న మూడు ఇంజిన్లతో కూడిన తొలి రైలు ముంబయిలోని బోరిబందర్ నుంచి ఠాణెకు ప్రయాణించింది. ఆ రోజు ముంబయిలో చరిత్రాత్మకమైంది. ఆ రోజు అక్కడ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మధ్యాహ్నం 3.35గంటలకు 14 కోచ్‌లతో కూడిన రైలు ముంబయిలోని బోరిబందర్ నుంచి ఠాణెకు ప్రయాణించింది. 21 తుపాకీలతో సెల్యూట్ చేశారు. ఆహ్వానం ఉన్న 400 మంది అందులో ప్రయాణించారు. సింధ్, సుల్తాన్, సాహెబ్ పేర్లు కలిగిన మూడు ఇంజిన్లతో రైలు ప్రారంభమైంది. 34 కి.మీ దూరాన్ని 1 గంట 15నిమిషాల్లో చేరుకుంది. అప్పటి నుంచి భారతీయ రైల్వే సేవలు అందిస్తూనే ఉంది" అని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తొలి రైలు వెళ్తున్న చిత్రంతోపాటు ఇటీవల దేశంలో నిర్మించిన మూడు అద్భుత రైల్వే వంతెనల ఫొటోలను ఆయన పోస్టు చేశారు.

## తెలంగాణలో ఎకోరేస్ ఎనర్జీ సంస్థ రూ.27వేల కోట్లు పెట్టుబడులు: భట్టి విక్రమార్క



హైదరాబాద్: తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీ రెడ్కో)తో ఎకోరేస్ ఎనర్జీ, జీపీఆర్ఎస్ ఆర్య సంస్థలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రతినిధులు ఎంవోయూలపై సంతకాలు చేశారు. రూ.27వేల కోట్లతో 5,600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఎకోరేస్ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. రూ. 2వేల కోట్లతో 15 జిల్లాల్లో బయోగ్యాస్ ప్రాజెక్టులకు జీపీఆర్ఎస్ ఆర్య ఒప్పందం చేసుకుంది. అంతకుముందు బ్యాంకర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని సాధారణ సంక్షేమ పథకంగా చూడొద్దని బ్యాంకర్లను కోరారు. మానవీయ దృష్టితో రూపొందించిన ఈ పథకానికి సహకరించాలన్నారు. రాజీవ్ యువ వికాసం.. రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచిపోతుందన్నారు. "కొలువుల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో గత పదేళ్లుగా నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే.. నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా యువతకు సహాయపడేందుకు బ్యాంకర్లు సహకరించాలి. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తుంది.. బ్యాంకర్లు రూ. 1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలి" అని కోరారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు బ్యాంకర్లతో త్వరలో సమావేశం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రభుత్వ వాటా విడుదల కాగానే.. బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని వెంటనే విడుదల చేసేలా చూడాలన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో ఇవాళ కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, మరికొన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. రానున్న రెండు రోజులు పలు జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సూచనలున్నాయని పేర్కొంది. రాగల మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. నిన్న నైరుతి బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టం నుంచి 1.5 కి.మీ. ఎత్తులో కొనసాగిన ఉపరితల చక్రవాత ఆవర్తనం.. ఇవాళ బలహీన పడిందని వాతావరణ కేంద్రం తెలిపింది.




## సెలవుల్లో బుల్డోజర్లు దింపాల్సిన అవసరం ఏంటి.. సర్కార్‌కు సుప్రీం సూటి ప్రశ్న

న్యూఢిల్లీ : కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ ప్రారంభమైంది. జస్టిస్ బీఆర్ గవాయ్ నేత్రత్వంలోని ద్విసభ్య ధర్మాసనం దీన్ని విచారించింది. చెట్లు కొట్టేసి ముందు అనుమతులు తీసుకున్నారా లేదా స్పష్టంగా చెప్పాలని విచారణలో జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. అయితే అనుమతులతోనే ఆ భూముల్లో జామాయిల్ తరహా చెట్లు, పొదలను తొలగించినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టుకు చెప్పారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని, దాని ప్రకారం స్వయం అనుమతులుగా ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ సుప్రీంకు వివరించారు. అనుమతులు తీసుకున్నారా లేదా అనుమతులు లేకుండా చెట్లు కొట్టేసినందుకు సీఎస్ సహ సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ హెచ్చరించారు. జస్టిస్ గవాయ్: చీఫ్ సెక్రటరీని కఠినమైన చర్య నుంచి కాపాడాలనుకుంటే, ఆ వంద ఎకరాలను ఎలా పునరుద్ధరించాలో ఒక ప్రణాళికతో ముందుకు రావాలి. 1996 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏమాత్రం వ్యవహరించినా చూస్తూ ఊరుకోం. మూడు రోజుల సెలవుల్లో అలా చేయడానికి అంత తొందర ఏమిటి? ఆ సెలవుల్లోనే బుల్డోజర్లు తీసుకొచ్చారు. పర్యావరణాన్ని కాపాడటానికి మేము ఇక్కడ ఉన్నాం. అధికారుల అనుమతి లేకుండా ఎన్ని చెట్లను నరికివేశారో అనే ఆందోళన మాత్రమే ఉంది. చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలి. మేము బుల్డోజర్ ఉనికి, 100 ఎకరాల అడవిని తొలగించడం గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నాం. మీరు నిర్మించాలనుకుంటే, మీరు అనుమతులు తీసుకొని ఉండాలి అని జస్టిస్ అన్నారు. 100 ఎకరాల్లో జరిగిన నష్టం కారణంగా ప్రభావితమైన వన్యప్రాణులను రక్షించేందుకు అవసరమైన తక్షణ చర్యలను పరిశీలించి, అమలులోకి తీసుకురావాలని తెలంగాణ వన్యప్రాణి సంరక్షణాధికారిని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. పునరుద్ధరణ ఎలా చేస్తారు, ఎంత కాలంలో చేస్తారు, జంతు జలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది ధర్మాసనం. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశాల్లో పేర్కొంది. తదుపరి విచారణను మే 15కు సుప్రీం కోర్టు వాయిదా వేసింది.




హైదరాబాద్: నగరంలో ఈడీ దాడులు మరోసారి కలకలం రేపుతున్నాయి. సురానా, సాయి సూర్య డెవలపర్స్‌లో ఈడీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. సికింద్రాబాద్, బోయిన్ పల్లి, జూబ్లీహిల్స్ మాదాపూర్‌లో సురానా గ్రూప్ ఛైర్మన్, ఎండీ డైరెక్టర్ ఇల్లలో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. సునారా గ్రూప్ మూడు బ్యాంకులకు రూ. 3,986 కోట్లు ఎగ్గొట్టింది. రుణాలు తిరిగి చెల్లించకపోవడంపై సీబీఐ మూడు కేసులు నమోదు చేసింది. సురానాకు అనుబంధంగా సాయిసూర్య డెవలపర్స్ పనిచేస్తోంది. 2021 ఫిబ్రవరిలో సురానా కంపెనీలో జరిగిన ఈడీ సోదాల్లో రూ. 11 కోట్ల 62 లక్షల విలువైన బంగారం, నగదు సీజ్ చేశారు. సురానా గ్రూప్ అనుబంధ సంస్థలపై పీఎంఎల్ఏ కేసు కూడా నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు దాడులు చేశారు.

**రెండోసారి ఈడీ సోదాలు..** సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు రెండోసారి సోదాలు చేస్తున్నారు. సురానా ఇండస్ట్రీస్ లిమిటెడ్, M/s సురానా కార్పొరేషన్ లిమిటెడ్, M/s సురానా పవర్ లిమిటెడ్, కంపెనీల ఇద్దరు ప్రమోటర్లు, ఇతర అనుబంధ సంస్థలపై పీఎంఎల్ఏ కింద ఈడీ కేసు నమోదు చేసింది. దీంతో కంపెనీ ఎండి దినేష్ చంద్ సురానా, విజయ్ రాజ్ సురానా, డమ్మీ డైరెక్టర్లు ఆనంద్ ప్రభాకరన్‌లను 2022లో ఈడీ అధికారులు అరెస్టు చేశారు. తాజాగా మరోసారి సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో అధికారులు సోదాలు చేస్తున్నారు. మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ. 3,986 కోట్లు సురానా గ్రూప్ కుచ్చుటోపి పెట్టింది. తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో మొండి బకాయిలుగా కంపెనీ మారింది. బ్యాంకులకు రుణాలు చెల్లించకపోవడంపై బెంగళూర్ సీబీఐ మూడు కేసులు నమోదు చేసింది. గతంలో సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీలకు చెందిన రూ.113.32 కోట్ల విలువైన స్థిరచరాస్తులను తాత్కాలికంగా ఈడీ అధికారులు జప్తు చేశారు. తమ బంధువులు, సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీ ఉద్యోగులను డైరెక్టర్లుగా నియమించి దినేష్ చంద్ సురానా బ్యాంకులను మోసం చేశారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారు. సురానా గ్రూప్ కేమన్ ఐలాండ్‌తో పాటు బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్‌లలో డమ్మీ డైరెక్టర్లను నియామకం చేసి.. ఆయా కంపెనీల్లోకి బ్యాంకు రుణాలను సురానా మళ్లించారు. సింగపూర్‌లో నాలుగు కంపెనీలు స్థాపించి వస్తువుల ఎగుమతి చేసి ఆ డబ్బును సురానా భారతదేశంలో అందుకున్నారు. దారి మళ్లించిన నిధులలో కొంత భాగాన్ని వివిధ బినామీ, కంపెనీల పేర్లలో చరాస్తులు, స్థిరాస్తులను కొనుగోలు చేయడానికి ఉపయోగించినట్టు ఈడీ అధికారులు నిర్ధారించారు. ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి.

## సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: కేటీఆర్



హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. మే 15 వరకు స్టేటస్ కో పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "పర్యావరణాన్ని పునరుద్ధరించాలని చెప్పిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికైనా జ్ఞానోదయం కలుగుతుందని ఆశిస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి రూ.10వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతున్నారు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## భారీగా పట్టుబడ్డ డ్రగ్స్.. పోలీసులకు చిక్కిన మాజీ సీఎస్ పుత్రుడు

హైదరాబాద్, ఏప్రిల్ 16: డ్రగ్స్ సరఫరాను నిర్మూలించేందుకు పోలీసులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు సోదాలతో డ్రగ్స్ సరఫరా చేసే వారి గుండెల్లో గుబులు పుట్టిస్తూనే ఉన్నారు. తెలంగాణను (%వశ్రీఖఅస్త్రుఖు%) డ్రగ్స్ రహితంగా మార్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పక్కా సమాచారాలతో వెళ్లి మరీ డ్రగ్స్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు.. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిని పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఓ పక్క పోలీసులు హెచ్చరిస్తుంటే.. మరోవైపు ఇదేమీ తమకు పట్టవన్న చందంగా డ్రగ్స్ సరఫరాకు పాల్పడుతున్నారు కొందరు వ్యక్తులు. తాజాగా నగరంలో మరోసారి పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడటం సంచలనంగా మారింది. అయితే డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తి గురించి తెలిసి పోలీసులు షాక్ అవ్వాల్సిన పరిస్థితి. ఇంతకీ సిటీలో ఎక్కడ డ్రగ్స్ పట్టుబడింది.. డ్రగ్స్ తీసుకొచ్చిన వ్యక్తి ఎవరు.. ఎక్కడి నుంచి తెచ్చాడో ఇప్పుడు చూద్దాం. నగరంలోని గచ్చిబౌలి పరిధిలోని శరత్ సిటీ మాల్‌లో పెద్దఎత్తున డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. అక్కడ డ్రగ్స్ సరఫరా జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం వెళ్లింది. దీంతో ఎంతో రహస్యంగా డ్రగ్స్‌ను పట్టుకునేందుకు అక్కడకు చేరుకున్నారు. ప్రతీ ఒక్కరిపై నిఘా పెట్టారు. చివరకు ఓ వ్యక్తి అనుమానస్పదంగా కనిపించడంతో అతడిని పట్టుకుని సోదాలు జరిపారు. ఆ వ్యక్తి వద్ద భారీ ఎత్తున డ్రగ్స్ లభ్యమైంది. నిందితుడు ఎక్కడి నుంచి వచ్చాడు అనేదానిపై పోలీసులు ఆరా తీశారు. అయితే మాదకద్రవ్యాలతో పట్టుబడ్డ వ్యక్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడని.. అంతే కాకుండా ఉత్తరప్రదేశ్ మాజీ సీఎస్ కుమారుడిగా గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అసలు ఎక్కడి నుంచి డ్రగ్స్ తీసుకువచ్చాడు.. ఎవరికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడనే దానిపై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు. అధికారుల విచారణలో ఎలాంటి విషయాలు బయటకు వస్తాయో వేచి చూడాలి. అయితే ఎక్కడిక్కడ డ్రగ్స్ సరఫరాను అడ్డుకుంటున్నప్పటికి ఎక్కడో చోట ఇలా డ్రగ్స్ పట్టుబడటం పోలీసులకు పెను సవాల్ అనే చెప్పుకోవచ్చు.

## ఐఏఎస్ స్మితా సబర్వాల్‌కు నోటీసులు.. విషయం ఏంటంటే..

హైదరాబాద్: తెలంగాణ సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్, రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి మార్చి 31న "హాయ్ హైదరాబాద్" అనే ఎక్స్ హ్యాండిల్ పోస్టు చేసిన గిబ్లీ ఫొటోను స్మిత రీపోస్ట్ చేశారు. అందులో హెచ్‌సీయూ మష్రూమ్ రాక్ ఎదుట భారీగా బుల్డోజర్లు ఉన్నట్లు ఉంది. అలాగే వాటి ముందు నెమలి, జింకలు ఉన్నాయి. ఈ పోస్టుని ఐఏఎస్ స్మితా సబర్వాల్ తన ఎక్స్ ఖాతాలో రీపోస్టు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఫేక్ ఫొటోగా తేల్చారు. ఈ మేరకు %దీచీ% 179 సెక్షన్ కింద నోటీసులు అందించారు. కాగా, కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి పెద్దఎత్తున వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. 400 ఎకరాల భూముల్లో చెట్లు తొలగించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నించగా.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులు అడ్డుకున్నారు. ఈ మేరకు పెద్దఎత్తున ఉద్రక్తతలు చోటు చేసుకున్నాయి. దీనిపై పలువురు హైకోర్టు, సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించారు. మరోవైపు సోషల్ మీడియా వేదికగా దీనిపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. పదుల కొద్దీ బుల్డోజర్లతో చెట్లను తొలగిస్తున్నారని, అక్కడున్న జీవరాశులకు ఆశ్రయం లేకుండా చేస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. చెట్ల తొలగింపునకు సంబంధించిన ఫొటోలు, వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై తెలంగాణ సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఏఐ ఫొటోలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడింది. ఈ మేరకు అలాంటి వారిపై విచారణ జరిపి కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. ఇప్పటికే పలువురి నోటీసులు ఇచ్చిన పోలీసులు.. కొంతమంది బీఆర్ఎస్ నేతలపైనా కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఐఏఎస్ స్మితా సబర్వాల్ ఫేక్ ఫొటోలు రీపోస్టు చేశారంటూ తాజాగా నోటీసులు అందించారు.

చురకలు

గురువారం 17 ఏప్రిల్ 2025




## ఆ ఎగుమతుల నిలిపివేతతో చైనా షాక్.. ఆందోళనలో అమెరికా

వాషింగ్టన్: అమెరికా– చైనాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యూఎస్ 145 శాతానికి పెంచినట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. అంతటితో ఆగకుండా తమ దేశంలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్‌కు ఎగుమతి చేయడాన్ని ఆపేస్తున్నట్లు బీజింగ్ పేర్కొంది. ఈ ప్రకటనపై అమెరికా స్పందించింది. ఖనిజాల ఎగుమతి విషయంలో చైనా తీసుకున్న నిర్ణయం ఆందోళనకరంగా ఉందని ట్రంప్ ముఖ్య ఆర్థిక సలహాదారుల్లో ఒకరైన కెవిన్ హసెట్ పేర్కొన్నారు. టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో ఈ ఖనిజాల అవసరం ఎక్కువగా ఉందన్నారు. డ్రాగన్ నిర్ణయం వల్ల పశ్చిమదేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్లు కంపెనీలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని.. వీటిపై డ్రాగన్‌తో చర్చలు జరిపే అవకాశం ఉందని తెలిపారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల 100 శాతం మాంద్యం వస్తుందని తామేమీ అనుకోవట్లేదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90శాతం చైనా నుంచే వెళుతున్నాయి. తాజాగా బీజింగ్ చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు.. అన్ని దేశాలపైనా ఉండనుంది. తొలుత చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను ట్రంప్ 54శాతం పెంచడంతో కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. మరోసారి అగ్రరాజ్యం సుంకాలను 145 శాతానికి పెంచడంతో అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలు, ఇతర ఉత్పత్తులను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతోపాటు ఎక్స్‌పోర్ట్ లైసెన్స్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్‌మార్టిన్, టెస్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్‌ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు. దీంతో అమెరికా ప్రభుత్వం చైనా చర్యలపై ఆందోళన వ్యక్తంచేస్తోంది. అయితే సుంకాల విషయంలో చైనాతో పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు.





ముంబయి దాడులకు సిద్ధం చేసిన ప్లాన్ గురించి చెబుతుంటే ఉగ్రవాది తహవ్వుర్ రాణా పగలబడి నవ్వాడు. ఈ విషయాన్ని అతడే స్వయంగా అమెరికా న్యాయస్థానంలో వెల్లడించాడు. తాజాగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఉగ్రసంస్థ లష్కరే తోయిబా కోసం పాక్–అమెరికన్ డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ భారత్‌లో రెక్కీ నిర్వహించాడు. 2008 మే నెలలో హెడ్లీ ముంబయిలో బోట్ ట్రిప్‌ను పూర్తిచేసుకొని రాణాకు ఫోన్ చేశాడు. తాజ్ మహల్ హోటల్స్ వద్ద ఉగ్రవాదులు బోట్‌లో వచ్చి ల్యాండ్ కావచ్చన్నాడు. ఈ క్రమంలో తాజ్ హోటల్‌ను లష్కర్ మోడల్ హోటల్‌గా సంబోధించాడు. అప్పుడు తాను నవ్వినట్లు అమెరికా కోర్టుకు అతడే వెల్లడించాడు. హెడ్లీ ముంబయి మిషన్ కోసం రాణానే కవర్ స్టోరీ సృష్టించేందుకు అతడిని తన ఇమిగ్రేషన్ వ్యాపార సంస్థ రీజనల్ మేనేజర్‌గా చూపించాడు. అతడిని ముంబయి పంపించేందుకు తన సంస్థలోని ఓ వ్యక్తిని నియమించి హెడ్లీ తండ్రి, ఇతర వివరాలను దాచిపెట్టారు. ప్రస్తుతం ఆ వ్యక్తి కూడా ఎన్ఐఏ రాడార్‌లో ఉన్నారు. రాణా ట్రావెల్ ఏజెన్సీ కోసం పనిచేసిన వ్యక్తి వివరాల కోసం ఇప్పుడు జాతీయ దర్యాప్తు సంస్థ వెతుకుతోంది. ఈక్రమంలో రాణా గతంలో పాక్ ఉగ్రసంస్థలకు చెందిన పలువురు వ్యక్తులకు కూడా సాయం చేసి ఉంటాడని జాతీయ దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. 2002, 2005 సంవత్సరాల్లో, ఆ తర్వాత కూడా మొత్తం ఐదుసార్లు ఉగ్ర క్యాంప్‌లకు హాజరైనట్లు హెడ్లీ అంగీకరించాడు. ఆ సమయంలో భారత్‌లో పర్యటించి రెక్కీలు నిర్వహించాలని లష్కరే అతడికి సూచించింది. దీంతో అతడు ముంబయి దాడుల వరకు ఐదుసార్లు భారత్‌ను సందర్శించాడు. అప్పుడే ఇద్దరు లష్కరే ఉగ్రవాదులు హెడ్లీతో మాట్లాడుతూ ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ముంబయిలో ఇమిగ్రేషన్ ఆఫీస్‌ను తెరవాలని సూచించారు. ఆ తర్వాత అదే విషయాన్ని హెడ్లీ రాణాకు చెప్పాడు. వీరిద్దరూ చర్చించుకొన్న తర్వాత ముంబయిలో రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ ఆఫీసును తెరిచేందుకు రాణా అంగీకరించారు.




క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగశాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్నవారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ తొలుత అధికారులు వారికి ఈమెయిల్స్ పంపారు. తాజాగా ట్రంప్ యంత్రాంగం పలు యూనివర్సిటీలలోని విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. దీంతో అక్కడి స్కాలర్లకు బహిష్కరణ ముప్పు పొంచి ఉంది. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో తమ చదువులు కొనసాగించలేకపోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు సహా మేరీల్యాండ్, ఒహియో స్టేట్ వంటి ప్రఖ్యాత ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలోని విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు వీరిలో ఉన్నారు. చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను, హమాస్ అనుకూల ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. కాగా నిరసన కార్యక్రమాలలో పాల్గొనని విద్యార్థుల వీసాలు కూడా రద్దయినట్లు కళాశాలలు పేర్కొంటున్నాయి. కొందరు విద్యార్థులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినందుకు వీసా రద్దు చేసినట్లు చెప్తుండగా..మరికొందరి విషయంలో అధికారులు సరైన కారణాలు కూడా తెలియజేయట్లేదని వారు కోర్టుకు విన్నవించారు. ఇటువంటి కారణాలతో తమ వీసాలు రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదని వాదించారు.

## 'కోర్టు' సినిమా రిపీట్.. ప్రతీ యువత చదవాల్సిన స్టోరీ ఇదీ

హీరో నాని నిర్మాతగా వచ్చిన 'కోర్టు' సినిమా ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ముఖ్య పాత్ర పోషించింది. ముఖ్యంగా ప్రేమ పేరుతో మైనర్ బాలికలు ఇష్టపూర్వకంగా వెళ్లినా, వారి తల్లిదండ్రులు పోక్సో చట్టాన్ని అక్రమంగా వినియోగించి యువకులను జైలుకు పంపించే విధానాన్ని ఈ సినిమా కళ్లకు కట్టింది. 18 ఏళ్ల లోపు ప్రేమలో పడి పెళ్లిళ్లు చేసుకునే యువత తప్పకుండా చూడాల్సిన చిత్రమిదని చాలా మంది అభిప్రాయపడ్డారు. తాజాగా ముంబైలో జరిగిన ఒక ఘటన 'కోర్టు' సినిమాను గుర్తుకు తెస్తోంది. 15 ఏళ్ల బాలికను 22 ఏళ్ల యువకుడు రేప్ చేశాడన్న కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2020లో నవీ ముంబైకి చెందిన 15 ఏళ్ల బాలిక ఉత్తరప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల యువకుడితో ఇంటి నుంచి వెళ్లిపోయింది. పది నెలల తర్వాత ఆమె గర్భవతిగా తిరిగి రావడంతో ఆమె తండ్రి ఆ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు పెట్టారు. ఈ కేసును విచారించిన బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'బాలిక తన ఇష్ట ప్రకారమే వెళ్లింది. ఏం జరుగుతుందో ఆమెకు తెలుసు' అని పేర్కొంటూ ఆ యువకుడికి బెయిల్ మంజూరు చేసింది. బాలిక మైనర్ అయినప్పటికీ, ఆమె స్వచ్ఛందంగానే వెళ్లిందని, పరిణామాలపై ఆమెకు అవగాహన ఉందని కోర్టు భావించడం



గమనార్హం. 'కోర్టు' సినిమాలో చూపించిన విధంగానే, ఇక్కడ కూడా బాలిక ఇష్టపూర్వకంగా వెళ్లినప్పటికీ పోక్సో చట్టం కింద కేసు పెట్టడం జరిగింది. అయితే ముంబై కోర్టు బాలిక వాదనతో ఏకీభవించి, ఆమె మైనర్ అయినా కూడా యువకుడికి బెయిల్ ఇవ్వడం విశేషం. పోక్సో చట్టం యొక్క దుర్వినియోగంపై 'కోర్టు' సినిమా లేవనెత్తిన అంశాలను ఈ తీర్పు మరోసారి తెరపైకి తెచ్చింది. ఈ తీర్పు అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. మైనర్ బాలికలు ప్రేమలో పడి ఇష్టపూర్వకంగా వెళ్లినప్పుడు, వారిపై పోక్సో చట్టం వర్తిస్తుందా? లేదా? తల్లిదండ్రులు తమ పిల్లలను తిరిగి పొందాలనే ఉద్దేశ్యంతో ఈ చట్టాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారా? అనే విషయాలపై చర్చకు దారితీస్తోంది. నిజానికి పోక్సో చట్టం బాలలను లైంగిక దాడుల నుంచి రక్షించడానికి ఉద్దేశించబడింది. కానీ, ప్రేమ పేరుతో లేచిపోయే ఘటనల్లో ఈ చట్టం యొక్క వినియోగంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు బాలికల భవిష్యత్తు, వారి రక్షణ ముఖ్యమైనప్పటికీ, మరోవైపు ఇష్టపూర్వకంగా వెళ్లిన యువతీ యువకులను నేరస్తులుగా చూడటం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముంబై హైకోర్టు తీర్పు ఈ తరహా కేసుల్లో ఒక కొత్త చర్చకు తెరలేపింది. ప్రేమ, స్వేచ్ఛ, చట్టం యొక్క పరిమితులు వంటి అంశాలపై లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. 'కోర్టు' సినిమా చూపించినట్లుగా, ప్రతి కేసు యొక్క వాస్తవాలను పరిగణలోకి తీసుకుని, చట్టాన్ని సరైన రీతిలో వినియోగించాల్సిన ఆవశ్యకతను ఈ తీర్పు గుర్తు చేస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి కేసుల్లో కోర్టులు ఎలాంటి తీర్పులు ఇస్తాయో వేచి చూడాలి.

## బిల్ గేట్స్‌తో అందుకే విడాకులు తీసుకున్నా : మెలిందా సంచలనం

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ తన జీవితంలో విడాకులు తీసుకోవడం అత్యంత బాధాకరమైన విషయమని స్వయంగా పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ విషయంపై ఆయన మాజీ భార్య మెలిందా ఫ్రెంచ్ గేట్స్ స్పందించారు. పరిస్థితులు అలా ఉండబట్టే తాము విడిపోవాల్సి వచ్చిందని ఆమె స్పష్టం చేశారు. ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బిల్ గేట్స్ వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు మెలిందా సూటిగా సమాధానమిచ్చారు. “మీ బంధాన్ని కాపాడుకోవడానికి అవసరమైన విలువలను మీరు నిలబెట్టుకోలేకపోతే, విడాకులు తీసుకోవడం తప్పనిసరి” అని ఆమె కుండబద్దలు కొట్టారు. అయితే, బిల్ గేట్స్ చేసిన వ్యాఖ్యలపై మరింత స్పందించేందుకు ఆమె నిరాకరించారు. విడాకుల ప్రక్రియ తనను తీవ్రంగా కలచివేసిందని, ఆ సమయంలో తాను ఎంతో భయాందోళనకు గురయ్యానని



మెలిందా తెలిపారు. కానీ, ఆ తర్వాత తన జీవితం ఆనందంగా కొనసాగుతోందని ఆమె వెల్లడించారు. ఇటీవల బిల్ గేట్స్ విడుదల చేసిన 'సోర్స్ కోడ్' పుస్తకం గురించి ప్రస్తావించగా, ఓ టీవీ ఇంటర్వ్యూలో ఆయన మెలిందాతో విడాకులు తనను చాలా బాధించాయని చెప్పడం గమనార్హం. దాదాపు మూడు దశాబ్దాల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ బిల్ గేట్స్ మరియు మెలిందా 2021లో విడాకులు తీసుకున్నారు. వారికి ఇరవై ఏళ్లకు పైబడిన ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేవలం మైక్రోసాఫ్ట్ అధినేతలుగానే కాకుండా, అనేక సేవా కార్యక్రమాల ద్వారా ఈ జంట ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందారు. అయితే, వారి విడాకులకు దారితీసిన అసలు కారణాలను మాత్రం వారు బహిరంగంగా వెల్లడించలేదు. అయితే, ప్రముఖ పత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్ గతంలో ఒక కథనంలో సంచలన విషయం పేర్కొంది. లైంగిక నేరాల కేసులో నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో బిల్ గేట్స్‌కు ఉన్న సంబంధం మెలిందాను తీవ్రంగా కలచివేసిందని, అందుకే ఆమె విడాకులు తీసుకున్నారని ఆ కథనంలో పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ, మెలిందా తాజా వ్యాఖ్యలు వారి విడాకులకు గల అంతర్గత కారణాలపై కొంత స్పష్టతనిచ్చాయి. బంధంలో విలువలు ముఖ్యమని, వాటిని కాపాడుకోలేకపోతే విడిపోవడమే సరైన నిర్ణయమని ఆమె చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ఇద్దరూ తమతమ జీవితాల్లో ముందుకు సాగుతున్నారు.

## అంతరిక్షంలో మద్యం తయారు చేస్తున్న జపాన్ కంపెనీ! ధర తెలిస్తే షాక్!



ఒకరోజు చంద్రునిపై మనుషులు శాశ్వతంగా నివసించగలరనే కలను సాకారం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, అంతరిక్ష సంస్థలు కృషి చేస్తున్నాయి. నాసా నుండి ఇస్రో వరకు, అన్ని అంతరిక్ష మిషన్ల లక్ష్యం ఇప్పుడు చంద్రునిపైకి చేరుకోవడం మాత్రమే కాదు, మానవ నివాసాలను ఏర్పాటు చేసే అవకాశాలను అన్వేషించడం. భవిష్యత్తులో మనుషులు నిజంగా చంద్రునిపై నివసించడం ప్రారంభిస్తే అక్కడి జీవితంలో మద్యం కూడా అవసరం. జపాన్‌లోని ప్రసిద్ధ బ్రూవరీ కంపెనీ అసహి షుజో ఈ ఆలోచనను ముందుకు తీసుకెళ్తోంది. ఈ కంపెనీ బియ్యంతో తయారు చేయబడిన సాంప్రదాయ జపనీస్ మద్యం 'సాకే'ని తయారు చేస్తుంది. జపాన్ సంస్కృతిలో దీనికి ముఖ్యమైన స్థానం ఉంది. ఇప్పుడు అసహి షుజో చంద్రునిపై సాకే తయారు చేయడానికి సిద్ధమవుతోంది.

**ఒక్కో సీసా ధర కోట్లలో....** ఫిబ్రవరిలో టోక్యోలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రత్యేకంగా అంతరిక్షంలో తయారు చేయడానికి ఉద్దేశించిన 'దస్సాయి మూన్' సాకే బాటిల్‌ను కంపెనీ విడుదల చేసింది. 100ఎంఎల్ సీసా ధర 110 మిలియన్ యెన్, అంటే దాదాపు 7.38 లక్షల అమెరికన్ డాలర్లు (సుమారు 6 కోట్ల రూపాయలు). ఇది సాధారణ మద్యం కాదు, అంతరిక్షంలో తయారయ్యే మొదటి మద్యం. ఇది కేవలం ప్రచార స్టంట్ కాదని, రాబోయే కాలంలో చంద్రునిపై జీవిత అవకాశాలతో భావోద్వేగ అనుబంధం కూడా ఉందని అసహి షుజో చెబుతోంది. తాము దీనిని ఒక్కసారి ప్రయత్నించడానికి మాత్రమే చేయడం లేదని, చంద్రునితో ప్రారంభించి మరిన్ని అవకాశాలను అన్వేషించాలనుకుంటున్నామని కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో కజుహిరో సకురాయ్ చెప్పారు.

**అంతరిక్షంలో సాకే తయారీ...** ఈ ప్రత్యేక మిషన్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి ప్రారంభమవుతుంది. అక్కడ చంద్రుని ఉపరితలం వంటి గురుత్వాకర్షణ పరిస్థితులను పునఃసృష్టిస్తారు. దీని కోసం ప్రత్యేక బ్రూయింగ్ పరికరాలు, అవసరమైన పదార్థాలు సెప్టెంబరు నాటికి అంతరిక్షంలోకి పంపబడతాయి. అక్కడి నుండి చంద్రునిపై సాకే తయారీ ప్రారంభమవుతుంది. ఈ ప్రయత్నం మానవులు చంద్రునిపై శాశ్వత నివాసం ఏర్పరచుకోవడానికి సన్నాహకంగా పరిగణిస్తారు. దస్సాయి మూన్ సాంకేతికత, ఆహార శాస్త్రం ప్రత్యేక సమ్మేళనం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో చంద్రుని జీవితంలో మద్యం రుచిని తీసుకురావడానికి ఒక గొప్ప ప్రయత్నం కూడా.

చురకలు



చురకలు

## సంపాదకీయం

# చైనా ఆయువుపట్టుపై కొట్టిన అమెరికా?

అమెరికాలోని నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ తమ దేశంలో సైబర్ దాడులకు పాల్పడిందని చైనా తీవ్రంగా ఆరోపించింది. ఈ మేరకు హర్బిన్ నగర పోలీసులు ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరిలో జరిగిన 9వ ఆసియాన్ వింటర్ గేమ్స్ సందర్భంగా ఈ సైబర్ దాడులు జరిగాయని చైనా పేర్కొంది. ఈ వ్యవహారంలో ముగ్గురు ఎన్ఎస్ఏ ఏజెంట్ల పేర్లను కూడా వాంటెడ్ జాబితాలో చేర్చింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, వర్జీనియా టెక్ సంస్థలు కూడా ఈ సైబర్ దాడుల్లో భాగమయ్యాయని తమ దర్యాప్తులో తేలిందని చైనా ఆరోపించింది. అయితే, ఈ సంస్థలు ఏ విధంగా దాడుల్లో పాలుపంచుకున్నాయనే విషయాన్ని మాత్రం చైనా వెల్లడించలేదు. నిందితుల జాబితాలో అమెరికాకు చెందిన కేథరిన్ ఎ విల్సన్, రాబర్ట్ జె స్నెల్లింగ్, స్టీఫెన్ డబ్ల్యూ జాన్సన్లు ఉన్నారని చైనా తెలిపింది. వీరు చైనాలోని కీలకమైన మౌలిక సదుపాయాలు, ముఖ్యమైన సంస్థలను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడులకు పాల్పడ్డారని పేర్కొంది. బాధితుల్లో ప్రముఖ టెలికాం దిగ్గజం హువావే కూడా ఉందని చైనా తెలిపింది. ఈ మేరకు చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని గ్లోబల్ టైమ్స్ పత్రిక కథనం వెల్లడించింది. ఇదిలా ఉండగా, ఏప్రిల్‌లో చైనాకు చెందిన నేషనల్ కంప్యూటర్ వైరస్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్, నేషనల్ ఎమర్జెన్సీ లాబోరేటరీ ఫర్ కంప్యూటర్ వైరస్ ప్రివెన్షన్ టెక్నాలజీ సంయుక్తంగా ఒక నివేదికను విడుదల చేశాయి. 9వ ఆసియా వింటర్ గేమ్స్‌ను సైబర్ దాడుల ద్వారా దెబ్బతీయాలని కొన్ని విదేశీ శక్తులు ప్రయత్నించాయని ఆ నివేదికలో పేర్కొన్నారు. ముఖ్యమైన మౌలిక సదుపాయాలపై దాడి చేసి గందరగోళం సృష్టించి, డేటాను దొంగిలించడానికి ప్రయత్నించారని వెల్లడించారు. తాము పరిశీలించిన డేటా ప్రకారం, 63.24 శాతం దాడులు అమెరికా కేంద్రంగానే జరిగాయని నివేదిక స్పష్టం చేసింది. అమెరికాలోని ఎన్ఎస్ఏ కార్యాలయంలోని ఎస్32 అనే కోడ్‌నేమ్‌తో ఉన్న సంస్థ ఈ దాడులను నిర్వహించిందని పేర్కొంది. ఇది సిగ్నల్ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్‌కు చెందిన విభాగమని తెలిపింది. అయితే, బీజింగ్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం ఈ ఆరోపణలపై ఇంకా స్పందించలేదు. అమెరికా–చైనాల మధ్య ఇప్పటికే తీవ్రమైన వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఆరోపణలు వెలుగు చూడటం గమనార్హం. ఇటీవల ఇరు దేశాలు తమ పౌరులకు ట్రావెల్ వార్నింగ్‌లు కూడా జారీ చేశాయి. అంతేకాకుండా, అమెరికా చిత్రాలను తమ దేశంలోకి అనుమతించబోమని చైనా ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తాజా సైబర్ దాడి ఆరోపణలు ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత దిగజార్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హిమోఫిలియా పట్ల అవగాహన అవసరం - ఏప్రిల్ 17...ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం




వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫిలియా స్థాపకుడైన ఫ్రాంక్ ష్నాబెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 17వ తేదీని ప్రపంచ హిమోఫిలియా దినోత్సవంగా జరుపుకుంటారు. రక్తస్రావం రుగ్మత గురించి అవగాహన పెంచడానికి మరియు విధాన రూపకర్తల దృష్టికి తీసుకురావడానికి, ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17ని ప్రపంచ హిమోఫిలియా దినోత్సవంగా జరుపుకుంటారు. హిమోఫిలియా 10వ శతాబ్దంలో కనుగొనబడింది. ప్రధానంగా మగవారిలో కనుగొనబడింది. అప్పుడు ఈ వ్యాధిని అబులాస్సిస్ అని పిలిచేవారు. 1937 సంవత్సరంలో, హిమోఫిలియా జన్యుపరమైన రుగ్మత %ఏ% మరియు %బి% అని రెండు రకాలుగా విభజించ బడింది, అయితే, అప్పటి వరకు సరైన చికిత్స కనుగొనబడలేదు. ఆ తర్వాత ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచి, ఈ తీవ్రమైన ఆరోగ్య సమస్యపై సరైన శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని వారికి తెలియజేయాలని నిర్ణయించారు. 1963లో, హిమోఫిలియాకి రోగులందరికి చికిత్స మరియు సంరక్షణను మెరుగు పరచడానికి వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫిలియా స్థాపించ బడింది.

హిమోఫిలియా అనేది అధిక రక్తస్రావంతో కూడిన రుగ్మత. రక్తం గడ్డకట్టే ప్రొటీన్లు లేకపోవడం వల్ల రోగి రక్తం సరిగ్గా గడ్డకట్టకుండా ఉండే అరుదైన రుగ్మత హిమోఫిలియా. హిమోఫిలియాతో బాధపడుతున్న వ్యక్తికి గాయం అయినప్పుడు, గడ్డకట్టే కారకాలు లేకపోవడం వల్ల అతనికి అధిక రక్తస్రావం జరుగుతుంది తీవ్రమైన హిమోఫిలియాతో బాధపడుతున్న వ్యక్తులు ఎటువంటి కారణం లేకుండా రక్తస్రావం కావచ్చు. రక్తం గడ్డకట్టే ప్రొటీన్లు లేకపోవడం వల్ల రోగి రక్తం సరిగ్గా గడ్డకట్టకుండా ఉండే అరుదైన రుగ్మత హిమోఫిలియా. హిమోఫిలియాతో బాధపడుతున్న వ్యక్తికి గాయం అయినప్పుడు, గడ్డకట్టే కారకాలు లేకపోవడం వల్ల అతనికి అధిక రక్తస్రావం జరుగుతుంది. వారు ఇతరులకన్నా వేగంగా రక్తస్రావం చేయరు, వారు ఎక్కువసేపు రక్తస్రావం చేస్తారు. హిమోఫిలియా మరియు ఇతర రక్తస్రావ రుగ్మతలు తగినంత గడ్డకట్టే కారకాలు లేనందున ఒక వ్యక్తి సాధారణం కంటే ఎక్కువ కాలం రక్తస్రావం అయ్యేలా చేస్తాయి. తీవ్రమైన పరిస్థితి ఉన్న కొందరు రోగులు కండరాలు, కీళ్లు మరియు శరీరంలోని ఇతర భాగాలలో రక్తస్రావం కూడా అనుభవించవచ్చు. ఈ రుగ్మత యొక్క ఇతర లక్షణాలు దంత పని తర్వాత అధిక రక్తస్రావం, లోతైన లేదా పెద్ద గాయాలు, టీకా తర్వాత అసాధారణ రక్తస్రావం, మూత్రం లేదా మలంలో రక్తం, తెలియని కారణం లేదా వాపు, మరియు కీళ్లలో నొప్పి లేదా బిగుతు వంటివి కూడా ఉన్నాయి. తీవ్రమైన హిమోఫిలియా ఉన్నవారికి, తలపై చిన్న గడ్డ మెదడులో రక్తస్రావం కలిగిస్తుంది, ఇది తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. హిమోఫిలియా అనేది వారసత్వంగా వచ్చే రుగ్మత మరియు ఇది సాధారణంగా తల్లిదండ్రుల నుండి పిల్లలకు సంక్రమిస్తుంది. తేలికపాటి హిమోఫిలియా సాధారణంగా యుక్తవయస్సు వరకు నిర్ధారణ చేయబడదు మరియు ఏదైనా శస్త్రచికిత్స ప్రక్రియలో గుర్తించబడవచ్చు. అందువల్ల, ముందస్తు రోగ నిర్ధారణ కోసం గుర్తింపు అవగాహన పెంచడం అత్యవసరం. హిమోఫిలియా అనేది జన్యుపరమైన పరిస్థితి. రక్తం గడ్డకట్టే కారకాలు తయారీకి సమాచారాన్ని అందించే జన్యువులో మ్యుటేషన్ లేదా మార్పు కారణంగా ఇది సంభవిస్తుంది. ఈ జన్యువు %ఎక్స్% క్రోమోజోమ్‌లో ఉన్నందున, మగవారిలో హిమోఫిలియా ఎక్కువగా ఉంటుంది. ఆడవారు వ్యాధి వాహకాలు మరియు అరుదుగా హిమోఫిలియా కలిగి ఉంటారు. ప్రస్తుతం అనేక ప్రజాసంఘాలు మరియు ప్రజలచే అవగాహన పెంచే ప్రచారాలు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు మొదలైనవి నిర్వహిస్తున్నారు. హిమోఫిలియా వ్యాధి గురించి సాధారణ ప్రజలకు తెలియజేయడానికి వివిధ రకాల కార్యకలాపాలు నిర్వహించ బడుతున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బహుముఖ ప్రజ్ఞాశాలి బెంజమిన్ ఫ్రాంక్లిన్ - ఏప్రిల్ 17...బెంజమిన్ ఫ్రాంక్లిన్ వర్ధంతి



బెంజమిన్ ఫ్రాంక్లిన్ (జనవరి 17, 1706 – ఏప్రిల్ 17, 1790) అమెరికా విప్లవంలో పాల్గొని అమెరికా దేశాన్ని, రాజ్యాంగాన్ని స్థాపించిన విప్లవకారుల్లో ఒకడు. ఆయన బహుకళా ప్రావీణ్యుడు, గొప్ప రచయిత, చిత్రకారుడు, రాజకీయ నాయకుడు, శాస్త్రవేత్త, మేధావి. ఆయన కనిపెట్టిన వాటిలో "ఛత్వారపు కళ్ళద్దాలు", "ఓడొమీటర్ (ప్రయాణించిన దూరాన్ని సూచించేది)" మొదలగునవి చాలనే ఉన్నాయి. అగ్నిమాపక విభాగం, తపాలా సేవ, ఆసుపత్రి, లైబ్రరీ, అకాడమీ స్థాపనలో ఫ్రాంక్లిన్ ప్రధాన పాత్ర పోషించాడు. ఫ్రాంక్లిన్ "మొదటి అమెరికన్" అనే బిరుదుని కూడా పొందాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ 1706 జనవరి 17 ఆదివారం మసాచుసెట్స్‌లోని బోస్టన్‌లో జన్మించాడు. పిడుగులు పడి ఎన్నో విలువైన కట్టడాలు కూలిపోతూ ఉందడాన్ని చూసిన ఆయన, పిడుగుల బారి నుండి కట్టడాలను కాపాడటం కోసం "లైట్నింగ్ కండక్టర్" లను తొలిసారిగా 1752లో రూపొందించాడు. సముద్రం మీద కూడా ఎన్నో రకాల పరిశోధనలు చేసి సముద్రంలో చమురు వేస్తే దాని అలజడి తగ్గుతుందని కనుగొన్నాడు. ఆయన రూపొందించిన స్టౌవ్ లు, బై ఫోకల్ కంటి అద్దాలు ఇప్పటికీ వాడబడుతూ ఉన్నాయి. ఆమ్లీకృతంగా ఉన్న భూములలో సున్నం కలిపి తటస్థం చేయవచ్చని సూచించాడు. గాలి, వెలుతురు లేని చోట్ల అంటువ్యాధులు త్వరగా ప్రబలుతాయని కూడా హెచ్చరించాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తండ్రి బెన్ బోధకుడిగా మారాలని కోరుకున్నాడు. ఎనిమిదేళ్ళ వయసులో అతన్ని వ్యాకరణ పాఠశాలకు పంపాడు. పది సంవత్సరాల వయస్సు వరకు కొత్త పాఠశాలలోనే ఉన్నాడు. తన పాఠశాల రోజుల నుండి, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఒక నావికుడు కావాలను కున్నాడు. అతని తండ్రి అంగీకరించ లేదు. బెన్‌ను తన అన్నయ్య ప్రింటింగ్ షాపులో నేర్చుకోవడానికి పంపాడు. బెన్ ఫిలడెల్ఫియా, తర్వాత ఇంగ్లాండ్‌లో ఈ అభ్యాసాన్ని కొనసాగించాడు. చివరికి ఫిలడెల్ఫియాలో తన సొంత ముద్రణ వ్యాపారాన్ని స్థాపించాడు. రాజకీయాలతో సంబంధం పెట్టుకునే ముందు, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఫిలడెల్ఫియాలో ఒక ప్రింటింగ్ షాపును కలిగి, 1747 లో ప్రింటింగ్ నుండి రిటైర్ అయ్యాక, ఫిలడెల్ఫియా యొక్క పోస్ట్ మాస్టర్, బ్రిటిష్ నార్త్ అమెరికా కో–డిప్యూటీ పోస్ట్ మాస్టర్ గా కూడా పనిచేశాడు. 1775 లో, అతను యునైటెడ్ స్టేట్స్ యొక్క మొదటి పోస్ట్ మాస్టర్ జనరల్ అయ్యాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ సుదీర్ఘ ఆవిష్కరణల జాబితాలో బైఫోకల్స్, మెరుపు రాడ్, గ్లాస్ అర్మోనికా, ఒక లైబ్రరీ కుర్చీ, ఈత రెక్కలు, దీర్ఘకాల పరికరం, ఫ్రాంక్లిన్ స్టవ్, కాథెటర్ తదితరులు ఉన్నాయి. 1741 లో, బెన్ ఫ్రాంక్లిన్ స్టవ్ అనే ఇనుప కొలిమిని కనుగొన్నాడు. బెన్ వయసు పెరిగేకొద్దీ అతని దృష్టి క్షీణించింది. అతను చదవడానికి ఇష్టపడ్డాడు. రెండు జతల గ్లాసుల మధ్య మారడం అలసి పోయాడు. ఒకటి విషయాలు దగ్గరగా చూడటానికి అతనికి సహాయ పడింది, మరొకటి దూరంగా చూడటానికి. అందువల్ల అతను రెండు జతల నుండి కటకములను సగానికి కట్ చేసి, ఆపై ప్రతి లెన్స్‌లో సగం ఒకే చట్రంలో ఉంచి, బైఫోకాల్స్‌ను కనుగొన్నాడు. తన జీవిత కాలంలో, బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనేక రచనలు చేశాడు. బాగా తెలిసిన వాటిలో పూర్ రిచర్డ్ యొక్క అల్మానాక్ , రిచర్డ్ సాండర్స్ అనే మారుపేరుతో రాసిన వార్షిక ప్రచురణ తదితరాలు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీ, పెన్సిల్వేనియా హాస్పిటల్ మరియు ఫ్రాంక్లిన్ మరియు మార్షల్ కాలేజీని స్థాపించారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తన జీవిత కాలంలో అనేక అంతర్జాతీయ ప్రయాణాలు చేశాడు. 1776–84: ఫ్రాన్స్‌కు అమెరికన్ కమిషనర్‌గా పనిచేస్తూ, ఫ్రాన్స్‌తో కూటమి ఒప్పందంపై చర్చలు జరిపారు. ఫ్రాంక్లిన్ సుభాషితాలలో....మరణానంతరం కూడా గుర్తుండాలంటే చదవదగిన పుస్తకాలు వ్రాయి లేదా వ్రాయదగిన పనులు చెయ్యి. తృప్తి పేదవాడ్ని ధనవంతుడిగా చేస్తుంది. అసంతృప్తి గొప్పవాణ్ణి పేదవాడిగా మారుస్తుంది. కోపంతో మొదలుపెట్టిన పని తప్పనిసరిగా అవమానాల పాలౌతుంది. ఖాళీ సమయం కావాలనుకుంటే సమయాన్ని సరిగ్గా వినియోగించు కోవాలి. కారణం లేకుండా ఎవరికి కోపం రాదు. అయితే ఎప్పుడో గాని సరైన కారణం ఉండదు. సహనం కలవాడు ఏదైనా సాధించగలడు. మంచి యుద్ధం, చెడ్డ శాంతి అనేది ఎప్పుడూ ఉండదు... ఆయనకు జీవిత కాలంలో ఎన్నో గౌరవ పురస్కారాలు లభించాయి. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ లో అతను సభ్యుడిగా ఎన్నుకోబడ్డాడు. అమెరికా స్వాతంత్ర్యం కోసం కృషి చేసి, 1766 జూలై 4న స్వాతంత్ర్య ప్రకటన చేస్తూ సంతకాలు చేసిన వారిలో ఫ్రాంక్లిన్ కూడా ఉన్నాడు. 1777 లో రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు ఇతను కూడా ఎంతగానో సహకరించాడు. శాస్త్రవేత్తగా, రాజకీయవేత్తగా పరిణితి చెందిన ఆయన 1770 ఏప్రిల్ 17న మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దేశాధ్యక్షుడు అయిన తత్వవేత్త - ఏప్రిల్ 17... సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ (సెప్టెంబర్ 5, 1888 %–% ఏప్రిల్ 17, 1975) భారత దేశపు మొట్ట మొదటి ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి. భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారని పేరెన్నిక గన్న మహా మహోపాధ్యాయుడు. రెండు పర్యాయాలు ఉప రాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారత దేశపు అత్యంత క్లిష్టకాలంలో (చైనా, పాకిస్తాన్లతో యుద్ధ సమయం) నాటి ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు. మహా మేధావిగా, గొప్పవ్యక్తిగా, గొప్ప గ్రంథకర్తగా, తత్వవేత్తగా, ప్రపంచ దేశాల మన్ననను అందుకున్న రాధాకృష్ణన్ భారతీయ మహర్షుల కోవకు చెందిన వారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5– 1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో తమిళ నాడుకు వలస వెళ్లిన తెలుగు దంపతులు అయిన సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. వీరాస్వామి ఒక జమీందారీలో తహసిల్దార్. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యా భ్యాసము ఎక్కువగా తిరుత్తణి, తిరుపతిలోనే గడిచి పోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగు చోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందారు. బాల్యం నుండి అసాధారణమైన తెలివి తేటలు కలవారాయన. 21 సంవత్సరాలైనా దాటని వయసులో ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యారు. తత్వశాస్త్రంలో ఆయన ప్రతిభను తెలుసుకుని, మైసూరు విశ్వ విద్యాలయం ఉపకులపతి హెచ్.వి.నంజుండయ్య ఆయనను పిలిపించి ప్రొఫెసర్ గా నియమించారు. ఆయన ఉపన్యాసాలను ఎంతో శ్రద్ధగా వినేవారు విద్యార్థులు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్య పదవి చేపట్టమని, డా. అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ టాగూర్‌లు కోరారు. దాంతో అతను కలకత్తా వెళ్ళారు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్యుడుగా వున్నప్పుడు అతను 'భారతీయ తత్వశాస్త్రం' అన్న గ్రంథం వ్రాశారు. ఆ గ్రంథం విదేశీ పండితుల ప్రశంస లందుకున్నది. 1931లో డా. సి.ఆర్.రెడ్డి గారి తర్వాత రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సిలర్‌గా పనిచేశారు. అప్పట్లో డా. రాధాకృష్ణన్ పిలుపును అనుసరించి ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ, హుమయూన్ కబీర్ వంటి మేధావులు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్లుగా పనిచేశారు. 1931లోనే రాధాకృష్ణన్ "లీగ్ ఆఫ్ నేషన్స్ 'ఇంటలెక్చ్యువల్ కో–ఆపరేషన్ కమిటీ'" సభ్యులుగా ఎన్నుకో బడినారు. 1936లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రాచ్య మతాల గౌరవ అధ్యాపకునిగా అయినారు. చైనా, అమెరికా దేశాల్లో పర్యటించి పెక్కు ప్రసంగాలు చేశారు. 1946లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు అయినారు. 1947 ఆగస్టు 14–15తేదీన మధ్య రాత్రి



'స్వాతంత్ర్యోదయం' సందర్భాన రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం సభ్యులను ఎంతో ఉత్తేజ పరిచింది. 1949లో భారత దేశంలో ఉన్నత విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టాలి అన్న లక్ష్యంతో ప్రభుత్వం ఒక కమిటి నియమించింది. దానికి అధ్యక్షుడు డా. రాధాకృష్ణననే. డా.రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూ కోరిక మేరకు 1952–62 వరకు భారత ఉప రాష్ట్రపతిగా పనిచేశారు. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టిన రోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని అతను కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును "ఉపాధ్యాయ దినోత్సవం"గా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. రాధాకృష్ణన్ ది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారి వృత్తి చేయ మన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతి లోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ చదువంతా ఉపకార వేతనాల తోనే సాగి పోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో అతను నేలను శుభ్ర పరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగి యిచ్చేవారు. ఆయన దృష్టిలో తత్వము అనేది జీవితాన్ని అర్థం చేసు కోవటానికి ఒక మార్గము, భారతీయ తత్వమును అర్థం చేసు కోవటం అనేది ఒక సాంస్కృతిక చికిత్సగా భావించే వారు. భారతీయ ఆలోచనా దృక్పధాన్ని పాశ్చాత్య పరిభాషలో చెప్పి, అందులో వివేకము, తర్కము ఇమిడి ఉన్నాయని చూపించి, భారతీయ తాత్విక చింతన ఏమాత్రం తక్కువ కాదని నిరూపించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తాత్విక శాస్త్ర ఉపన్యాసకుడిగా, ఉప ప్రాధ్యాపకుడిగా, ప్రాధ్యాపకుడిగా వివిధ పదవులను అలంక రించారు. 1918 నుండి 1921 వరకు మైసూరు విశ్వ విద్యాలయంలో తత్వశాస్త్ర ప్రాధ్యాపకుడిగా (ప్రొఫెసర్) పని చేసారు. 1921లో, అప్పటి భారతదేశం లోని కలకత్తా విశ్వ విద్యాలయంలో ముఖ్య తాత్విక పీఠమైన, కింగ్ జార్జ్ 5 చెయిర్ ఆఫ్ మెంటల్ అండ్ మోరల్ సైన్స్ కు రాధాకృష్ణన్‌ను నియమించారు. 1926 జూన్‌లో బ్రిటనులో జరిగిన విశ్వ విద్యాలయాల కాంగ్రేసులో కలకత్తా విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు. తరువాత ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డు విశ్వవిద్యాలయం నిర్వహించే అంతర్జాతీయ తాత్విక కాంగ్రెస్ లో సెప్టెంబర్ 1926లో కూడా కలకత్తా విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు. 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వ విద్యాలయానికి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్)గా పని చేసారు. 1936లో, స్పాల్డింగ్ ప్రొఫెసర్ ఆఫ్ ఈస్టర్న్ రిలీజియన్స్ అండ్ ఎథిక్స్ అనే పీఠంలో ఆక్స్‌ఫర్డు విశ్వ విద్యాలయంలో 1952లో భారతదేశ ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించే వరకు కొన సాగారు. 1939 నుండి 1948 వరకు బెనారస్ హిందూ విశ్వ విద్యాలయానికి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్)గా, 1949 నుండి 1952 వరకు రష్యాలో భారత రాయబారిగా పని చేసారు. 1946 నుండి 1950 వరకు పలుమార్లు భారతదేశం తరుపున యునెస్కో సభ్య బృందానికి అధ్యక్షత వహించారు. 1948లో విశ్వ విద్యాలయాల విద్యా కమిషనుకు అధ్యక్షుడిగా భారత ప్రభుత్వంచే నియమింప బడ్డారు. 1948లో యునెస్కో కార్యనిర్వాహక బృందానికి అధ్యక్షుడిగా ఉన్నారు. 1952లో యునెస్కో అధ్యక్షునిగా ఎంపిక అయ్యాడు. 1962లో బ్రిటీషు ఎకాడమీకి గౌరవ సభ్యునిగా ఎన్నుకో బడ్డారు. 1931లో బ్రిటీషు ప్రభుత్వం వారు ఇచ్చే ప్రతిష్ఠాత్మక "సర్" బిరుదు ఆయనను వరించింది. 1954లో మానవ సమాజానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా భారత దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన "భారతరత్న" బిరుదు పొందారు. 1961లో జర్మనీ పుస్తక సదస్సు యొక్క శాంతి బహుమానం పొందారు. 1963 జూన్ 12న బకింగ్ హామ్ ప్యాలెస్ లోని ఆర్డర్ ఆఫ్ మెరిట్‌కి గౌరవ సభ్యునిగా ఎన్నుకో బడ్డారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలయిన ఆక్స్‌ఫర్డు, కేంబ్రిడ్జి, మొదలయిన వాటి నుండి వందకు పైగా గౌరవ పురస్కారాలు, డాక్టరేటులు సంపాదించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం - అగ్ని ప్రమాదాల వారోత్సవాల సందర్భంగా




అగ్ని వలన జరిగే ప్రమాదాలను అగ్ని ప్రమాదాలు అంటారు. ఇవి వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ మూడవ వారంలో వారం రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతారు. ఆర్టీసీ బస్టాండ్లు, పెట్రోల్ బంకులు, మార్టు, అపార్ట్మెంట్లు, పాఠశాలలు, ఫ్యాక్టరీల, గ్యాస్ సరఫరా కేంద్రాల వద్ద డెమో నిర్వహిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు... ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతి క్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టం కలుగకుండా నివారించ వచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియచేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యుదాఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాలవుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్ట వచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు, అయోమయానికి గురికాకుండ ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు. ఆసుపత్రులు, హోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలో గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అధిక నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టెయిర్ కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించటానికి మరో స్టెయిర్‌కేస్ సమకూర్చు కోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసు కోవాలి. స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయో గించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం , వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయ బడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. అగ్ని ప్రమాదం సంభించినపుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారిని పిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారు పడక, జాగ్రత్తగా వ్యవహరించాలి. దుస్తులకు నిప్పంటుకున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పు కోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పనుల్లో నిర్లక్ష్యం.. నాణ్యతకు తిలోదకాలు

హైదరాబాద్: రూ.వందల కోట్లకు ప్లాట్లను విక్రయించిన హెచ్ఎండీఏ మౌలిక వసతుల పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గడువు దాటినా ఇంకా సగం పనులు కూడా పూర్తి కాకపోవడం.. పనుల్లో నాణ్యత లేకపోవడంతో ప్లాట్ల యజమానులు మండిపడుతున్నారు. ఈ మేరకు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ దృష్టికి తమ సమస్యలను వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తీసుకెళ్లారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లిలో సర్వే నంబరు 62(62/2) ల్యాండ్ పూలింగ్ స్కీం కింద 56.28 ఎకరాల్లో లేఅవుట్‌ను హెచ్ఎండీఏ చేపట్టింది. ఇందులో 434 ప్లాట్లను రెండు ఫేజ్‌లుగా 2023 ఫిబ్రవరి, జూన్ నెలల్లో ఆన్‌లైన్‌లో విక్రయించగా చాలామంది ముందుకొచ్చి వీటిని కొనుగోలు చేశారు. ఒక్కో గజం రూ.45 వేల పైనే పలికింది. ప్లాట్లు విక్రయించిన 18 నెలల్లోపు మౌలిక వసతులు కల్పిస్తామని హెచ్ఎండీఏ కొనుగోలుదారులకు హామీ ఇచ్చింది. గడువు 2024 జులైతో ముగిసింది. అభివృద్ధి పనుల్లో భాగంగా భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు, వీధి దీపాలు, పార్కులు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. మొత్తం రూ.15 కోట్ల నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు.



పనుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని, నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపిస్తోంది. డ్రైనేజీ పైపులైన్లు నిర్మించే ముందు పైపుల కింద డస్ట్‌ను బెడ్‌గా వేయాలని, అయితే ఎలాపడితే అలా పనులు చేస్తున్నారని అసోయేషన్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మరెడ్డి అన్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. రెండేళ్లు గడుస్తున్నా రోడ్లు, విద్యుత్తు, భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేయలేదని తెలిపారు. లేఅవుట్‌లో తొలుత ఓవర్‌హెడ్ ట్యాంకు, సంపు నిర్మిస్తామని హామీ ఇచ్చారని ప్రస్తుతం ఆ పనులకు కూడా తిలోదకాలు ఇస్తున్నారన్నారు. సీపీఆర్ఐ పర్వతాపూర్ 60 అడుగుల అప్రోచ్ రోడ్డు సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. లేఅవుట్‌లో 2 ఎకరాల వాటర్ లాగింగ్ అయ్యే ప్రాంతంలో భవన వ్యర్థాలతో పూడ్చి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తక్షణం తమ సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎండీఏ కమిషనర్‌కు అందించిన వినతిలో కోరారు.

# దరఖాస్తు చేసి.. వెనుకడుగేసి!

కరీంనగర్ : సౌరశక్తి ఉత్పత్తిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువగా దృష్టి సారించాయి. సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు కేంద్రం సహకారం అందిస్తోంది. పీఎం కుసుమ్ ద్వారా పంట పొలాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించడంతోపాటు దరఖాస్తులు ఆహ్వానించింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 592 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తామని 465 దరఖాస్తులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో సౌరశక్తి ద్వారా విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి చాలామంది ఔత్సాహికులు ముందుకొచ్చారు. 465 దరఖాస్తులు రాగా అత్యధికంగా కరీంనగర్ జిల్లా, అత్యల్పంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వచ్చాయి. దరఖాస్తుదారులందరికీ సౌర యూనిట్లు స్థాపనకు అవకాశం కల్పిస్తారా? లేదా చూడాలి. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ఉమ్మడి జిల్లాకు కోటా కేటాయిస్తారా? లేక జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తుదారులందరికీ అవకాశం ఇస్తారా? అనే విషయంపై స్పష్టత లేదు. అధికారులు మాత్రం జిల్లాల వారీగా వచ్చిన ఈఎండీ చెల్లించిన దరఖాస్తుదారులందరికీ అవకాశం ఇస్తారని అంటున్నారు.



ఒక్కో మెగావాట్ సౌరవిద్యుత్తు ఉత్పత్తికి రూ.3.50 కోట్ల ఖర్చు అవుతుందని అంచనాలు రూపొందించారు. ఇందుకు బ్యాంకుల ద్వారా రుణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదట్లో ఒక్కో మెగావాట్‌కు అయ్యే ఖర్చులో పది శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే 90 శాతం బ్యాంకుల నుంచి రుణం అందేలా చూస్తామని చెప్పారు.

ప్రస్తుతం యూనిట్‌కు అయ్యే ఖర్చులో 30 శాతం దరఖాస్తుదారుడు చెల్లిస్తే మిగిలిన 70 శాతం బ్యాంకులు రుణాలుగా ఇవ్వనున్నాయని సమాచారం. దీంతో ఒక్కో మెగావాట్‌కు రూ.3.50 కోట్లు ఖర్చు అవుతుండగా ఇందులో రూ.1.05 కోట్లు దరఖాస్తుదారుడు భరించాల్సి ఉంటుందని సమాచారం. సౌరశక్తి ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ఔత్సాహికులు ఈ నెల 16లోగా ఒక్కో మెగావాట్‌కు ఎర్నెడ్ మనీ డిపాజిట్ (ఈఎండీ) కింద రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది.

బ్యాంకు రుణం తిరిగి చెల్లించాలని, రాయితీ లేదని తెలిసి.. రెండో దశ ఈఎండీ దరఖాస్తు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11 వరకు 78 దరఖాస్తులు, 97.5 మెగావాట్ల సౌరశక్తి యూనిట్ల ఏర్పాటుకు రూ.లక్ష చొప్పున చెల్లించారు. ఇందులో అత్యధికంగా కరీంనగర్ జిల్లా ఉండగా అత్యల్పంగా పెద్దపల్లి జిల్లా ఉంది. ఈనెల 16 వరకు గడువు ఉండటంతో మరిన్ని దరఖాస్తులకు సంబంధించి ఈఎండీ చెల్లిస్తారని రెడ్కో అధికారులు భావిస్తున్నారు.

# ఈసారైనా గ్రహణం వీడేనా?



బొంరాస్‌పేట : మండల కేంద్రంలో ఇంటర్ తరగతుల ప్రారంభంపై సందిగ్ధం నెలకొంది. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించాక గతేడాది బొంరాస్‌పేటకు జూనియర్ కళాశాల మంజూరు చేశారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించడానికి అధికారులు జడ్పీ ఉన్నత పాఠశాలలోని అందుబాటులో ఉన్న గదులను పరిశీలించారు. గతేడాది జూన్, జులైలో 30 మంది వరకు విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరారు. కళాశాలకు ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని నియమించకపోవడంతో చేరిన విద్యార్థులూ టీసీలు తీసుకొని ఇతర కళాశాలల్లో చేరారు. గత విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం కాకుండానే ముగిసింది.

**అధ్యాపకుల నియామకంలో జాప్యం..**

కళాశాల మంజూరైనా అధ్యాపకుల నియామకంలో జాప్యం నెలకొంది. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీతోపాటు వృత్తివిద్యా కోర్సులైన ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సులు మంజూరు చేశారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఆయా కోర్సుల్లో 80 మంది చొప్పున చేర్చుకోవచ్చు. కళాశాలకు ప్రిన్సిపల్‌తోపాటు 13 మంది అధ్యాపకులు, అయిదుగురు బోధనేతర సిబ్బంది అవసరం. నేటికీ వారిని నియమించలేదు. జూన్‌లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సిబ్బందిని నియమిస్తారా.. లేదా.. అన్న అనుమానం కలుగుతోంది. మండలం నుంచి ఈసారి 400 మందికిపైగా 10వ తరగతి పరీక్షలు రాశారు. పాసైనవారంతా మళ్లీ ఇతర పట్టణాలకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది.

**పునాదులు దాటని భవన నిర్మాణం..**

జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4.72 కోట్లు మంజూరు చేసింది. తుంకిమెట్ల మదర్సా వెనుక భాగంలోని స్థలంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. నెమ్మదిగా సాగుతుండడంతో రెణ్నెల్లయినా పునాదుల దశ దాటడం లేదు. పూర్తి కావడానికే దాదాపు ఏడాది పట్టొచ్చని పలువురు చెబుతున్నారు. అప్పటి వరకు కళాశాలను ఎక్కడ కొనసాగిస్తారనే దానిపై స్పష్టత లేదు.

**తరగతులు ప్రారంభమవుతాయి.. శంకర్ నాయక్, జిల్లా ఇంటర్ అధికారి**

వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రభుత్వం పోస్టులను మంజూరు చేసింది. వాటిని భర్తీ చేయాలి. ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

# కవల పల్లెలు.. ఆవాసాలే ఎల్లలు



సుల్తానాబాద్ : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లి, కరీంనగర్ జిల్లా గ్రామీణ మండలంలోని మద్దులపల్లి గ్రామాల మధ్య రహదారి మాత్రమే అడ్డు. దారికి ఇరువైపులా ఉండే ఇళ్లు రెండు జిల్లాల పరిధిలోకి వస్తాయి. దీంతో కొత్త వారు వచ్చినపుడు ఏ ఇల్లు, ఏ జిల్లా పరిధిలోకి వస్తుందనే గందరగోళం కనిపిస్తుంది. రహదారి పరిశుభ్రత, నిర్వహణను నెలలో రెండు పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులు పదిహేను రోజుల చొప్పున చూస్తారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి గ్రామానికి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు తమ పరిధి ఎక్కడివరకో తెలియక అయోమయానికి గురవుతారు. రెండేళ్ల కిందట మానేరు వాగులో తాగునీటి బోరుబావి తవ్వే సమయంలో ఇలాంటి గందరగోళమే కనిపించింది. చివరకు కరీంనగర్ ఎమ్మెల్యే, నాటి మంత్రి గంగుల కమలాకర్ శంకుస్థాపన చేశారు.

గ్రామాలు.. పంచాయతీలే కాదు, మండలాలు.. జిల్లాలు కూడా వేర్వేరు.. అయినా రెండూళ్లు కలిసే ఉంటాయి. ఒక్క చోటనే కనిపిస్తూ ఆకట్టుకుంటాయి. వివిధ పనులపై అక్కడికి వచ్చే కొత్తవారే కాదు, ప్రభుత్వ పథకాల అమలుకు వచ్చే అధికారులు కూడా హద్దులు తెలియక అయోమయానికి గురవుతుంటారు. పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాల సరిహద్దులు జనావాసాల మధ్యే ఉండటం అబ్బురపరుస్తోంది.

**రాజీవ్ రహదారే సరిహద్దు**

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, భూపతిపూర్ గ్రామాల సరిహద్దులు కలిసే ఉంటాయి. రెండూళ్ల మధ్య నుంచి రాజీవ్ రహదారి వెళుతుండగా గర్రెపల్లి ప్రయాణ ప్రాంగణం, భూపతిపూర్ పంచాయతీ వ్యాపార సముదాయాలు కలిసే ఉంటాయి. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భూపతిపూర్ ప్రాథమిక పాఠశాల, గర్రెపల్లిలోని కేంద్ర ప్రభుత్వ ఆహార గిడ్డంగులు, భూపతిపూర్ ఎస్సీ కాలనీలు కలిసే ఉంటాయి. ఒక్క చోటనే రెండు గ్రామాలు కలిసి ఉండటం కొత్త వారికి వింత అనుభూతినిస్తోంది.

ఎలిగేడు మండలం శివపల్లి, నర్సాపూర్ గ్రామాలు ఆనుకొనే ఉంటాయి. కాట్నపల్లి నుంచి ఎలిగేడు మండలకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా రెండూళ్లుంటాయి. సరిహద్దు ఎక్కువగా కలిగి ఉన్న శివపల్లి పంచాయతీ పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ చూసుకుంటుంది. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు భూమిపూజ చేసిన సమయంలో ఆ స్థలం తమదేనంటూ రెండు గ్రామాల ప్రజలు పేర్కొనడం కొంత గందరగోళానికి దారి తీసింది.

# పరిహారం అందేనా?



జగిత్యాల : అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించాల్సి ఉంటుంది. 2020 వానాకాలంలో అధిక వర్షాలతో రాష్ట్రంలో నష్టపోయిన రైతులకు 3 మాసాల్లోపు పెట్టుబడి రాయితీ (పంట నష్ట పరిహారం), 4 మాసాల్లోపు పంటల బీమా పరిహారాన్ని ఇవ్వాలని హైకోర్టు 2021 సెప్టెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నష్టపోయిన జాబితాలో జిల్లా రైతులు కూడా ఉండగా ఏ ఒక్క రైతుకూ పరిహారం అందలేదు. 2021 వానాకాలంలోనూ అధిక వర్షాలతో జిల్లాలో 30 వేల ఎకరాల్లో, 2021–2022 యాసంగిలో వడగళ్లతో 12 వేల ఎకరాల్లో పంటలను రైతులు కోల్పోయినా పరిహారం ఇవ్వలేదు.

**ఎన్నాళ్లీ దైన్యం** జిల్లాలో 2022 వానాకాలంలో 12,588 మంది రైతులకు చెందిన 22,993 ఎకరాల్లో ఆరుతడి పంటలు, 4,130 ఎకరాల్లో వరి దెబ్బతిన్నాయి. వర్షాలకు పొలాల్లోని లేత పైర్లు నీట మునిగిపోగా మళ్లీ విత్తాల్సి వచ్చింది.

నాటు వేసేందుకు దున్ని సిద్ధం చేసిన పొలాల్లోని మెత్తటి సారవంతమైన పైపొర (హ్యూమస్) వరదకు కొట్టుకుపోయి కేవలం ఇసుక, రాళ్లు మిగలటంతో వేలాది ఎకరాల్లో భూములు ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

సాగు చేసిన తోటలు, పొలాలకుగాను ఎకరాకు కనీసం రూ.15 వేల చొప్పున జిల్లా రైతులు రూ.40 కోట్లకుపైగా నష్టపోయారు. దెబ్బతిన్న పొలాలు, తోట భూములకు మరమ్మతులు చేసి మళ్లీ పంటలు సాగు చేసేందుకు రూ.60 కోట్లకుపైగా వెచ్చించినా పరిహారం చెల్లించలేదు. 2023 మార్చి, ఏప్రిల్ మాసాల్లో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్చిలో జిల్లాలో 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా 532 ఎకరాలకు మాత్రమే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో మామిడి, వరి, మక్క, నువ్వు, జొన్న, కూరగాయలు తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినా ఒక్క రైతుకు పరిహారం చెల్లించలేదు. 2024 వానాకాలంలో జిల్లాలో భారీ వర్షాలతో 9 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా ప్రస్తుత యాసంగిలో 5,522 ఎకరాల్లో పంటలు అకాల వర్షాలతో దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పాత బకాయిలతో పాటు ఈ సీజన్ నష్టానికి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారాన్ని చెల్లించాలని, వచ్చే వానాకాలం నుంచి అయినా పంటల బీమాను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పొలాల్లో గండ్లు పడి గట్లుకూడా నామరూపాల్లేకుండా కొట్టుకుపోగా మడుల్లో ఇసుక మేటలు, బండలు పేరుకు పోయాయి. రైతులు ఎకరాకు కనీసం రూ.17 వేల నుంచి రూ.36 వేల వరకు పెట్టుబడిని కోల్పోగా మరమ్మతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున వెచ్చించారు.

జిల్లాలో 2023 వానాకాలంలో భారీ వర్షానికి 180 గ్రామాలకు చెందిన 14,065 మంది రైతులకు చెందిన 15,487 ఎకరాల్లో అన్నిరకాల పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. భారీ వర్షంతో లోతట్టు, ఎగువ ప్రాంతం, పొలాలు, తోటలనే తేడా లేకుండా అంతటా వరదనీరు ముంచెత్తి పైర్లను తీవ్రంగా నష్టపరిచింది.

# మీ సేవ.. ఇదేం సమస్య

భగత్‌నగర్ : మీ సేవ కేంద్రాల సేవలు సర్వర్ సమస్యతో ఆలస్యమవుతున్నాయి. క్షణాల్లో రావాల్సిన ప్రింటు.. పది నిమిషాల సమయం పడుతోంది. ఒక్కో దరఖాస్తు ఆలస్యం కావడంతో నిర్వాహకులతోపాటు లబ్ధిదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి. గతేడాది సెప్టెంబరులో మీసేవలో సాంకేతిక సమస్య తలెత్తి ఇబ్బందులుపడ్డ లబ్ధిదారులు, నిర్వాహకులు ప్రస్తుతం సర్వర్ మొరాయింపుతో సతమతమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ ప్రకటణ జారీ చేసిన నాటి నుంచి ఈ సమస్య తలెత్తుతోందని నిర్వాహకులు తెలిపారు. రాజీవ్ యువ వికాసానికి ఈనెల 14వ తేదీ తుది గడువు కాగా భారీ సంఖ్యలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఔత్సాహికులు మీ సేవ కేంద్రాలను ఆశ్రయించడంతో సర్వర్‌పై భారం పెరిగింది.




గత నెల రోజులుగా సమస్య ఉన్నా.. మూడు రోజులుగా మరింత ఎక్కువ అయింది. శని, ఆది, సోమవారం మూడు రోజులు వరుస సెలవులు కావడంతో నిర్వాహకులకు లబ్ధిదారులకు ఇబ్బంది కలుగుతోంది. మీ సేవలో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, రిజిస్ట్రేషన్, రవాణా వంటి 36 శాఖలకు సంబంధించిన 350 సేవలు లభిస్తున్నాయి. జనన, ఆదాయ, కుల, నివాస, ధ్రువపత్రాలు కావాల్సిన వారు గతేడాది సాంకేతిక సమస్య తలెత్తి ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం ఇదే సమస్య పునరావృతమవుతోంది. నెల రోజులుగా ఇబ్బంది ఉన్నా.. గత మూడు రోజులుగా సమస్య మరింత తీవ్రమైందని నిర్వాహకులు తెలిపారు.

# ఇంతింతై.. 'స్వశక్తి'మంతమై

కరీంనగర్ : అక్షరం రాకున్నా.. ఉన్నత చదువులు లేకున్నా బతుకు బాటలో విజయ బావుటా ఎగురవేస్తున్నారు. నైపుణ్య శిక్షణ లేకున్నా స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. పల్లె, పట్టణం.. అనే తేడా లేకుంటా పొదుపు మంత్రాన్ని పఠిస్తూ భిన్న రంగాల్లో ఆరి తేరుతున్నారు. సోమవారం మహిళా పొదుపు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో స్వశక్తి సంఘాల విజయ ప్రస్థానంపై ప్రత్యేక కథనం.



**సేవా స్ఫూర్తి.. సహకార దీప్తి**

సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామ సమైక్య సంఘం 'పిడికెడు బియ్యం' పేరిట ఊరిలోని సంఘాల సభ్యులు ప్రతి నెలా ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరిస్తారు. అలా సమకూరిన బియ్యాన్ని నిరుపేదలకిస్తూ ఆకలి తీరుస్తున్నారు. వీరిని చూసి ఉమ్మడి జిల్లాలో 25కి పైగా గ్రామాల్లో మహిళలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అతివలు ఆధునికతను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదిగేలా ఇటీవల పలు సంస్థలు బ్యాంకుమిత్ర, పశుమిత్ర, డ్రోన్ మిత్రలుగా అవకాశం కల్పిస్తున్నాయి. నాలుగు జిల్లాల్లో 654 చోట్ల మహిళలు ఇంట్లోనే ఉంటూ కామన్ సర్వీస్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలతో చిన్నతరహా పరిశ్రమలు, కుట్టు శిక్షణ కేంద్రాలు, చేనేత ఉత్పత్తుల స్టాళ్లు, హోటళ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఆసక్తి చూపుతున్నారు. హుజూరాబాద్ మండలం సిర్సపల్లిలో 42 మంది మహిళలు స్వకృషి పేరిట డెయిరీని ఏర్పాటు చేసుకుని పాల సేకరణ, విక్రయాలతో లాభాలు గడిస్తున్నారు.

# ఆధునిక వసతులతో చింత లేదిక

పెద్దపల్లి : ప్రభుత్వ వైద్యమంటేనే బెదిరిపోయే రోజు నుంచి.. సర్కారు ఆసుపత్రులకు వరుస కట్టే పరిస్థితులు వచ్చాయి. ఈ క్రమంలో పెద్దపల్లి ప్రభుత్వ వైద్యశాలలో వసతులు మెరుగయ్యాయి. పదేళ్ల క్రితం వరకు ఇక్కడి ఆస్పత్రిలో రోగుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉండేది. ప్రస్తుతం ఇందులో మెరుగైన వసతులు, విస్తరించిన సేవలతో జిల్లా ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య అధికమైంది. రోగుల తాకిడికి తగిన విధంగా ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. గత రెండు నెలల వ్యవధిలో పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి దశ మారింది.

**అదనంగా 5 ఓపీ కౌంటర్లు**

ఆస్పత్రిలో అవుట్ పేషెంట్(ఓపీ) సేవలకు నిత్యం 900 నుంచి వెయ్యి మంది రోగులు వస్తున్నారు. గతంలో ఓపీ సంఖ్య వంద దాటితేనే గరిష్టంగా ఉండేది. ప్రస్తుతం ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేక షెడ్డు వేయించి 5 ఓపీ కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఇవే కాకుండా ఆస్పత్రిలో నెలకు 40 వరకు సాధారణ శస్త్ర చికిత్సలు, 50 వరకు ఆర్థోపెడిక్ ఆపరేషన్లు, 250 దంత, వంద వరకు కంటి చికిత్సలు జరుగుతున్నాయి.

మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో నెలకు 200 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. చిన్న పిల్లలకు నిర్వహించే టిఫా స్కానింగ్‌లు 150, అల్ట్రా స్కానింగ్‌లు 1500 వరకు నిర్వహిస్తున్నారు. గుండెకు సంబంధించి 200 వరకు 2డీఎకో పరీక్షలు సైతం చేపడుతున్నారు.

రూ.55 లక్షలతో పడకల ఏర్పాటు ఆస్పత్రిలో బెడ్‌షీట్లు, దుస్తులు ఉతికేందుకు రూ.12 లక్షలతో మెకనైజ్డ్ లాండ్రీని ఏర్పాటు చేశారు. జిల్లా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో.. తాత్కాలికంగా రోగుల కోసం 40 పడకల సామర్థ్యం కలిగిన వార్డును రూ.55 లక్షలతో నిర్మించారు. ఇందులో ఎనిమిది ఏసీలను ఏర్పాటు చేశారు. రూ.45 లక్షలతో నవజాత శిశువుకు వెంటిలేటర్, రెండు బబుల్ షీటాప్, పది వార్మర్స్, రెండో ఫొటో థెరఫీ యంత్రాలు, పోర్టబుల్ ఎక్స్‌రేలు ఏర్పాటు చేశారు. రూ.10 లక్షలతో ల్యాపరోస్కోపి పరికరాలను అందుబాటులో ఉంచారు. ఆస్పత్రిలో 50 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ప్రజల సహకారంతో.. పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి అభివృద్ధి.. ప్రజల సహకారంతోనే సాధ్యమైంది. రోగుల అవసరాలను గుర్తించి, అందుకనుగుణంగా యంత్రాలను కొనుగోలు చేశాం. వైద్యులను నియమించి సేవలు అందించడంతోనే ఆస్పత్రిపై ప్రజలకు నమ్మకం పెరిగింది. శ్రీధర్, జిల్లా ఆస్పత్రి సమన్వయకర్త

చురకలు



# కేటుగాళ్ల ఆట.. పోలీసుల వేట

హైదరాబాద్: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన స్వచ్ఛందసేవా సంస్థ నిర్వాహకురాలు.. లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. సైబర్ మాయగాళ్ల కమీషన్‌కు ఆశపడి సంస్థ పేరిట ఉన్న బ్యాంకు ఖాతాను అద్దెకిచ్చారు. వారు వివిధ నేరాల్లో కొట్టేసిన రూ.1.90 కోట్ల నగదు లావాదేవీలు జరిపారు. ఆమెకు రూ.35 లక్షలు ఇచ్చారు. నగర సైబర్‌క్రైమ్ పోలీసులు లింకులు ఛేదించి నిందితురాలిని అక్కడి కోర్టులో హాజరుపరిచారు. 10 మంది న్యాయవాదులు ఆమెను బయటపడేసేందుకు ఎంత ప్రయత్నించినా అరెస్ట్ చేసి తీసుకొచ్చారు. సైబర్ నేరస్థుల కట్టడిలో నగర పోలీసులు దూకుడు పెంచారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల ఆచూకీ గుర్తిస్తున్నారు. పక్కా ఆధారాలతో పట్టుకుంటున్నారు. 2024లో సుమారు 500 మంది నేరస్థులు అరెస్టయితే, ఈ ఏడాది 3 నెలల వ్యవధిలోనే 260 మంది కేటుగాళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నకిలీ వివరాలు, సిమ్‌కార్డులు మార్చుతూ పోలీసులను ఏమార్చుతున్నామని భావించే మాయగాళ్లకు గుబులు పుట్టిస్తున్నారు. దేశంలో ఏ మూలదాగినా వదలబోమనే సంకేతం పంపారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకూ ఆశలు, భయాల వంటి బలహీనతలను ఆసరా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసగాళ్ల వేటలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ అభినందించారు. సైబర్



ఠాణాను మరింత బలోపేతం చేసేందుకు అదనపు సిబ్బంది, సాఫ్ట్‌వేర్ సమకూర్చారు.

**సవాళ్లను అధిగమిస్తూ..**

నగర సైబర్‌క్రైమ్ పోలీసులు కేసుల దర్యాప్తు, నిందితుల కోసం వివిధ రాష్ట్రాలు చుట్టొస్తుంటారు. అక్కడ ఎదురయ్యే సవాళ్లను పసిగడుతూ చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. రాజస్థాన్, గుజరాత్, యూపీ వంటి చోట్ల పదుల సంఖ్యలో గ్రామాలు సైబర్ మాయగాళ్లకు అడ్డాగా మారాయి. బయటి నుంచి ఎవరొచ్చినా వారికి సమాచారం చేరేలా వ్యవస్థను తయారు చేసుకున్నారు. గుజరాత్‌కు చెందిన ఓ కరుడుగట్టిన మాయగాడిని పట్టుకునేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు వెళ్లారు. ఆచూకీ చెప్పేందుకు వెళ్లిన అక్కడి కానిస్టేబుల్ నిందితుడి నుంచి కమీషన్ తీసుకొని తమ సమాచారం అందజేస్తూ తప్పించుకునేందుకు సహకరించినట్టు సమాచారం.దుబాయ్ కేంద్రంగా క్రిప్టో మోసాలకు సహకరిస్తున్న బ్యాంకు ఖాతాదారుడి ఆధారంతో ఏపీ, తెలంగాణలోని పలు ప్రయివేటు బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది లింకులు బయటపడ్డాయి. నలుగురు బ్యాంకు మేనేజర్లను అరెస్ట్ చేశారు. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోదాడ సమీపంలోని పలు గ్రామాల యువత మాయగాళ్లకు సహకరిస్తున్నట్టు గుర్తించారు.

# సైబర్ నైపుణ్యం.. భవితకు మార్గం

హైదరాబాద్ : సైబర్ నేరాలను అడ్డుకునేందుకు.. క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మ్యాపింగ్‌ల ద్వారా జేఎన్‌టీయూ, ఉస్మానియా విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాయి. బీఎస్సీ, కంప్యూటర్ సైన్స్ సహా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులందరికీ ఆయా పాఠాలు బోధిస్తున్నారు. సైబర్ నేరాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించేందుకు, ఆయా వర్సిటీల ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రయోగాత్మక తరగతులు కూడా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక మరింత మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు లభించేందుకు క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మ్యాపింగ్‌లలో నైపుణ్యాలు ఉపయోగపడనున్నాయని నిపుణులు చెబుతున్నారు.

సైబర్ నేరస్థులు రోజురోజుకీ కొత్తపద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో సగటున రోజుకు రూ.3 కోట్ల వరకూ ప్రజల నుంచి దోచుకుంటున్నారు. కొట్టేసిన సొమ్మును ఎవరు తీసుకున్నారు? ఏ బ్యాంకు ఖాతాలో జమయ్యిందన్న వివరాలను క్షణాల వ్యవధిలో తెలుసుకునే సాఫ్ట్‌వేర్‌ను కొందరు పరిశోధకులు రూపొందిస్తున్నారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ ఆధారంగా సైబర్ నేరస్థులు ఇతర



బ్యాంకు ఖాతాల్లోకి నగదు మళ్లించినా.. డబ్బు విత్‌డ్రా కాకుండా ఈ సాఫ్ట్‌వేర్ అడ్డుకోనుంది. ఇంకా పరిశోధన స్థాయిలో ఉన్న ఈ సాఫ్ట్‌వేర్‌తోపాటు సైబర్ నిపుణులు చేస్తున్న ప్రయోగాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించేందుకు జేఎన్‌టీయూ, ఉస్మానియా వర్సిటీల్లో వేర్వేరుగా ఆన్‌లైన్ పద్ధతుల్లో వివరిస్తున్నారు.

ల్యాప్‌టాప్‌లూ ఉండవ్

ప్రస్తుతమున్న సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తులో అనూహ్యంగా మారనుంది. క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా డేటా భద్రత కీలక పాత్ర పోషించనుంది. ఈ వేదిక ద్వారా మన వద్దనున్న సమాచారం మొత్తం భద్రపరుచుకుంటే ఇకపై ల్యాప్‌టాప్‌లు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇక డిజిటల్ మ్యాపింగ్ ద్వారా ఏకకాలంలో లిపి, ఛాయాచిత్రం, శబ్దం, వీడియోలు కనిపించనున్నాయి. విద్యార్థులు వీటిపై పట్టు సాధిస్తే.. భవిష్యత్ వారిదే.ప్రొ.విష్ణువర్ధన్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ, జగిత్యాల ఇంజినీరింగ్ కళాశాల

# విక్రయం.. ఇంకెంత విరామం!.. హెచ్‌ఎండీఏ లేఅవుట్ల ప్రకటన ఎప్పుడో?



హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలోని లేఅవుట్ల అభివృద్ధి, విక్రయాలకు సంబంధించి ఏడాదిన్నరగా ఎలాంటి ప్రకటనా వెలువడం లేదు. ఈ విషయంలో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం వరకు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ప్లాట్ల విక్రయాలకు భారీ డిమాండ్ వచ్చింది. రూ.వేల కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరాయి. కోకాపేటలో ఏకంగా ఎకరా రూ.100 కోట్లు పలికింది. తర్వాత బుద్వేల్, మోకిలా లాంటి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని లేఅవుట్లల్లో ప్లాట్లను విక్రయించారు. తర్వాత కాలంలో స్థిరాస్తి మార్కెట్‌లో వచ్చిన స్తబ్ధతతో ప్రస్తుతం వేలం జోలికిపోవడం లేదు. ఇటీవల హెచ్‌ఎండీఏ కొంత కసరత్తు చేసినా తర్వాత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

**ఆ నాలుగు ప్రాంతాల్లో డిమాండ్...**

హెచ్‌ఎండీఏ ఏడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి పరిధిలో లేఅవుట్లలోని స్థలాలకు డిమాండ్ ఉంటోంది. ఇక్కడ గతంలో మిగిలిపోయిన లేఅవుట్లలోని 39 బిట్లకు ఈ-వేలం వేశారు. రంగారెడ్డి పరిధిలో 10, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆరు, సంగారెడ్డిలో 23 ప్రాంతాల్లో స్థలాలకు ఈ-వేలం వేయగా.. ఎక్కువకే అమ్ముడయ్యాయి. ఈ ఊపుతోనే కోకాపేటలోని మిగిలిన భూమితో పాటు బుద్వేల్, మోకిలా, మేడిపల్లి, బహుదూర్‌పల్లి.. ఇలా కొన్ని ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి విక్రయించారు. ప్రభుత్వ ఖజానాకు రూ.2-3 వేల కోట్ల ఆదాయం వచ్చింది. న్యాయపరమైన చిక్కులు లేకపోవడం, పూర్తిస్థాయిలో భూ యజమాన్య హక్కులతోపాటు భూ వినియోగానికి సంబంధించి మార్పులు చేసే అవకాశం లేకపోవడం.. అన్ని స్థలాలకు రోడ్ల అనుసంధానమే కాకుండా నివాస గృహాలు, బహుళ ప్రయోజన జోన్లు, కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, ఇతర మిశ్రమ వినియోగానికి ఈ స్థలాలను వాడుకునే వీలుండటం వల్ల డిమాండ్ ఉంటోంది.

**ఆచితూచి ముందుకు..**గతంలో విక్రయించిన లేఅవుట్లలో మిగిలిన స్థలాలను విక్రయించాలని నిర్ణయించారు. తుర్కయాంజల్, మేడిపల్లి, మోకిలా తదితర కొన్ని ప్రాంతాల్లోని లేఅవుట్లను ఎంపిక చేశారు. అంతేకాక బంజారాహిల్స్‌లోని అత్యంత విలువైన 16 ఎకరాలను వేలం ద్వారా విక్రయించాలని యోచించారు. ఉగాది తర్వాత ఈ ప్రక్రియ ఉంటుందని భావించినా అధికారులు ఆచితూచి ముందుకెళ్లాలని భావిస్తున్నారు.

# పూడికతీతకు ఇదే అదను



పరిగి : అన్నదాతల ఆర్థికాభివృద్ధికి ఆయువు పట్టుగా ఉన్న లఖ్నాపూర్ జలాశయాన్ని అభివృద్ధి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. దశాబ్దాలుగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో అది రానురాను మైదానాన్ని తలపిస్తోంది. వర్షాభావ పరిస్థితులు తలెత్తడం, ఉన్న వనరుల్లో జలకళ లేకపోవడంతో సాగు సమస్యగా మారింది. చిన్నపాటి వర్షాలకు నిండటం, తరవాత వట్టిపోవడం ఏటా పరిపాటిగా మారింది. దాదాపు అయిదున్నర దశాబ్దాలు కావొస్తున్నా మరమ్మతులకు సంబంధించి ఏనాడూ పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాలేదు. చేస్తున్న అరకొర పనులు అక్కరకు రాకుండా పోతున్నాయి. నిర్వహణ లోపంతో ఆయకట్టుదారులు నానా కష్టాలు పడుతున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ప్రాంతాల్లోనూ వందలాది బోర్ల ద్వారా సేద్యం చేస్తుండటమే ఇందుకు నిదర్శనం.

**తగ్గుతున్న తైబందీ..**

రెండు ప్రధాన కాల్వల పరిధిలో లఖ్నాపూర్, మిట్టకోడూరు, రాజాపూర్, మోమిన్‌కలాన్, అంతారం, ఐనాపూర్, నాగారం, మోమిన్‌కుర్దులో ఆయకట్టు పొలాలున్నాయి. వరి, మొక్కజొన్న, పత్తి ప్రధానంగా సాగు చేస్తుంటారు. ప్రాజెక్టులో సుమారు నాలుగు అడుగులకుపైగా పూడిక చేరింది. వానాకాలం సీజన్ కావడం.. వర్షాలు పడే అవకాశం ఉన్నందున అవసరమైన మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టు కింద మొత్తం ఆయకట్టు 2,600 ఎకరాలు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో కేవలం 800 ఎకరాలకు మాత్రమే నీరు విడుదల చేస్తున్నారు. చివరి భూములకు ఎప్పుడూ నీరందడం లేదు. ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా భూములు పోగొట్టుకున్న రైతులు సైతం నీరందక నష్టపోతున్నారు. పూడికతీత పనులకు వేసవి సరైన అదను అని, పనులు ప్రారంభించేందుకు అధికారులు కార్యాచరణ ప్రారంభించాలని కోరుతున్నారు. **రైతులు ముందుకు రావాలి..**

ప్రాజెక్టులో పూడికతీత పనులకు సంబంధించి రైతులు ముందుకు రావాలి. దరఖాస్తులు ఇస్తే ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తాం. కట్టపై పెరిగిన పొదలను ఉపాధిహామీ పథకం కింద తొలగింపు పనులు చేపట్టాం. రూ.15 లక్షల వ్యయంతో ఆర్నెల్ల కిందట కుడి, ఎడమ కాల్వల్లో పెరిగిన పూడికమట్టి, పిచ్చి మొక్కలను తొలగించడంతో నీరు సాఫీగా సరఫరా అవుతోంది. నిధులు మంజూరైన వెంటనే అవసరమైన పనులు చేపడతాం.

కృష్ణారెడ్డి, డీఈఈ, నీటిపారుదల శాఖ

# సాంకేతిక సమస్యలు.. అర్జీదారుల అవస్థలు

కరీంనగర్ : లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిష్కారానికి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద స్థలాలు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి 25 శాతం రాయితీ అవకాశాన్ని ఇచ్చింది. గత నెల 31 వరకే గడువు ముగియగా, పలు కారణాలతో గడువు పెంచారు. ఈనెల 30 వరకు ఫీజు చెల్లించడానికి, అర్జీలను పరిష్కరించుకునేందుకు వెసులుబాటు ఇవ్వడంతో ఆలోగా దరఖాస్తులు పరిష్కరించుకోవడానికి ఎక్కువ సంఖ్యలో అర్జీదారులు వస్తున్నారు.

**కొందరికే మార్పులు, చేర్పులు**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో ఉన్న పొరపాట్లను సవరించుకోవడానికి పురపాలక శాఖ అవకాశం ఇచ్చింది. అయితే కొందరికే సవరణలు, మార్పులు చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో చూపిస్తుండగా మిగతా వారు ఫీజు కట్టేందుకు సిద్ధంగా ఉండి అభ్యంతరాలను పరిష్కరించుకోలేకపోతున్నారు. పేర్లు, విస్తీర్ణం, సర్వే నంబర్లు, ఫోన్ నంబర్లు, కాలనీల పేర్లు మార్చుకోవడానికి ప్రయత్నించే వారికి సాధ్యం కావడం లేదు.


**స్పందించని ఎల్-1 అధికారులు**

ఎల్-1 అధికారులు స్థలం, ప్లాట్ దగ్గరికి వెళ్లి యాప్‌లో ఆ వివరాలను నమోదు చేయాల్సి ఉండగా జాప్యం చేస్తున్నారు. ఫీజు చెల్లించుకోవడానికి సవరణలు చేసుకుంటే తప్పుగా నమోదవుతున్నాయి. వీటిని అధికారులు పరిష్కరించాల్సి ఉండగా కనీసం ఫోన్ ద్వారా కూడా స్పందించడం లేదు. కొందరి ఫోన్లు పని చేయడంలేదు.

**ఇలా చేయాలి**

నగరపాలికతోపాటు మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల దగ్గర రద్దీ తగ్గాలంటే మరిన్ని కేంద్రాలు పెంచాలి.

దరఖాస్తుదారులు పలుమార్లు తిరగకుండా అధికారుల కోసం టోకెన్ విధానం అమలు చేసి ఏ రోజుకు ఆ రోజు పరిష్కారం చూపాలి.



ఎక్కువగా ఎఫ్‌టీఎల్, నిషేధిత జాబితాలో ఉన్న వారే ఫీజు కట్టేందుకు ఆసక్తి చూపుతుండగా ఏయే పత్రాలు అవసరమనేదీ స్పష్టంగా తెలపాలి.

అన్ని సవ్యంగా ఉన్నట్లైతే వెంటనే అనుమతి వచ్చేలా చూడాలి.

సాంకేతిక సమస్యలన్నీ త్వరలో పరిష్కారమవుతాయని, ఉన్నతస్థాయిలో సమీక్ష జరిగిందని, క్షేత్ర స్థాయిలో వస్తున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లామని కరీంనగర్ నగర పాలిక పట్టణ ప్రణాళిక అధికారి పేర్కొన్నారు.

**ఇవీ ఇబ్బందులు**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో ఐజీఆర్‌ఎస్ దస్త్రాలు అప్‌డేట్ కావడం లేదు.

ఎల్-1 అధికారి పరిశీలించిన తర్వాత దరఖాస్తుదారు ఫీజు కడితే మళ్లీ ఆయన వద్దకే వెళ్తుంది.

ఎల్-2లో ఆమోదించిన తర్వాత ఎల్-3 లాగిన్లకు వెళ్లకుండా ఎల్-1కు వెళ్తుండటంతో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు.

# అనారోగ్య చట్రంలో మహిళ

హైదరాబాద్ : గ్రేటర్‌లోని బస్తీలు, మురికివాడల్లోని తక్కువ ఆదాయ వర్గాల మహిళలు వివిధ రకాల అనారోగ్య సమస్యల బారిన పడుతన్నారు. ఎక్కువ శాతం మంది పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్(పీసీఓఎస్)తో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఇటీవల నగరంలోని వివిధ బస్తీలు, మురికివాడల్లో 22 వేల మందికి పరీక్షలు నిర్వహించింది. వీరిలో దాదాపు 40 శాతం మంది పీసీఓఎస్‌తో బాధపడుతున్నట్లు తేలింది. యువతుల్లోనూ ఈసమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. జీవనశైలి, ఆహారపు అలవాట్ల మార్పుల కారణంగా ఈ సమస్య పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. రాజేంద్రనగర్,బోరబండ, హకీంపేట్, హసన్‌నగర్, కాలాపత్తర్, జల్‌పల్లి, బాలాపూర్ ఇతర 17 ప్రాంతాల్లోని హెచ్‌హెచ్‌ఎఫ్ క్లినిక్‌లకు వచ్చే మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 50శాతం మంది పనుల కోసం ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవారే. ఆరోగ్యంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో పునరుత్పత్తి



సమస్యలు, గర్భిణుల్లో వివిధ రకాల అనారోగ్య ఇబ్బందులు వెంటాడుతున్నాయి. కౌమారదశలోని బాలికల్లో సైతం పీసీఓఎస్, రక్తహీనత వెంటాడుతోంది.

**హార్మోన్ల అసమతుల్యత..** పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ అనేది స్త్రీల అండాశయాలను ప్రభావితం చేసే ఒక అనారోగ్య పరిస్థితి. ప్రొజెస్టెరాన్, ఈస్ట్రోజన్ హార్మోన్ల అసమతుల్యత కారణంగా రుతుచక్రం క్రమం తప్పుతుంది. ఇలాంటి మహిళలు గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు శరీరం, ముఖంపై అసాధారణ రీతిలో జుట్టుపెరుగుదల, దీర్ఘకాలంలో గుండె జబ్బులు, మధుమేహానికి దారి తీస్తుంది. కొందరికి అండాశయాల్లో తిత్తులేర్పడతాయి. నిరక్షరాస్యత, అవగాహన లేమి తదితర కారణాలతో చాలామంది చికిత్సలకు దూరంగా ఉంటున్నారు. మరోవైపు సమతుల్య, పౌష్టికాహారం తీసుకోకపోవడంతో చాలామంది మహిళలు రక్తహీనత బారిన పడుతున్నారు. గర్భిణుల్లో సైతం వివిధ అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మహిళల ఆరోగ్య పరిస్థితిపై ప్రాథమిక స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# యాసంగి ధాన్యం.. సేకరణకు సిద్ధం

వికారాబాద్ : యాసంగిలో పండించిన ధాన్యాన్ని కొనేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఈనెల 10న నిర్వహించిన సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ దిశానిర్దేశం చేసి దానికనుగుణంగా అధికారులను కార్యోన్ముఖులను చేశారు. ఈనెల 15 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

**జిల్లాలో సాగు ఇలా..**



జిల్లాలో 95 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందులో 35 వేల మి.ట. మిల్లర్లకు కేటాయించాలని, 5వేల మె.ట. విత్తనాల ఉత్పత్తికి వినియోగించాలని, 30 వేల మె.ట. ఆహార ధాన్యాల కోసం అవసరమని అధికారులు గుర్తించారు. మిగతా 130 వేల మె.ట. ధాన్యాన్ని కొనాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ నేతృత్వంలో ఇదివరకే పౌర సరఫరాల కమిషనర్‌కు పంపారు. ఆ శాఖ ఆమోదం మేరకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

**పక్కా ప్రణాళిక..**కలెక్టర్ నేతృత్వంలో అధికారులతోపాటు మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి యాసంగి ధాన్యాన్ని కొనేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాం. ఇందులో భాగంగానే ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటాం. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం. - మోహన్‌బాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి.

**ఐకేపీ, సింగిల్ విండో, మెప్మా ఆధ్వర్యంలో..**

జిల్లావ్యాప్తంగా ఐకేపీ, సింగిల్ విండో, మెప్మా ఆధ్వర్యంలో 128 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 11 కేంద్రాలు సన్నాలు, 117 దొడ్డు రకాలు కొనుగోలు కేంద్రాలున్నాయి. జిల్లాలో 56 రైసు మిల్లులు, 3 బాయిల్డ్ రైసు మిల్లులున్నాయి. సాధారణ గ్రేడ్ ధాన్యం క్వింటా ధర రూ.2,300, గ్రేడ్-1కు రూ.2,320 ఉంది. సన్న వరికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోంది. జిల్లాకు 40 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా.. ఇప్పటికే 20 లక్షలు అందుబాటులో ఉన్నాయి. దశలవారీగా మరో 20 లక్షల సంచులు జిల్లాకు రప్పించేందుకు దృష్టి సారించారు.

# గడ్డి చూపింది.. గట్టి ఉపాధి

కడెం : వారు కడెం ప్రాంత యువకులు.. ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వివిధ ప్రాంతాలు తిరిగారు. ముంబయి, దుబాయి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కొద్దికాలం దొరికిన పని చేశారు. కానీ అది ఎటూ సరిపోవడం లేదు. మెరుగైన ఉపాధి కోసం అన్వేషిస్తుండగా అనుకోని రీతిలో వీరికో అవకాశం అందివచ్చింది. దాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకుని లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారు. అదే గోధుమ గడ్డి జ్యూస్ విక్రయం. అందులోని పోషక విలువలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండడంతో ఈ జ్యూస్‌కు ఆదరణ పెరిగింది. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, జగిత్యాల జిల్లాల్లో ఇక్కడి యువకులు విక్రయ కేంద్రాలను నడుపుతున్నారు.

**నిర్మల్‌లో ఇద్దరు..**

ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి నిరాశతో తిరిగి వచ్చిన కడెం మండలం చిట్యాలకు చెందిన బోరె వెంకటేష్, ధర్మాజి తిరుపతి హైదరాబాద్‌లో రాపల్లి సత్యం జ్యూస్ సెంటర్ గురించి తెలుసుకుని ఆయనను సంప్రదించారు. ఆయన సూచనలతో నిర్మల్‌లో గోధుమ గడ్డి జ్యూస్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఒకరు డిగ్రీ కళాశాల వద్ద, మరొకరు ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఈ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు ఇంటి స్లాబ్‌పైనే గోధుమ గడ్డి పెంచుతూ అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. వివిధ రకాల జ్యూస్‌లనూ విక్రయిస్తున్నారు. వాటికి ఆదరణ లభించడంతో తమకు గిట్టుబాటుగా ఉందని వీరు పేర్కొంటున్నారు.

**16 ఏళ్లుగా హైదరాబాద్‌లో..**

కడెం మండలం లక్ష్మీపూర్‌కు చెందిన రాపల్లి సత్యం ఇక్కడ వ్యవసాయం



అచ్చిరాక ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. కొన్నాళ్లకు ఓ విదేశీ మిత్రుడు ఇచ్చిన సలహా మేరకు హైదరాబాద్ కేబీఆర్ పార్కు వద్ద 16 ఏళ్ల క్రితం గోధుమ గడ్డి జ్యూస్ విక్రయించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానికి ఆదరణ లభించడంతో మరో మూడుచోట్ల బ్రాంచీలు ఏర్పాటుచేసి ఉపాధి మెరుగుపర్చుకున్నారు. ఇప్పుడు గోధుమ గడ్డితో పాటు 16 రకాల ఆకుకూరలు, కూరగాయలతో రసాలు విక్రయిస్తూ మరో పదిమందికి ఉపాధి చూపిస్తున్నారు. ఆసక్తి ఉన్న యువకులకు శిక్షణ ఇస్తూ ఆయా ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నారు.

**ఆదిలాబాద్‌లో బంక రవి..**

కడెంకు చెందిన బంక రవి హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేశారు. ఆదాయం సరిపోక కడెం తిరిగొచ్చారు. హైదరాబాద్‌లో జ్యూస్ కేంద్రం నడుపుతున్న రాపల్లి సత్యం సూచనతో తానూ అదే మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నారు. కొద్దిరోజులు శిక్షణ తీసుకుని నెల క్రితం ఆదిలాబాద్ పార్కు దగ్గర గోధుమ గడ్డితోపాటు ఇతర కొన్ని రకాల రసాలను ఉదయపు నడకకు వచ్చేవారికి, ఇతరులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

**భైంసాలో..**

కడెం మండలం పెద్దూరుకు చెందిన బైరి మహేష్ భైంసాలో కొంతకాలంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అదనపు ఆదాయ వనరుగా గోధుమ గడ్డి జ్యూస్ కేంద్రాన్ని ఎనిమిది నెలల క్రితం ఏర్పాటు చేసుకుని ఉదయం ఉపాధి పొందుతున్నారు. అవసరమైన వారికి గడ్డి, తయారు చేసిన జ్యూస్ ఇళ్లకు తీసుకెళ్లి ఇస్తున్నారు.

# రీచ్ అక్కడ.. దోపిడీ ఇక్కడ

జైపూర్ : ఇసుక మాఫియా, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయినా జైపూర్ మండలం నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. నేరుగా ప్రధాన రహదారులపై నుంచే వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక రీచ్ కోటపల్లి మండలం కొల్లూరులో ఉండగా.. జైపూర్ మండలం ఇందారం, రామారావుపేట, వేలాల, కిష్టాపూర్ శివారుల నుంచి ఇసుక అక్రమ దోపిడీ జరుగుతోందనే విమర్శలున్నాయి. తాజాగా వేలాల, కిష్టాపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకోవడం గమనార్హం.

**నంబర్ ప్లేట్ లేకుండానే రవాణా..**

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడి పట్టుబడితే ఇటీవల కాలంలో జరిమానాలు సైతం భారీగా విధిస్తున్నారు. గతంలో రూ.5 వేలు ఉ



న్న జరిమానా ప్రస్తుతం రూ.25 వేలకు పెంచారు. దీంతో అంతమొత్తం జరిమానా కట్టడానికి కొందరు వెనుకాడటం లేదు. మరికొందరు తమకున్న రాజకీయ పలుకుబడితో జరిమానాలను తగ్గించుకోవడం గమనార్హం. ఇటీవల పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లతో రెండింటికి నంబర్ ప్లేట్లు లేకుండానే రవాణా సాగిస్తున్నారు. గతంలో కూడా ఇలా నంబర్ ప్లేట్ లేకుండా రవాణా చేసిన వారికి భారీ మొత్తంలోనే జరిమానాలు విధించారు.

**ఈ ప్రాంతాల నుంచే..**

జైపూర్ మండలంలోని రామారావుపేట, ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, బెజ్జాల, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం శివారుల మీదుగా గోదావరి ప్రవాహం ఉంది. గోదావరిలో నీటి లభ్యత లేని కారణంగా ఇందారం, రామారావుపేట, వేలాల, కిష్టాపూర్ శివారులతో పాటు రసూల్‌పల్లి వాగు నుంచి ఇసుక రవాణా డిమాండ్‌ను బట్టి బాగానే సాగుతోంది. రాత్రివేళలో అదను చూసి ఇసుకాసురులు తమ పనికానిచ్చేస్తున్నారు.

# సౌకర్యాలు కల్పిస్తేనే.. పర్యాటకం



వేసవి వచ్చింది. విద్యార్థులు, ఉద్యోగులు విహారయాత్రలకు ఆసక్తి చూపుతారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకం ఊపందుకోనుంది. ఆయా స్థలాలపై ప్రత్యేక కథనం.

12వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన కౌలాస్ కోట చెక్కు చెదరలేదు. కామారెడ్డికి 97 కి.మీ, హైదరాబాద్‌కు 170 కి.మీ దూరంలో జుక్కల్ మండలంలో ఈ కోట ఉంది. జుక్కల్ చౌరస్తా నుంచి కౌలాస్ గ్రామం మీదుగా కోటకు చేరుకోవచ్చు. 400 ఎకరాల్లో ఉన్న కౌలాస్ కోటకు 57 బురుజులు ఉన్నాయి. కోట లోపల ఆలయాలు, బావి, రాణిమహల్, ఆయుధ గది, ధాన్యాగారం, నేరస్థులను శిక్షించే గదులు ఉన్నాయి. రాజచిహ్నాలు అబ్బురపరుస్తాయి. కోట అవతల 'అష్టభుజ ఎల్లమ్మ' మందిరం ఉంది.

సమస్యలు: కోటకు వెళ్లేందుకు పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కౌలాస్ గ్రామానికి, కోటకు మధ్యలో ఉన్న వాగుపై వంతెన లేక చుట్టూ 10 కి.మీ దూరం మట్టిరోడ్డుపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. కౌలాస్ కోట అభివృద్ధి చెందాలంటే కౌలాస్‌నాలా ప్రాజెక్టు వాగుపై వంతెన నిర్మించాలి. 161 జాతీయ రహదారి నుంచి కోట వరకు 5 కి.మీ దూరం మట్టి రోడ్డుపై తారు వేస్తే మేలు.

**బోటింగ్ ఉంటే మేలు**

కామారెడ్డికి 60 కి.మీ, హైదరాబాద్‌కు 150 కి.మీ దూరంలో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు కుటుంబ సమేతంగా వస్తుంటారు. మూడు కిలోమీటర్ల పొడవు, 48 వరద గేట్లు, అతిపురాతనమైన కట్టడం, ఎత్తయిన ప్రదేశంలో గోల్‌బంగ్లా ఉండడంతో.. ప్రాజెక్టు అందాలను చూడవచ్చు.

సమస్యలు: బోటింగ్ సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడం, తాగునీటి సమస్య ఉంది. చెత్తచెదారంతో అపరిశుభ్రత నెలకొంది. పర్యాటక కేంద్రం ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలి.

**వసతి ఉంటే బాగు** నిజాం రాజుచే తెలంగాణలో తొలిసారిగా నిర్మించినదే పోచారం ప్రాజెక్టు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ జలాశయం 21 అడుగుల ఎత్తు, 1.7 కి.మీ పొడవున ఉంది. హైదరాబాద్‌కు 100 కి.మీ దూరంలోని ఈ ప్రాజెక్టు పక్కనే అభయారణ్యం ఉంది. మాల్తుమ్మెదలో మెట్ల బావి పర్యాటకంగా ఆకట్టుకుంటోంది.

సమస్యలు: జలాశయం వద్ద పర్యాటకులకు కాటేజీలను ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టు మధ్యలో ఉన్న గుట్టపై హరిత రిసార్ట్, గోల్ బంగ్లా వద్ద చిన్నారులకు ఆట వస్తువులు సమకూర్చాల్సి ఉంది.

# కానరాని పరిశ్రమ. వృథాగా రైతు శ్రమ




ఆదిలాబాద్ : ఉత్తర తెలంగాణలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించాలనే ఆలోచనతో గత ప్రభుత్వం నిర్మల్ జిల్లా సోన్ మండలం పాక్‌పట్లలో ఏర్పాటు చేయాలనుకున్న ఆయిల్‌పాం పరిశ్రమకు పట్టిన గ్రహణం వీడటం లేదు. 2023లో ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం 40 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎకరాకు రూ.15 లక్షల చొప్పున సాధారణ ధర నిర్ణయించి ప్రీ-యూనిక్ అనే ప్రైవేటు సంస్థకు కేటాయించింది. అప్పట్లో సంస్థతో జరిగిన ఒప్పందం ప్రకారం మూడేళ్ల వ్యవధిలో రైతుల చేతికొచ్చిన పంటను కొనుగోలు చేయాలనే షరతు విధించింది. ఇప్పుడు పంట దిగుబడి వచ్చినా పరిశ్రమ అందుబాటులోకి రాకపోవటం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది.

**అవరోధమేంటి?**

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు రావటంతో పరిశ్రమ ప్రస్తావనను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ప్రైవేటు సంస్థ సైతం నిర్మాణం చేపట్టలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరటం, తాజాగా రైతుల చేతికి పంట రావటంతో మళ్లీ ఈ అంశం తెరమీదకు వచ్చింది. పరిశ్రమ ఏర్పాటు కాకుండా నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తూ రైతులతో కలిసి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్‌లో పాత కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయటం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఎంతో నష్టం..: రామయ్య, రైతు**

పంట చేతికొచ్చింది. పరిశ్రమ అందుబాటులోకి రాలేదు. ఖమ్మం జిల్లా అశ్వారావుపేటకు తరలించడమంటే మేం పంట సాగుచేసి నష్టం పోవడానికా? ప్రభుత్వం జోక్యం చేసుకొని మా పంటలను ఇక్కడే కొనుగోలు చేయాలి. అన్యాయం: గంగారాం, రైతు

ఆయిల్‌పాం సాగు చేస్తే లాభం వస్తుందన్నారు. ఇప్పటికే ఎన్నో కష్టాల్లో ఉన్న మేం ఇప్పుడు కనీసం చేతికొచ్చిన పంటను అమ్ముకోలేకపోయే పరిస్థితి ఏర్పడింది. మా నాయకులే మా గోస పట్టించుకోవడం లేదు. ఇక ప్రభుత్వాన్ని అని ఏం చేస్తాం.

జాప్యం జరిగింది : అభిలాష అభినవ్, నిర్మల్ కలెక్టర్

గత ప్రభుత్వం ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటుకు అనుమతినిచ్చింది. ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నా జాప్యం జరిగింది. రైతుల చేతికి పంట వచ్చింది. అందుకే పరిశ్రమతో ఉన్న ఒప్పందం ప్రకారం పంటను కొనుగోలు చేసేలా చర్యలు చేపడతాం. రైతులు భయపడాల్సిన అవసరం లేదు.

# సమగ్రాభివృద్ధిలో నార్నూర్ భేష్

నార్నూర్ : అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నార్నూర్ మండలం.. ప్రస్తుతం సమగ్రాభివృద్ధితో ఆదర్శంగా నిలుస్తోంది. కొన్నేళ్ల కిందట వసతుల లేమి, ఉపాధి అవకాశాలు లేక సతమతమవుతున్న నార్నూర్.. నీతి ఆయోగ్ ఆకాంక్ష బ్లాక్ ప్రోగ్రాం పథకం కింద ఎంపిక కావడంతో దక్షిణ భారత దేశంలోనే మోడల్(నమూనాగా) నిలవడం గమనార్హం. 2023 జనవరి 7న నీతి ఆయోగ్ ఆకాంక్ష కార్యక్రమం కింద నార్నూర్ ఎంపికైంది. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక-ఆర్థిక సమగ్ర అభివృద్ధి వంటి కీలక రంగాలలో మెరుగైన పనితీరును కనిపించింది. ఈ క్రమంలో అదే ఏడాది జూన్ నాటికి నార్నూర్ దక్షిణ భారతదేశంలో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. డెల్టా ర్యాంకింగ్‌లో ఇది గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. ఈ ఘనతకు గుర్తింపుగా నార్నూర్ బ్లాక్‌కు రూ.కోటి ప్రోత్సాహక నిధి మంజూరైంది. పీఎం అవార్డు-2025 కోసం 426 ఆకాంక్ష బ్లాకుల్లోని మొదటి 30 బ్లాకుల్లో నార్నూర్ ఒకటిగా నిలిచింది.

**ఆరోగ్యం.. సంక్షేమం వైపు అడుగులు**

వంద శాతం గర్భిణులకు పరీక్షలు, సురక్షిత ప్రసవాల కోసం గిరిజన పోషణ మిత్ర కార్యక్రమం కింద కార్యక్రమాలు చేపట్టారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో రక్తహీనత నివారణకు, వ్యవసాయ కుటుంబాలకు చెందిన గర్భిణులకు పోషకాహారం అందించేలా ప్రభుత్వం కృషి చేసింది. పీఎం జన్‌మన్, ఎంఎంయూ, వైద్య శిబిరాలను నిర్వహించి ఆరోగ్య సంరక్షణ దిశగా పయనించింది.

మెరుగైన విద్య ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య కోసం స్మార్ట్ తరగతులు, ఐసీటీ ల్యాబ్స్, వర్చువల్ లెర్నింగ్, డిజిటల్ కంప్యూటర్ విద్యను అందజేశారు. విహార యాత్రలతోపాటు విజ్ఞానశాస్త్రం ఆవిష్కరణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యువ ఓటర్ల



క్లబ్, ఇంగ్లిష్ లిటరసీ ప్రోగ్రాం, పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు.

**వ్యవసాయం..** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు భాగస్వామ్యంతో రైతులకు.. ఉద్యాన పంటలు, చిరుధాన్యాల సాగు, బిందుసేద్యం లాంటి సౌకర్యాలు కల్పించారు. మండలంలోని సుంగాపూర్, ఖంపూర్ గ్రామాల శివారులలో చెరువులు నిర్మించి రైతుల భూములకు నీరందించే దిశగా కృషి చేశారు. సోలార్ బోరు బావులు, నీటి సంరక్షణ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు.

**మహిళా సాధికారత**

601 మహిళా స్వయం సహాయక సంఘాలు 6,721 సభ్యులతో ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సంప్రదాయ ఆహారాన్ని వనరుగా మార్చడం, మహువా (ఇప్పపువ్వు) లడ్డు నిర్మాణ ప్రాజెక్టు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ పథకాల కింద మహిళలు, యువతకు రాయితీ రుణాలు ఇచ్చి వ్యాపార దిశగా ప్రోత్సహించారు. వివిధ పనుల్లో నైపుణ్యం, డిజిటల్ స్కిల్స్, బాంబూ క్రాఫ్ట్స్(వెదురు బొమ్మలు) శిక్షణ కల్పించారు. ఆర్వో ప్లాంట్‌లు, సామాజిక గ్రంథాలయాల ఏర్పాటు.. ఇలా దేశ గ్రామీణాభివృద్ధికి ఒక మార్గదర్శకంగా నార్నూర్ నిలిచింది.

# ఒక్క'సారొస్తే' మళ్లీ పోరు

హైదరాబాద్: ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా రెండేళ్లు లేదా గరిష్ఠంగా మూడేళ్లు డిప్యుటేషన్‌కు అనుమతిస్తారు. తర్వాత ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లాల్సి ఉంటుంది. కానీ దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. కొందరు ఉద్యోగులు కొన్నేళ్లుగా కుర్చీని పట్టుకొని అక్కడే తిష్ఠ వేశారు. ఇలా పదుల సంఖ్యలో ఉన్న ఉద్యోగులు సింహభాగం రాజధాని పరిధిలోని వారే ఉన్నారు.




**పదోన్నతి వచ్చినా కదలరు..** మాతృసంస్థ నుంచి వేతనాలు తీసుకుంటూ కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడ ఖాళీలు చూపకుండా, పదోన్నతులు వచ్చినా కదలకుండా ఏళ్లుగా కొనసాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ఓ ఉద్యోగి రెండు దశాబ్దాలుగా ఒక చోటే పనిచేస్తున్నారు. ఈవోగా పదోన్నతి వచ్చినా కార్యాలయం విడిచి వెళ్లలేదు. రాజధాని పరిధిలోని ధర్మశాల, అమీర్‌పేట్ హనుమాన్ దేవాలయం, సికింద్రాబాద్ భోలక్‌పూర్ భవానీ శంకరాలయం, అడిక్‌మెట్ హనుమాన్ దేవాలయం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఉద్యోగులు పదుల సంఖ్యలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం కేంద్ర కార్యాలయంలో ఖాళీగా ఉన్న 111 పోస్టులలో 77 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 34 ఇంజినీరింగ్ ఉన్నాయి. నిబంధనల ప్రకారం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(అడ్మినిస్ట్రేషన్) విభాగంలో 209మంది ఉద్యోగులు ఉండాలి. కానీ 126 మంది మాత్రమే పని చేస్తున్నారు. దీంతో పలు దేవాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని డిప్యూటేషన్‌పై కమిషనర్ కార్యాలయానికి తీసుకొచ్చి పని చేయిస్తున్నారు. ఏడాది అనుమతితో వచ్చిన కొందరు ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నారు. దీంతో అర్హులకు అవకాశం రావడం లేదని, సీనియార్టీ ప్రకారం పదోన్నతులకు నోచుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

# అవసరం గుర్తించాలి.. అన్నదాతను ప్రోత్సహించాలి

వికారాబాద్ : వేసవిలో కూరగాయల కొరత రాకుండా ఉండేందుకు ఉద్యానశాఖ సమాయత్తమవుతోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో గమనించి వారికి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు విత్తనాలు, మొక్కలను సిద్ధం చేస్తోంది. భూగర్భ జలాలు పడిపోతున్న సమయంలో ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ఆరుతడి పంటగా సాగును ప్రోత్సహించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ ఉన్న జలాలను పొదుపుగా వాడుకునేందుకు అవసరమైన రైతులు రాయితీపై బిందు, తుంపర పరికరాలను అందించనుంది. ఇందుకోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తోంది.

**వేసవిలో ధరలు ఆశాజనకం**

గత వర్షాకాలంలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు అనేక కారణాలతో కొంత నష్టపోవాల్సి వచ్చింది. దీంతో వేసవిలో అంతగా దృష్టి పెట్టరని కూరగాయల కొరత ఏర్పడుతుందని భావించిన అధికారులు రూ.14కోట్ల అంచనా వ్యయంతో ముందస్తు ప్రణాళికను ఏర్పాటు చేసుకున్నారు. ఉల్లి, సొరకాయ వంటి ఆయా రకాల విత్తనాలు కొరత రాకుండా ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానంగా ఏప్రిల్ -మే నెలల్లో కూరగాయల ధరలు పడిపోకుండా ఒక విధంగా నిలకడగానే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా పండిస్తున్న వాటితో జిల్లా అవసరాలతో పాటు జంటనగర వాసుల అవసరాలను కూడా తీరుస్తున్నారు. ఎకరా పెట్టుబడికి రూ.2వేలు వెచ్చించే కొత్త రకం



వంకాయ వంగడాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

**కొరత లేకుండా చూస్తాం**

వేసవిలో కూరగాయల కొరత రాకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. నీటిని సద్వినియోగం చేసుకునేందుకు రైతులకు బిందు, తుంపర పరికరాలను అందజేస్తున్నాం. దరఖాస్తు చేసుకునే వారందరికీ విడతల వారీగా సరఫరా చేస్తాం. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. వివిధ రకాల పంటలు సాగు చేయడంతో రైతులకు తెలియకుండానే పంట మార్పిడి కూడా జరుగుతోంది. ఇవే కాకుండా తొలకరిలో అరటి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో వంటి మొక్కలను కూడా అందజేస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎం.ఎ.సత్తార్, జిల్లా ఉద్యానాధికారి ఏడాదిలో పండించే విస్తీర్ణం 27,000 ఎకరాలు

దిగుబడి అంచనా 2.56 లక్షల మెట్రిక్ టన్నులు

## భూసారం.. సాగు ఫలవంతం

కర్నూలు : పొలంలో మంచి పంటలు పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. భూమిలో ఏఏ పోషకాలు క్షీణించాయి.. తదితరాలు వెల్లడవుతాయి. ఇంతటి కీలకమైన సమాచారం అందించే భూసార పరీక్షలను గత వైకాపా ప్రభుత్వం అటకెక్కించింది.

**పకడ్బందీ ప్రణాళికతో..**

కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తోంది. ఖరీఫ్ సీజన్ మొదలయ్యేనాటికి భూసారానికి సంబంధించిన ఫలితాలు అందించేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రబీ సీజన్ పూర్తవడంతో భూసార పరీక్షలు చేసేందుకు అనువైన సమయం లభించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో మట్టి నమూనాల సేకరణ, తరలింపు, పరీక్షించడం, ఫలితాలను రైతులకు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. దీంతోపాటు రైతులకు భూ ఆరోగ్య కార్డులను సైతం అందజేయనున్నారు. ఫలితంగా వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడనుంది.

**మోతాదుకు మించి..**

2024–25లో పరిశీలిస్తే నంద్యాల జిల్లాలో అత్యధికంగా ఎరువులు వినియోగించినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి నడ్డా ఇటీవల లోక్‌సభలో తెలిపారు. నంద్యాల జిల్లాలో 3.75 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవగా.. కర్నూలు జిల్లా 2.35 లక్షల మె.టన్నుల వినియోగంతో ఐదో స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా ఎరువుల వాడకం జరుగుతోంది. ఫలితంగా భూమి భౌతిక స్థితిలో అనేక మార్పులొస్తున్నాయి.

**ఆర్ఎస్‌కే పరిధిలో సేకరించి..**



ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 877 రైతు సేవా కేంద్రాల పరిధిలో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేసి ఫలితాలను రైతులకు అందిస్తారు. ఆర్ఎస్‌కే సిబ్బంది రైతుల పొలాలకు వెళ్లి నమూనాలు సేకరిస్తారు. పరీక్ష వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఫలితాలను సైతం రైతు చరవాణికి పంపేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు.

**లక్ష్యం నిర్దేశించి..**

కర్నూలు జిల్లా పరిధిలోని ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో 12,971, కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని ఏరువాక కేంద్ర ల్యాబ్‌లో 12,971 మట్టి నమూనాలు పరీక్షించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఎమ్మిగనూరు భూసార పరీక్షా కేంద్రంలో ల్యాబ్ పనిచేయడం లేదు. దీంతో మొత్తం పరీక్షలను కర్నూలులోని ల్యాబ్‌లో చేయనున్నారు. నంద్యాల, డోన్‌లో రెండు భూసార పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. నంద్యాలలోని పరీక్షా కేంద్రంలోనే ఆ జిల్లాకు నిర్దేశించిన 22,880 మట్టి నమూనాలను పరీక్షించనున్నారు.

ఒక్కో మట్టి నమూనాను పరీక్షించేందుకు రసాయనాలు, ఆరోగ్య కార్డుకు కలిపి రూ.200ను ప్రభుత్వం కేటాయించింది. మే నెలాఖరులోగా రైతులకు భూ ఆరోగ్య కార్డులను అందించాలన్నది లక్ష్యం.

కూటమి ప్రభుత్వం 2024–25లో ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 37,500 మట్టి నమూనాలను పరీక్షించేందుకు రూ.47 లక్షలు మంజూరు చేసింది.

## చెంత చేరిన ఇంటర్ పుస్తకాలు

డోన్ : పదోతరగతి తర్వాత ఇంటర్ విద్య కీలకం కావడంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత వైకాపా ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసింది. తెదేపా హయాంలో అమలైన మధ్యాహ్న భోజనాన్ని రద్దు చేసింది. వైకాపా చేసిన తప్పుల్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దే చర్యల్ని చేపట్టింది. ఇంటర్మీడియట్ విద్యపై ప్రత్యేక చొరవ చూపుతోంది. ఇంటర్ కళాశాలలను వేసవి సెలవుల అనంతరం పునఃప్రారంభించాల్సి ఉండగా..ఈ ఏడాది ఏప్రిల్‌లోనే బ్రిడ్జి కోర్సును అమల్లోకి తెచ్చారు. ఒకటో తేదీ నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించింది. ఈ నెల 7 నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది.

**కోర్సుల వారీగా సరఫరా..**

మారిన ప్రథమ సంవత్సరం పాఠ్యపుస్తకాలు ఈ ఏడాది రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కో విద్యార్థికి రాత పుస్తకాలు 12 చొప్పున అందజేశారు. ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు కూడా తరగతులు నిర్వహించారు. గతేడాది విద్యార్థుల ప్రవేశాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలను సరఫరా చేయనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 27,955 ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్లమాధ్యమ పుస్తకాలు వచ్చాయి. ఉమ్మడి జిల్లాల్లోని ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించిన విద్యార్థులకు వైట్‌లాంగ్ నోట్ పుస్తకాలు 1,47,708, సింగిల్ రూల్డ్ నోట్ పుస్తకాలు 1,47,708 వచ్చాయి. వాటిని మండలకేంద్రాల్లోని ప్రభుత్వ కళాశాలలకు పంపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని కళాశాలలకు తరలించారు.

**మార్పులు ఎన్నో...**



ఇంటర్మీడియట్ విద్యలో కూటమి ప్రభుత్వం కొత్త విధానాలను తెచ్చింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం సిలబస్ మారడం, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు నిర్వహించనుండటం, ఎంపీసీ గ్రూపులో గణితం–ఎ, గణితం–బి కలిపి గణితశాస్త్రంగా, బాటనీ, జువాలజీ కలిపి బయాలజీగాను పరిగణించనున్నారు. అదనంగా ఆరో సబ్జెక్టును ఎన్నుకునే అవకాశం విద్యార్థులకు ఇవ్వడం, ఈ ఏడాది ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కొత్త సిలబస్ ఆధారంగా అన్ని సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలకు ప్రశ్నపత్రాలు మారనుండటం, ఒక్క మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టనుండటం వంటివి అమలు చేయనున్నారు. జూన్ 2 నుంచి కళాశాలలు పునఃప్రారంభానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**ఎంతో ఉపయుక్తంగురవయ్యశెట్టి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, కర్నూలు**

గత ఏడాది నుంచి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందిస్తోంది.పాఠ్య, నోటు పుస్తకాలను పేద విద్యార్థులు కొనలేరని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పంపిణీ చేస్తుండటం శుభపరిణామం. ప్రస్తుతం నోటుపుస్తకాలు, ద్వితీయ సంవత్సరం ఆంగ్లమాధ్యమం పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వాటిని కళాశాలలకు పంపించాం.

# అన్నదాత 'వెల'విల

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు వేసవిలో ఎక్కువగా కలింగర, కర్బూజ, దోస పంటలు సాగు చేస్తారు. డిమాండు ఉండి, మంచి ధరలు వస్తాయని ఆశ. తీరా పంట చేతికొచ్చే సరికి మార్కెట్లో ధరలు పతనం కావడంతో పెట్టుబడి దక్కని పరిస్థితి. మరోవైపు మార్కెట్ సౌకర్యం లేక.. ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు రవాణా ఖర్చులు భారంగా మారడంతో పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వర్షం కారణంగా కాయలు పగిలిపోయి తీరని నష్టాన్ని మిగిల్చాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెట్టుబడి తడిసి మోపెడు**

జిల్లాలో కలింగర, కర్బూజా, దోస వంటి పంటలను రబీ కింద 1,500 ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంటలు 65–70 రోజుల్లో కోతకు వస్తాయి. మొదటి 30 రోజుల వరకు పెద్దగా ఖర్చు ఉండదు. పూత, పిందె సమయంలో పెట్టుబడి పెరుగుతుంది. దిల్లీ దోస సాగుకు హెక్టారుకు రూ.1.60 లక్షలు, కలింగర, కర్బూజాకు రూ.1.30–1.40 లక్షల వరకు ఖర్చవుతోంది. జిల్లాలో పంటల సాగుకు రైతులు సగటున రూ.22.50 కోట్లు వెచ్చించారు.

**సాగు పెరగడమే ప్రధాన కారణం**

కలింగర, కర్బూజ, దోస వంటి పంటలను చిత్తూరు జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల్లో ఈసారి ఎక్కువగా సాగు చేశారు. అన్ని రాష్ట్రాల నుంచి దిల్లీ మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తీసుకొస్తున్నారు. దాంతో ధరలు అమాంతం తగ్గిపోయింది. ప్రతి ఐదేళ్లకొకసారి ఇలాంటి పరిస్థితి రైతులకు ఎదురవుతోందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

**రవాణా భారం**

దోస పంటకు దిల్లీలో మార్కెట్ ఉంది. ఇక్కడ్నుంచి లారీల్లో రవాణా చేస్తున్నారు. లారీ బాడుగ రూ.1.20 లక్షలు, బాక్సులకు రూ.40 వేలు, కూలీలకు రూ.15 వేలు, వ్యాపారుల కమీషన్ 8 శాతం (వచ్చిన మొత్తంలో) చొప్పున చెల్లించాలి. ఎకరాకు 14 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.13 వేలు మించి పలకడం లేదు. 14 టన్నుల లారీ దిల్లీకి పంపితే ఖర్చులకే సరిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కలింగర, కర్బూజా రకాలు స్థానికంగా కిలో రూ.3–4 వ్యాపారులు అడుగుతున్నారు. చేసేదిలేక రైతులు పంటను పొలాల్లోనే వదిలేశారు.

**పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు ఓబులేశు, రైతు, కమ్మూరు(కూడేరు)**

ఆరెకరాల్లో దిల్లీ దోస సాగు చేశా. అప్పు చేసి ఎకరాకు రూ.70 వేలు చొప్పున రూ.4.20 లక్షలు పెట్టబడి పెట్టా. ఎకరాకు 8–10 టన్నులు దిగుబడి రావాలి. అయితే 6 టన్నులే వచ్చింది. టన్ను రూ.13 వేలతో అమ్ముకున్నా. ఖర్చులు పోనూ ఆరెకరాలకు కేవలం రూ.48 వేలు మాత్రమే చేతికొచ్చింది.

**కిలో రూ.2–3కు అడుగుతున్నారు - సంజీవరాయుడు, రైతు, చోళసముద్రం (కూడేరు)**

ఐదెకరాల్లో కలింగర (నల్ల రకం) సాగు చేశా. పెట్టుబడి రూ.3.50 లక్షలు పెట్టా. తెగుళ్లు ఆశించకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నా. దిగుబడి బాగానే వచ్చింది. తీరా చూస్తే కోత సమయంలో ధర పూర్తిగా పడిపోయింది. కిలో రూ.2–3కు వ్యాపారులు అడుగుతున్నారు. కాయలు కోసేందుకు కూలీల ఖర్చులు రాక పొలంలోనే వదిలేశా. చివరికి అప్పులు మిగిలాయి.

# ప్రయోగం.. వినూత్నం



చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వ్యవస్థాపకత మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం(ఈఎండీపీ) పాఠశాల విద్యార్థుల్లో వెలుగులు నింపుతోంది.. వారిని ప్రోత్సహిస్తే శాస్త్రవేత్తలుగా రాణిస్తారని గతంలో నిరూపితమైంది.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో వ్యవస్థాపకత మనస్తత్వాన్ని అలవర్చుకోవడానికి పోటీ పడుతున్నారు.. ఈ కార్యక్రమం అమలు కోసం ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 39 జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను విద్యాశాఖ ఎంపిక చేసింది.

తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ప్రతి శుక్రవారం సాయంత్రం రెండు పీరియడ్లు కేటాయించి తొమ్మిది వారాలు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల్లో 11 ఉన్నత పాఠశాలల నుంచి 15 ఎంపిక చేశారు. ఆపై జిల్లా ఈఎండీపీ ఎక్స్‌పో–2025ను ఈ నెలలో చిత్తూరులో నిర్వహించారు. అందులో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారి ఉత్తమ ప్రాజెక్టులకు మొదటి మూడు బహుమతులు విద్యాశాఖ అందజేసింది. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి పాల్గొంటారు.

పాఠశాల: జడ్పీ ఉన్నత పాఠశాల టి.సదుమూరు, కుప్పం మండలం

విద్యార్థులు: వర్షిణి, ధనుశ్రీ, తిరుమలర్

గైడ్ టీచర్: వి..వెంకటరమణ

అంశం: దేశంలో సేంద్రియ సాగు ఆవశ్యకత

మనది వ్యవసాయ ప్రధాన దేశం. అధిక పంట ఉత్పత్తుల కోసం రసాయనిక ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడటంతో మట్టి నాణ్యత తగ్గిపోతుంది. క్యాన్సర్ తదితర ప్రమాదకర వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ సమయంలో ఉత్తమ పరిష్కారం సేంద్రియ సాగు. కంపోస్ట్, జీవామృతం, మజ్జిగ పులుసు ఉపయోగించాలి. స్థానిక విత్తనాలు ఉపయోగించాలి. బహుళ పంటల సాగు ప్రోత్సహించాలి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచేందుకు ఇది దోహదపడుతుంది. విద్యార్థులు ప్రయోగాత్మకంగా మొదట తమ పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో ఐఎండీపీలో భాగంగా ఆర్గానిక్ విధానంలో భూమిని రెండుసార్లు తవ్వి, పాదులు చేసి ఘన జీవామృతంతో సారవంతం చేశారు. ఆకుకూర విత్తనాలతో సేంద్రీయ సాగు పద్ధతి అవలంబించి చేసి చూపారు. ఇదే వారికి బహుమతి తెచ్చి పెట్టింది. పాఠశాల: జడ్పీ ఉన్నత పాఠశాల, గంగాధరనెల్లూరు

విద్యార్థులు: రూపేష్, లీలాప్రసాద్

గైడ్ టీచర్: రవి

అంశం: బహుళ రక్షణ స్టిక్

గ్రామీణ రైతులు పొలాలకు సాగునీటి కోసం కాలువలుతవ్వి అందులో నీరు సజావుగా పారేలా చూసేందుకు నిత్యం వెళ్తారు. రాత్రివేళ వెళ్లేటప్పుడు క్రిమికీటకాలు, విష పురుగుల బారిన పడకుండా ఉండేందుకు విద్యార్థులు వినూత్నంగా ఆలోచించారు. ఈ సమస్య అధిగమించేందుకు వైబ్రేషన్ లైట్ సౌండ్ సిస్టమ్ ద్వారా లబ్ధి చేకూరుతుందని తలచి దాన్ని రూపొందించారు. బహుళ రక్షణ స్టిక్ తయారుచేసి మొదటి బహుమతి సాధించారు.

పాఠశాల: జడ్పీ ఉన్నత బాలికల పాఠశాల, కార్వేటినగరం

విద్యార్థులు: జ్యోత్స్నారాణి

గైడ్ టీచర్: లీనాకుమారిఅంశం: వ్యర్థాల సమస్య పరిష్కరించడం

పరిసరాల్లో కాలుష్యాన్ని తగ్గించడం, నివాస ప్రాంతాల్లో చెత్తను నివారించడం, రీసైకిల్ చేయడం, ప్లాస్టిక్ నివారణ కల్పించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. వ్యర్థాలను ఎలా తొలగించి పర్యావరణాన్ని రక్షించుకోవాలి.. ప్లాస్టిక్ వినియోగించడం ద్వారా కలిగే నష్టాలు వివరించి బహుమతి సాధించింది విద్యార్థిని.

# అక్రమార్కులకు సంపద.. పులికాట్‌కు ఆపద



సూళ్లూరుపేట: డివిజన్ పరిధిలో గ్రావెల్, మట్టి, ఇసుక తవ్వకాల అక్రమ రవాణా 'మూడు పువ్వులు.. ఆరుకాయలు'గా కొనసాగుతోంది. దీన్ని కట్టడి చేయాల్సిన సంబంధిత శాఖాధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీంతో అక్రమార్కులకు అడ్డేలేకుండా పోయింది. ఈ తంతు తెదేపా, వైకాపా నేతల కనుసన్నల్లోనే జరగడం గమనార్హం. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల నుంచి మట్టి, గ్రావెల్, ఇసుక ఇబ్బడిముబ్బడిగా వచ్చేస్తుంది. తాజాగా తడ మండలంలోని కారిజాత చెరువులో మట్టి తవ్వకాలపై తెదేపా, వైకాపా నేతలు కన్నేశారు. ఇక్కడ ఇరువురు ఒకటై మూడు రోజులుగా చెరువులో రాత్రివేళ యంత్రాలను పెట్టి, మట్టి తవ్వకాలను జరిపి, సూళ్లూరుపేట ప్రాంతానికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ట్రాక్టర్ల రాకపోకలతో మార్గ మధ్యలో ఉండే దావాదిగుంట, కసారెడ్డిపాళెం, తదితర ప్రాంతాల గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. కారిజాత చెరువులో మూడురోజుల వ్యవధిలో వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వేసి, సూళ్లూరుపేటకు తరలించేశారు. మట్టిని తీసుకొని ట్రాక్టర్లు శ్రీహరికోట రోడ్డు మీదుగా సూళ్లూరుపేటకు వస్తున్నా.. ఏ శాఖ అధికారి కూడా వాటిని ఆపి, ప్రశ్నించిన దాఖలాలు లేవు. దీంతో అక్రమార్కులు యథేచ్ఛగా పని కానిచ్చేస్తున్నారు. కారిజాత చెరువులో మేలైన మట్టి ఉండటంతోపాటు, రాత్రి వేళ వాహనాలు వచ్చేందుకు చక్కటి రోడ్డు మార్గం కావడంతో మట్టి మాఫియాకు బాగా కలిసొచ్చింది. దీంతోపాటు మాఫియా సంబంధిత శాఖాధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వడంతో వారు ఇటువైపు తొంగి చూడటం లేదు. తవ్వకాలకు అనుమతుల్లేవు.. కారిజాత చెరువులో మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతు లు ఇవ్వలేదు. దీనిపై చర్యలు తీసుకుంటాం. సంబంధిత ఏఈకి దిశానిర్దేశం చేస్తాం. శ్రీధర్, జలవనరుల శాఖ డీఈఈ

## ధర తగ్గి.. సరకు మగ్గి

కోవెలకుంట్ల : రబీలో శనగ సాగు చేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు దిగుబడులు తగ్గిపోయి నష్టాలపాలయ్యారు. ధర సైతం అంతంతమాత్రంగా ఉండటంతో సరకు అమ్ముకోలేక గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. అద్దె భారంగా మారడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీలో 2,43,167 ఎకరాల్లో రైతులు శనగ సాగు చేశారు. కర్నూలు జిల్లాలో సాధారణ సాగు 1,20,000 ఎకరాలు కాగా.. 1,15,000 ఎకరాల్లో సాగైంది. ఇక్కడ జేజీ–11 (ఎర్ర శనగలు) రకం అధికంగా సాగైంది. నంద్యాల జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 1,55,507 ఎకరాలు ఉండగా 1,28,137 ఎకరాల్లో రైతులు పంట వేశారు.ఈ జిల్లాలో జేజీ–11, కాబూలీ (తెల్ల శనగలు) రకాలు సాగయ్యాయి. ఒక్క కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 95,740 ఎకరాల్లో శనగ సాగు చేశారు.

**దిగుబడులపై ప్రభావం**

గతేడాది రబీ ప్రారంభంలో వర్షాలు బాగా కురిసి వాతావరణం అనుకూలించడంతో రైతులు పెద్దఎత్తున శనగ సాగు చేశారు. ఎకరాకు



9–10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించారు. వాతావరణంలో మార్పులతోపాటు డిసెంబరులో తుపాను ప్రభావంతో పూత రాలిపోయి ఎర్ర తెగులు ఆశించింది. ఫలితంగా ఎకరాకు 5–7 క్వింటాళ్లకు మాత్రమే పరిమితమైంది.

**గోదాముల్లో నిల్వ చేసుకుని..**

రైతులు పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు ఖర్చు చేశారు. గతేడాది క్వింటా రూ.10 వేలు ఉండగా.. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో జేజీ–11 రకం క్వింటా ధర రూ.6 వేలు, కాబూలీ రకం రూ.6,700 పలికింది. ప్రస్తుతం ధరలు మరింత తగ్గిపోయి జేజీ–11 రకం క్వింటా రూ.5,600, కాబూలీ రకం క్వింటా రూ.6,200 మాత్రమే ఉండటం గమనార్హం. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కొందరు రైతులు ప్రస్తుతమున్న ధరలకే అమ్ముకోగా.. మరికొందరు మాత్రం ధర పెరుగుతుందన్న ఆశతో గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. నెలకు క్వింటాకు రూ.7 చొప్పున గోదాముకు అద్దె చెల్లిస్తూ ఆశగా ఎదురుచూస్తున్నారు.


**ఇబ్బందులు పడుతున్నాం చెన్నకృష్ణారెడ్డి, రైతు, జొలదరాశి**

నేను రబీలో 13 ఎకరాల్లో శనగ సాగు చేశా. ఎకరాకు 5 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ధర ఏమాత్రం ఆశాజనకంగా లేదు. కొంతకాలం ఆగితే ధర పెరుగుతుందన్న ఆశతో మొత్తం 60 బస్తాలను గోదాముకు తరలించి నిల్వ చేశా. ఉన్న ధరకు అమ్ముకోలేక.. గోదాముకు అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నా.

## ముఖ హాజరులోనూ మాయ

ఒంగోలు : ఉద్యోగుల ముఖ ఆధారిత గుర్తింపు యాప్ (ఎఫ్ఆర్ఎస్)నే ట్యాంపరింగ్ చేసి కొందరు వైద్యులు, సిబ్బంది బోగస్ హాజరు వేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తాజాగా గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా 156 మంది వైద్యులు, 76 మంది సిబ్బంది ఈ తరహా అవకతవకలకు పాల్పడుతున్నట్లు నిగ్గు తేల్చారు. ఎన్టీఆర్, శ్రీకాకుళంతో పాటు ప్రకాశం జిల్లా నుంచి బోగస్ హాజరు ఎక్కువగా నమోదవుతున్నట్లు గుర్తించి... వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

**సంజాయిషీ నోటీసులు జారీ...:** జిల్లా వరకు అర్ధవీడు, బేస్తవారపేట, ముండ్లమూరు, తూర్పుగంగవరం, పొన్నలూరు, వేములపాడు, టంగుటూరు, కనిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో హాజరు అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. ఆ వివరాలను అమరావతి నుంచి డీఎంహెచ్‌వోకు పంపారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల




మేరకు ట్యాంపరింగ్‌కు పాల్పడిన వైద్యులు, సిబ్బందికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. పూర్తిస్థాయిలో విచారణకు జిల్లా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

**వైద్యుల దారిలోనే సిబ్బంది...**

సాధారణంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులుంటారు. వీరు ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు వేసిన తరువాతే బయట విధులకు వెళ్లాలి. కానీ... వైద్యులెవరూ స్థానికంగా నివాసం ఉండడం లేదు. ఒంగోలు లేదా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఉంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వీరిని చూసి మిగతా సిబ్బందీ సమయపాలన గాలికొదిలేశారు. కొన్ని చోట్ల ఎవరు ఏరోజు విధులకు రావాలన్నది ముందే మాట్లాడుకుని సర్దుబాటు చేసుకుంటున్నారు. కొందరు నిర్ణీత సమయానికి వచ్చినా హాజరు వేసి సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలన్నీ జిల్లా ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

## ఇక స్వచ్ఛ పురాలు

చీమకుర్తి : నగర, పురపాలక సంఘాల్లో కొండల్లా పేరుకున్న వ్యర్థాల సమస్యకు చరమగీతం పాడనున్నారు. ఏళ్లుగా పేరుకుపోయిన వాటిని తొలగించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు నగర పాలక సంస్థ, మిగిలిన పురపాలక సంఘాల్లో లెగసీ వేస్ట్‌లాండ్ ప్రక్రియ చేపట్టేందుకు రూ.21.87 కోట్లతో టెండరు ప్రక్రియను ఖరారు చేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లాలోని పురపాలక సంఘాలతో పాటు ఒంగోలు కార్పొరేషన్‌లో చెత్త సమస్య పరిష్కారానికి అడుగులు వేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎంతమేర వ్యర్థాలు పేరుకుపోయాయన్నది డ్రోన్ కెమేరాల ద్వారా గుర్తించి లెక్కలు తేల్చారు. ఉమ్మడి ప్రకాశంలోని ఒంగోలు నగర పాలక సంస్థ, చీరాల, మార్కాపురం, కందుకూరు, అద్దంకి, చీమకుర్తి, కనిగిరి, దర్శి, పొదిలి పురపాలక సంఘాల పరిధిలో మొత్తం పెద్దఎత్తున వ్యర్థాలున్నట్లు లెక్క తేల్చారు. ఈ నగర, పురపాలక సంఘాలను అద్దంకి క్లస్టర్‌లో చేర్చారు.**టెండర్లు నిర్వహించి..**

బయో మైనింగ్ విధానంలో వ్యర్థాలను ఎరువుగా మార్చగా మిగిలిన వాటిని థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు తరలిస్తారు. దీన్ని చేపట్టేందుకు ఇటీవల స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ టెండర్లు నిర్వహించింది. ఇందుకోసం రూ.21.87 కోట్లతో టెండర్లు పిలవగా, గుంటూరుకు చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి నాటికి అన్నిచోట్లా ఈప్రక్రియను పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైబ్రేటర్, సీనర్ లాంటి యంత్రాలను వినియోగించి ఎరువును, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తారు.

చురకలు

గురువారం 17 ఏప్రిల్ 2025

# కొండల్ని కొల్లగొడుతున్నారు!

తాడిపత్రి : గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రకృతి వనరులన్నీ కొల్లగొడుతున్నారు. తాడిపత్రిలో ఇటు ఇసుకే కాకుండా అటు కొండల్నీ వదలడం లేదు. ఇది కొందరికి అక్రమార్జనగా మారింది. తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లి, ఆవుల తిప్పాయ పల్లి, గదరగుట్టపల్లి గ్రామాల పరిసరాల్లో ఉన్న కొండల్ని తవ్వేస్తున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా గ్రావెల్, రాళ్లను యథేచ్ఛగా తరలిస్తున్నారు.

తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లి గ్రామ పరిసరాల్లోని సర్వే నంబరు 1071లో సుమారు 100 ఎకరాల్లో కొండ విస్తరించింది. కొండ పరిసరాల్లో ఉన్న కొందరు కంకర పరిశ్రమ దారులు, మట్టి




వ్యాపారులు యథేచ్ఛంగా అక్రమ రవాణా సాగిస్తున్నారు. యర్రగుంట పల్లి, పుట్లూరు మండలాల్లో ఉన్న కంకర పరిశ్రమ దారులు ఎలాంటి అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు జరిపి కంకరకు సంబంధించి రాళ్లను తరలిస్తున్నారు. అంతేకాకుండా మట్టి వ్యాపారులు గ్రావెల్‌ను తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని ప్రైవేట్ వెంచర్లకు, ఇతర ప్రాంతాలకు తరలిసూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. మరికొందరు భారీ వాహనాలతో రాళ్లను పగలకొట్టడం, బ్లాస్టింగ్ చేయడం చేస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని జనం ఆరోపిస్తున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం : ఓబుళరెడ్డి, మైనింగ్ ఏడీ, తాడిపత్రి**

యర్రగుంటపల్లి కొండలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తాం. అక్కడ అక్రమంగా బ్లాస్టింగ్ చేసినా, కంకరకు ఉపయోగపడే రాయి, మట్టిని తరలించినా సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఆయా ప్రాంతాల్లో ఎవరికి బ్లాస్టింగ్ చేసేందుకు అనుమతి లేదు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

# తవ్వేకొద్దీ అక్రమాలే..!

కుప్పం : అడవిలో పచ్చనిచెట్లను కొల్లగొట్టిన యంత్రాంగం.. నగరవనం పనులకు శ్రీకారం చుట్టింది. వైకాపా హయాంలో రూ. 1.40 కోట్లు ఖర్చుచేయగా... కూటమి ప్రభుత్వంలో మరో రూ. 60 లక్షలు మంజూరు చేసింది. నిధులు పారదర్శకంగా ఖర్చు చేయాల్సిన యంత్రాంగం జేబులు నింపుకోవడమే పనిగా పెట్టుకుంది. ఉపాధి నిధులు సైతం నర్సరీల పేరుతో అటవీ అధికారులు అడ్డదారిలో కాజేయడం గమనార్హం. కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో కార్తీకవనాన్ని నగరవనంగా మార్చి పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటు చేస్తామని అప్పటి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు వైకాపా ప్రభుత్వం రూ. 1.40 కోట్లు మంజూరు చేసింది. వాటితో నగరవనంలో ఏనుగుల బొమ్మలు కొలువుదీర్చారే తప్ప.. ఆ పార్కులో ఆశించినస్థాయిలో అభివృద్ధి పనులు జరగలేదు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 60 లక్షలు మంజూరైంది. ఈ నిధులు వన సంరక్షణ సమితి ద్వారా విడుదలవుతున్నా... వనసంరక్షణ సమితి ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లకు తెలియకుండా అధికారులే ఖాళీ చెక్కులపై సంతకాలు చేసుకుంటూ నిధులు స్వాహాకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా... అటవీశాఖ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు.

**రాకపోయినా వచ్చినట్లు..**

నగరవనం నర్సరీలో మొక్కల పెంపకం పేరుతో ఉపాధి హామీ కింద నకిలీ బిల్లులు పెట్టి నిధులు కాజేశారు. వెబ్‌సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ వివరాలు పరిశీలిస్తే... నర్సరీలో ఉపాధి పథకం కింద 812 సైజుతో 20 వేల బ్యాగులకు మట్టి నింపి... పదిమంది కూలీలతో పని చేసినట్లు వివరాలు అప్‌లోడ్ చేశారు. కూలీలు రాకపోయినా... అటవీశాఖకు చెందిన బేస్ క్యాంపు వాచర్లను కూలీలుగా మార్చి ఆన్‌లైన్‌లో పెట్టి నిధులు ఊడ్చేశారు.

**విషయం నా దృష్టికి రాలేదు..**షమీర్, డీఆర్‌వో, నడుమూరు

ఉపాధి పథకం కింద నర్సరీలో నకిలీ బిల్లులు పెట్టిన విషయం నా దృష్టికి రాలేదు. నా దృష్టికి వచ్చిన వెంటనే ఆ బిల్లులను తిరస్కరిస్తా. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యం... దూరమైన హరితాంధ్ర లక్ష్యం

ఒంగోలు : గత ప్రభుత్వ వైఫల్యాలు నేటికీ వెన్నాడుతున్నాయి. సామాజిక అటవీ నర్సరీల నిర్వహణే ఇందుకు ఓ ఉదాహరణ. హరితాంధ్ర ప్రదేశ్ లక్ష్యంలో భాగంగా ఏటా 30 లక్షల మొక్కలు పెంచాల్సి ఉన్నా... వైకాపా అయిదేళ్ల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలోని ఆరు నర్సరీలు మూతపడ్డాయి. కూటమి సర్కారు వాటిని పునరుద్ధరించినా సమయం మించిపోవడంతో నిర్దేశిత లక్ష్యం చేరుకోలేని దుస్థితి నెలకొంది.

**అయిదేళ్లుగా పట్టించుకోలేదు...:** జిల్లా వరకు కొత్తపట్నం, కలుజువ్వలపాడు, టపాచెట్టు, హాజీపురం, బల్లిపల్లి, మర్రిపాలెం, మురారిపల్లి, తూకపల్లి, తుమ్మలచెరువులో మొత్తం తొమ్మిది సామాజిక నర్సరీలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు ఎనిమిది మంది డీఆర్వోలు, ముగ్గురు రేంజ్ అధికారులు అవసరం కాగా... ఒక్క మార్కాపురానికి మాత్రమే డీఆర్వో ఉన్నారు. సిబ్బంది భర్తీ దిశగా గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. దీంతో ఇప్పటి వరకు 13 లక్షల మెక్కలు మాత్రమే పెంచగలిగారు. వేసవి ఆరంభం కావడంతో మిగతా ప్రక్రియ నిలిచిపోయింది. జులైలో కొత్తగా పెంపకం ప్రారంభించాల్సి ఉన్నా... సిబ్బంది కొరత కారణంగా ఆగస్టులో ఈ ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**ఇతరత్రా సమస్యలు కూడా...**ఇప్పటి వరకు నర్సరీల పునరుద్ధరణ, మొక్కలు పెంచే సంచులు నింపడం తదితరాలకు రూ. 30 లక్షల వరకు ఖర్చయ్యింది. ఇందులో రూ. 5 లక్షలు మాత్రమే మంజూరు కావడంతో నిధుల కొరత నెలకొంది. మరోవైపు కూలీలకు నిర్దేశిత పనిదినాలు పూర్తికావడం అవరోధంగా మారింది.

# ఆత్మరక్షణలో కళలు

అనంతపురం : బాలికల్లో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పాదుకొల్పి ఆపదలో తనను తాను రక్షించుకోవడానికి ఆత్మరక్షణ కళలు నేర్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. 6 నుంచి 9వ తరగతి వరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ఈ విద్య నేర్పడానికి రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రసిక్షణ్ సెల్ఫ్ డిఫెన్స్ పేరిట పథకం రూపొందించింది. ఒక్కో పాఠశాలలో శిక్షకుడు కనీసం 20 తరగతులు నిర్వహించి ఆత్మరక్షణ కళల్లో నైపుణ్యం పెంపొందించాలి. ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యేలోగా తరగతులు పూర్తి చేయాలి. అయితే ఇప్పటి వరకు అసలు తరగతులే ప్రారంభం కాని పాఠశాలలు చాలా ఉన్నాయి.

**జిల్లాలో 495 పాఠశాలలు ఎంపిక**

ఆత్మరక్షణ కళలపై తర్ఫీదు ఇవ్వడానికి జిల్లాలో 495 పాఠశాలలను ఎంపిక చేశారు. మొత్తం 45,640 మంది బాలికలకు తర్ఫీదు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. కేవలం అనంతపురం పరిసర మండలాల్లో మాత్రమే శిక్షణ తరగతులు నిర్వహించారు. దాదాపు 150 పాఠశాలల్లో శిక్షణ తరగతులు ప్రారంభం కాలేదని వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒక్కో పాఠశాలకు సంఖ్యను బట్టి రూ. 10 వేల వరకు గౌరవ వేతనం శిక్షకులకు చెల్లించాలి.

**రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీకి బాధ్యతలు**

బాలికలకు శిక్షణ ఇచ్చే బాధ్యతను రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీకి అప్పగించారు. అన్ని పాఠశాలల్లో శిక్షణ పూర్తి చేస్తే దాదాపు రూ. 45 లక్షలకుపైగా ఏజెన్సీ ఖాతాకు జమ అవుతుంది. విద్యాసంవత్సరం త్వరలో ముగుస్తుంది. ప్రస్తుతం ఈ ఏజెన్సీకి రూ. 14 లక్షల వరకు ప్రభుత్వం నిధులు జమ చేసింది. అయితే ఏ పాఠశాల లోనూ 20 శిక్షణ తరగతులు ఇచ్చిన దాఖలాలు కనిపించలేదు. కొన్ని పాఠశాలల్లో కేవలం 10 రోజులు మాత్రమే శిక్షణ ఇచ్చి పూర్తయినట్లు నివేదికలు ఇచ్చారు. ప్రభుత్వ నిధులు భారీగా మింగడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

**కొన్ని ఉదాహరణలు**

ఉరవకొండ మండలం బూదగవి జడ్పీ ఉన్నత పాఠశాలలో కేవలం రెండు రోజులు మాత్రమే బాలికలకు తర్ఫీదు ఇచ్చారు.

రాప్తాడు మండలం మరూరు జడ్పీ పాఠశాలకు అనర్హత ఉన్న ఒక శిక్షకుడు ఒకరోజు మాత్రమే పరిచయం చేసుకుని వెళ్లాడు. అతనికి ఎలాంటి అర్హత లేకపోవడంతో వెనక్కి పంపామని పీఈటీ సిరాజ్ వివరించారు.

అనంతపురం ప్రభుత్వ పాఠశాల-2లో కేవలం 10 రోజులు మాత్రమే శిక్షణ ఇచ్చి 20 రోజులు ఇచ్చినట్లు నివేదిక సృష్టించారు.

శిక్షకులతో బాండ్ రాయించుకున్నాం : శైలజ, పీఓ సమగ్ర శిక్షా

బాలికలకు ఆత్మరక్షణ కళలకు సంబంధించి అనేక పాఠశాలల్లో తరగతులు ప్రారంభం కాని విషయం వాస్తవమే. విద్యా సంవత్సరం ముగిసినా 20 తరగతులు తప్పనిసరిగా చేయాలంటూ శిక్షకులతో బాండు రాయించుకున్నారు. ఎవరెవరు ఎన్ని తరగతులు నిర్వహించారో పర్యవేక్షిస్తున్నాం. నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటాం.

# హంద్రీనీవా కాలువకు మహర్దశ



గుంతకల్లు: గుంతకల్లు డివిజన్ పరిధిలో హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. కర్నూలు జిల్లా మల్యాల నుంచి కాలువ గుంతకల్లు మండలం కసాపురం గ్రామంలోకి ప్రవేశించి జీడిపల్లి వరకు వెళ్తుంది. గుంతకల్లు డివిజన్ పరిధిలో కాలువ కసాపురం నుంచి జీడిపల్లి వరకు 82 కి.మీ.ల పొడవు ఉంది. దీన్ని విస్తరించడానికి ప్రభుత్వం రూ. 166 కోట్లను కేటాయించి ఆ పనులను గుత్తేదారుకు అప్పగించింది.

**జూన్ ఆఖరుకంతా పూర్తి**

జూన్ నెలాఖరుకంతా పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు ఆదేశాలు ఇవ్వడంతో పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో భారీ యంత్రాలు రంగంలోకి దిగాయి. కాలువలో కసాపురం, గుంతకల్లు కొట్టాల, రాగులపాడు, ఉరవకొండ, కౌకుంట్ల, రాంపురం వద్ద పనులు జరుగుతున్నాయని కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసనాయక్ చెప్పారు.కాలువలో 1300 క్యూసెక్కుల నుంచి 3500 క్యూసెక్కుల నీరు ప్రవహించే విధంగా చూడటానికి ప్రభుత్వం కాలువ విస్తరణ పనులు చేపట్టింది. కాలువకు నీటిని విడుదల చేసే లోగా పనులు పూర్తి చేసి రైతులకే కాకుండా ప్రజలకు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు ఈఈ చెబుతున్నారు.

**రాగులపాడు వద్ద తూము నిర్మించరూ**

విస్తరణ పనుల్లో భాగంగా హంద్రీనీవా కాలువకు రాగులపాడు వద్ద తూము ఏర్పాటు చేసి ఉరవకొండ నియోజకవర్గంలో నుంచి గుంతకల్లు మండలం వరకు కాలువను తవ్వి నీటిని కుంటలు చెరువులకు అందించడానికి పనులను చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. గతంలో పనులను తెదేపా ప్రభుత్వం మంజూరు చేసింది కాబట్టి అమలు చేయాలని రైతులు మూడు రోజుల కిందట గుంతకల్లుకు వచ్చిన నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడికి విన్నవించారు. ఈవిషయంలో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని ఈఈ వివరించారు.

# భీమవరంలో 'భూ'చోళ్లు



బుచ్చెయ్యపేట : ప్రభుత్వ భూములపై బూచోళ్ల కళ్లుపడ్డాయి. ఆర్.భీమవరం, చినభీమవరం గ్రామాల్లో వందల ఎకరాలను కబ్జా చేశారు. అనకాపల్లికి చెందిన కొందరు వ్యాపారులు, స్థానిక ముఖ్య నాయకుడు చక్రం తిప్పుతూ భూములను తమ గుప్పెట్లో ఉంచుకున్నారు. అటు పేదలు, ఇటు అధికారులను బురిడీ కొట్టించి ప్రభుత్వ భూముల్లో పాగా వేశారు.

చోడవరం నియోజకవర్గంలో ఎస్‌ఈజెడ్ ఒక్కటీ లేదు. ఆర్.భీమవరం ప్రాంతంలో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన అనకాపల్లికి సమీపంలో ఉండటంతోపాటు దగ్గరలోనే జాతీయ రహదారి, రైలు మార్గం ఉంది. అన్ని అనుకూలతలు ఉండటంతో ఇక్కడ ఎస్‌ఈజెడ్ ఏర్పాటు చేసి పరిశ్రమలు నెలకొల్పితే స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు భావించారు. పారిశ్రామిక జోన్ ఏర్పాటుకు గతంలో ప్రయత్నాలు చేశారు. సంబంధిత అధికారులు వచ్చి భూములను పరిశీలించారు. సర్వే చేసి ఎన్ని ఎకరాలు అందుబాటులో ఉన్నాయో గుర్తించారు. భూసేకరణకు సిద్ధమవుతున్న తరుణంలో అక్రమార్కులు అడ్డుకున్నారు. స్థానికులతో ఆందోళనలు చేయించి భూసేకరణ జరగకుండా పావులు కదిపారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడం, రాజకీయంగా నష్టం జరుగుతుందని ఎమ్మెల్యే వెనక్కు తగ్గడంతో ఎస్‌ఈజెడ్ ఏర్పాటు కాలేదు.

**దళారులుగా అవతారమెత్తి..** ఇక్కడున్న చోటా నాయకులు దళారుల అవతారం ఎత్తి ప్రభుత్వ భూముల అమ్మకాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఆశ చూపి ప్రభుత్వ భూములను కొనిపిస్తున్నారు. కొంతమంది తెలియకుండా ఆ భూములను కొనుగోలు చేసి మోసపోతున్నారు. గాజువాకకు చెందిన వ్యాపారవేత్త కడియాల రాజేశ్వరరావు 30 ఎకరాల డి.పట్టా భూములను కొనుగోలు చేసి మోసపోయారు. తర్వాత అసలు విషయం తెలుసుకుని వాటిని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేశారు.

**రీసర్వే జరగలేదు...** గత ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో భూముల రీసర్వే నిర్వహించారు. జిరాయితీ భూములన్నింటినీ సర్వే చేసి ప్రభుత్వ భూములు, డీపట్టా భూములను సర్వే చేయకుండా వదిలేశారు. భూ ఆక్రమణలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడం, అప్పటికే వాటిపై వివాదం నెలకొనడంతో అధికారులు సర్వే చేయకుండా వదిలేశారు. సర్వే పూర్తి చేస్తే ఆక్రమణల్లో ఉన్న భూముల వివరాలన్నీ బయటకు వచ్చే ఆస్కారముంది.

**ఆలయ భూములూ..**

ఈ భూములకు సమీపంలో పడమటమ్మ తల్లికి స్థానికులు ఆలయం నిర్మించారు. చుట్టుపక్కల ఖాళీగా ఉన్న భూములను చినభీమవరం గ్రామస్థులందరూ కలిసి ఆలయ అభివృద్ధికి కేటాయించుకున్నారు. ఆక్రమణదారులు వాటినీ వదిలిపెట్టలేదు. ఆలయ చుట్టుపక్కల భూముల్లో కొన్నింటిని కబ్జా చేసి అనుభవిస్తున్నారు. చుట్టూ కంచె వేసి జీడిమామిడి, పండ్ల మొక్కలు పెంచుతున్నారు. ఆలయ భూములను కబ్జా చేయడంపై ఆక్రమణదారులకు వ్యతిరేకంగా స్థానికులు పోరాడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే రాజును ఇటీవల కలిసి ఫిర్యాదు చేశారు. **పట్టాదారులు ఒకరు.. భూమిలో మరొకరు..**

సర్వే నంబరు 173 సబ్ డివిజన్లలో కొంతమందికి గతంలో డి.పట్టాలు ఇచ్చారు. ఈ జాబితాలో అనకాపల్లికి చెందిన కొందరు, స్థానికుల పేర్లు కొన్ని ఉన్నాయి. వారిలో చాలామందికి తమ పేరిట పట్టాలున్నాయన్న సంగతే తెలియలేదు. బడాబాబులు, స్థానికేతరులే ఆ భూములను సాగు చేసుకుంటున్నారు. భీమవరంలో భూఆక్రమణలపై తహసీల్దారు లక్ష్మిని సంప్రదించగా.. పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# అవినీతి నిరోధించరు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు రేంజి పరిధిలో అవినీతి నిరోధకశాఖ పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఏడాది దాటినా ఒక్క కేసు నమోదు కాకపోవడం గమనార్హం. పలు ప్రభుత్వ శాఖల్లో అధికారులు, ఉద్యోగుల అవినీతిపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నా.. పలువురు ఫిర్యాదు చేస్తున్నా అనిశా మాత్రం అచేతనంగా ఉండటం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఎక్కడా దాడులు చేసిన దాఖలాలు లేవు.

**ఫిర్యాదులు వస్తున్నా..**

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే పలువురు ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నంద్యాల జిల్లాలో ఇసుక ట్రాక్టర్ యజమాని నుంచి ఓ ఎస్సై.. రూ. 10 వేలను ఫోన్‌పే చేయించుకోవడం చర్చనీయాంశంగా మారింది. రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ తదితర సిబ్బందిపై ఫిర్యాదులు వస్తున్నా చర్యలు కానరావడం లేదు. ఈ నేపథ్యంలో డీఎస్పీ స్థానాన్ని భర్తీ చేసి అవినీతి నిరోధక శాఖను పటిష్టపరచాల్సిన అవసరం ఉంది.

**డీఎస్పీ పోస్టు భర్తీ ఎప్పుడో..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అవినీతి నిరోధక శాఖ తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. ఆ ప్రభుత్వ హయాంతో అనిశాపై ఓ మంత్రి పెత్తనం ఉండేది. గతేడాది జనవరి నుంచి ఫిబ్రవరి వరకు కర్నూలు అవినీతి నిరోధక శాఖ మూడు కేసులు నమోదు చేసింది. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కర్నూలు రేంజి అనిశా డీఎస్పీగా ఉన్న వెంకటాద్రి చిత్తూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.




అప్పటినుంచి ఇప్పటి వరకు డీఎస్పీ స్థానం భర్తీకి నోచుకోలేదు. గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకు ఒక్క కేసు నమోదు కాకపోవడం గమనార్హం. ఇన్ని నెలలపాటు ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవడం అనిశా చరిత్రలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అవినీతి అధికారులపై ఫిర్యాదులు వస్తున్నా.. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేకపోవటంతో కేసులు నమోదు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మారిన టోల్‌ఫ్రీ నంబరు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి నిరోధక శాఖ టోల్‌ఫ్రీ నంబరును 1064గా ప్రకటించింది. అవినీతికి పాల్పడేవారి వివరాలు, ఫిర్యాదులను సంబంధిత నంబరుకు తెలపాలని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు.

# అ'ధన'మిస్తేనే వైద్యం

కర్నూలు :కోసిగి మండలానికి చెందిన జయరామిరెడ్డి (43) అనే వ్యక్తి నగరంలోని ఓ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యశ్రీ కింద ఈనెల మొదట్లో న్యూరో సర్జరీలో చికిత్స తీసుకున్నారు. కాగా శస్త్రచికిత్స చేసినందుకు తనవద్ద అదనంగా రూ. 70 వేలు వసూలు చేశారని బాధితుడు పేర్కొన్నారు. నగరానికి చెందిన ఓ ఉద్యోగి తన భార్యను చికిత్స నిమిత్తం గైనిక్ ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ కింద చేర్పించారు. నిర్వాహకులు అదనంగా రూ. 8 వేల వరకు తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన ఆరోగ్యశ్రీ అధికారుల దృష్టికి తీసుకురాగా డబ్బులు ఇప్పించి చేతులు దులిపేసుకున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద ఏటా సుమారు 1.19 లక్షల కేసులు వస్తుంటాయి. దీనికిగాను ప్రభుత్వం రూ. 137 కోట్లను ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఖర్చు చేస్తోంది. కర్నూలు జిల్లాలో 47, నంద్యాల జిల్లా పరిధిలో 22 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నిరుపేదలు వీటిల్లో చేరుతుంటారు. కొన్ని వైద్యాలయాల్లో మొదట వైద్య పరీక్షల పేరిట సుమారు రూ. 10 వేల నుంచి రూ. 20 వేలకు ఖర్చు పెట్టిస్తారు. కొందరు నిర్వాహకులు రోగుల బంధువులను భయపెడతారు.



**సమయపాలన ఏదీ..**

ఆరోగ్యమిత్రలు ఉదయం 9 గంటలకు రావాల్సి ఉండగా చాలామంది సమయానికి రావడం లేదన్న ఆరోపణలున్నాయి. చాలా వైద్యాలయాల్లో రాత్రివేళల్లో అందుబాటులో ఉండకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కొందరు ఆస్పత్రి నిర్వాహకులు బయట వైద్య పరీక్షలు చేయిస్తున్నా పట్టించుకోవడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.కోట్లలో దోచుకుంటూ..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతిరోజూ ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు 500 కేసులు వస్తుంటాయని అంచనా. ఈ నేపథ్యంలో పేదల నుంచి నిత్యం రూ. 10 లక్షల వరకు వైద్య పరీక్షలు తదితరాల పేరుతో దోచుకుంటున్నారు. ఇలా పరిశీలిస్తే ఏటా రూ. 36 కోట్ల వరకు బలవంతంగా వసూలు చేస్తున్నారు. కొందరు బాధితులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా చర్యలు కానరావడం లేదు. నగర పరిధిలో గతంలో 50 వరకు ఫిర్యాదులు అందినా.. అధికారులు జరిమానా విధించి చేతులు దులిపేసుకున్నారు. ఉన్నతాధికారులు రోగుల ఇబ్బందులపై దృష్టి సారించాల్సి ఉంది.

**తగిన చర్యలు తీసుకుంటాం** డా. భాస్కరరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చేరిన బాధితులకు అండగా ఉంటాం. ఎవరైనా డబ్బులు అడిగితే ఆరోగ్య మిత్రకుగానీ.. నా దృష్టికి తీసుకురావాలి. బయటకు వెళ్లిన తర్వాత డబ్బులు ఇచ్చినట్లు చెబుతున్నారు. విచారించి చర్యలు తీసుకుంటాం.

# భక్తజన పరవశం.. శ్రీగిరి మార్గం

ఆత్మకూరు : ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు నల్లమల చిరునామాగా నిలిచింది. శ్రీగిరికోన శివనామస్మరణతో మార్మోగుతోంది. శివరాత్రికి మల్లికార్జున, అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులు నల్లమలలోని పలు ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇక్కడి విశేషాలను తెలుసుకొని ఆనందానుభూతిని పొందుతున్నారు. అరణ్యమార్గంలో 40 కి.మీ: శ్రీశైలానికి కాలిబాటన దర్శించుకోవాలనుకునే వారు తొలుత ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామం నుంచి అరణ్యమార్గంలో 40 కి.మీ.లు ప్రయాణించాలి. వెంకటాపురం నుంచి 6 కి.మీ.లు వెళ్తే గోసాయికట్ట ఆంజనేయస్వామి గుడి వస్తుంది. అక్కడ నుంచి నాగలూటి క్షేత్రానికి 9, దామర్లకుంటకు 8, పెచ్చెర్వుకు 2, మఠంబావికి 6, భీమునికొలనుకు 3, కైలాసద్వారానికి 2, అక్కడ నుంచి 4 కి.మీ.లు నడిస్తే శ్రీశైల మల్లికార్జునస్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చు. ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి నడకబాటను ప్రారంభించాలి.బ్రిటిష్ కాలం నాటి గ్రామం పెచ్చెర్వు: దామర్లకుంట తర్వాత పెచ్చెర్వు గూడేన్ని సందర్శించొచ్చు. అప్పటి బ్రిటిష్ దొరలు సరకుల రవాణా కోసం ఈ గ్రామాన్ని అభివృద్ధి చేశారు. ఆసుపత్రి శిలాఫలకం, బ్రిటిష్ దొరల కార్యాలయాలు, శిథిల భవనాలు,



పురాతన బావిని చూడొచ్చు.

వీరభద్రుని తాపలు: పెచ్చెర్వు నుంచి కొంత దూరం వెళ్లగానే వీరభద్రుని తాపలు వస్తాయి. ఇక్కడ కొలువైన వీర భద్రుడిని పూజించి మెట్ల మార్గంలో నడిచి వెళ్తారు.

కోర్కెల కొండ: పెచ్చెర్వు నుంచి భీముని కొలనుకు వెళ్లే మార్గంలో మెట్లమార్గంలో కోర్కెల కొండ ఉంటుంది. సంతానం, సొంత ఇళ్లు కావాలనుకునేవారు ముడుపులు కడతారు.

మఠం బావి: బిటిష్‌ల కాలంలో బావిని కట్టించారు. ఈ దారిన వెళ్లే వారు ఈ బావి నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటారు.

గోసాయికట్ట ఆంజనేయ స్వామిగుడి: వెంకటాపురం తర్వాత గోసాయి కట్ట ఆంజనేయస్వామి గుడి వస్తుంది. శాలిబాయి అనే మహిళ ఆవులను ఇక్కడ మేపుతుండటం, అందరూ ఆమెను గోసాయమ్మగా పిలవడంతో ఈ ప్రాంతానికి గోసాయికట్టగా పేరొచ్చింది. అప్పట్లో రాజులు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, భక్తులు గుడిని కట్టించడంతో అందరూ ఇక్కడ పూజలు చేస్తున్నారు.

నాగలూటి వీరభద్రాలయం: గోసాయి కట్ట తర్వాత నల్లమలలో శ్రీశైల ముఖద్వారంగా పేరుగాంచిన నాగలూటి వీరభద్రాలయాన్ని భక్తులు సందర్శిస్తారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేమంగా వెళ్లేలా చూడాలని ఇక్కడి వీరభద్రుడిని మొక్కుతారు. 15వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించారని కొందరు చెబుతుంటే...తాబేలు, పాము, బల్లి వంటి చిత్రాలను బట్టి చాళుక్య రాజులు ఆలయాన్ని నిర్మించారని ఇంకొందరు చెబుతున్నారు.

దామర్ల కుంట: వీరభద్రస్వామిని దర్శించుకున్నాక తర్వాత దామర్లకుంట వస్తుంది. అడవి జంతువులు సంచరించే ప్రాంతమిది. ఇక్కడ నీటి కుంట వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తుంది. సహజసిద్ధమైన ఉప్పు నీటి వనరులు ఇక్కడ ఉన్నాయి. జంతువుల ప్రశాంతతకు భంగం కలగకుండా పాదయాత్ర చేయాలి.

భీముని కొలను: పెచ్చెర్వు నుంచి పాదచారులు భీముని కొలను మీదుగా ప్రయాణించాలి. సముద్రమట్టానికి ఈ ప్రాంతం 585 మీటర్ల ఎత్తున ఉంటుంది. భీమునికొలను నుంచి 60 మెట్లు పైకెక్కితే కైలాసద్వారానికి చేరుకోవచ్చు.

కైలాస ద్వారం: కైలాస ద్వారంలో భక్తులు కైలాసవాసుడ్ని స్మరించుకుంటూ ముందుకు సాగి శ్రీశైల మల్లికార్జున, అమ్మవార్లను దర్శించుకుంటారు.

శిఖర దర్శనం: శిఖర క్షేత్రంలోని నందీశ్వరుని కొమ్ముల మధ్య నుంచి శ్రీశైలక్షేత్రం ప్రధాన గర్భాలయంలోని మల్లికార్జునుడ్ని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల నమ్మకం.

# పేదోళ్లు ఎందరున్నారు

కర్నూలు : విద్యుత్తు సౌకర్యం లేని కుటుంబాలెన్ని ? కట్టెల పొయ్యిపైనే ఎంత మంది వంట చేసుకొంటున్నారు ? పక్కా గృహం లేనివారెందరు ? బ్యాంకు సేవలకు ఎంత మంది దూరంగా ఉన్నారు.. తదితర వివరాలు సచివాలయ సిబ్బంది సేకరించి యాప్‌లో పొందుపరుస్తున్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా కూటమి ప్రభుత్వం పీ4 సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే ఈ ప్రక్రియనే పీ4. పూర్తిగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు ఆర్థిక స్థితిమంతులు, ఎన్‌ఆర్‌ఐలు సాయం చేస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి క్లస్టర్‌లో సర్వే నిర్వహిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13,31,113 కుటుంబాలు



న్నాయి. 12,14,379 కుటుంబాలు రేషన్‌కార్డులు కలిగి ఉన్నాయి. అందులో దారిద్ర్యరేఖకు దిగువనున్న 80 శాతానికి పైగా కుటుంబాల (9,97,724) ఆర్థిక పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.

కర్నూలు జిల్లాలో 672 సచివాలయాల పరిధిలో 10,442 క్లస్టర్లు ఉండగా.. ఒక్కో క్లస్టర్‌కు 20 నుంచి 40 కుటుంబాలకు పైగా సర్వే పరిధిలోకి వస్తున్నాయి.

నంద్యాలలో 516 సచివాలయాల్లో 9,249 క్లస్టర్లుండగా.. ఒక్కో క్లస్టర్‌కు సుమారు 20-35 కుటుంబాల వరకు సర్వే పరిధిలోకి వస్తున్నాయి. ఒక్కో సచివాలయ ఉద్యోగి రెండు నుంచి మూడు క్లస్టర్ల పరిధిలోని కుటుంబాలను సర్వే చేస్తున్నారు.

# మీపైనే ధ్యాస.. సమస్యలు తీరుస్తారని ఆశ




కర్నూలు: పల్లె ప్రజల ప్రధాన సమస్యలపై సమగ్రంగా చర్చించి..అవసరమైన నిధులపై ప్రభుత్వానికి నివేదిక పంపించడం, జిల్లాను ప్రగతిబాట వైపు నడిపించేందుకు జడ్పీ వేదిక కావాలని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. మొక్కుబడి చర్చలు లేకుండా, కాలయాపన కబుర్లతో సమయం వృథా చేయొద్దని, కీలకాంశాలపై చర్చ జరగాలని కోరుతున్నారు. నేడు జిల్లాపరిషత్ 14వ సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ప్రజల ఆకాంక్షలివీ..

**వేసవిలో తాగునీటికి ఇబ్బందులు**

వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 132 గ్రామాల్లో మంచినీటి ఎద్దడి పొంచి ఉందని, రూ.10.56 కోట్ల నిధులు అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ క్రమంలో నిధులు వచ్చేలా చూడాలి.

గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ చేయాలని కూటమి అధికారంలోకి వచ్చిన తొలి సమావేశంలోనే (19.7.24) ఎమ్మెల్యేలు, ఎంపీలు జడ్పీ సభ దృష్టికి తెచ్చినా అడుగుపడలేదు.

కర్నూలు జిల్లా పశ్చిమప్రాంత ప్రజలు మంచినీటికి పడుతున్న ఇబ్బందులపైనా సంబంధిత అధికారులతో జడ్పీ తరఫున సమావేశం నిర్వహించని నేపథ్యంలో దీనిపై చర్చ జరగాలని కోరుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైద్య ఆరోగ్యం, ఉపాధి హామీ పథకం, వలసలు, గృహ నిర్మాణం తదితర శాఖలపై చర్చ జరగాలి. 2022 మే 5, 2022 ఆగస్టు 16న జరిగిన జడ్పీ సమావేశంలో వైద్య ఆరోగ్యంపై చర్చించినా...ఇంతవరకు వాటిని అజెండాలో చేర్చలేదు. కర్నూలు జిల్లా పశ్చిమప్రాంతంలో ఏటా వేసవిలో వలసలు జరుగుతున్న క్రమంలో వాటిపైన చర్చ జరగాలి.

'గుండ్రేవుల ప్రాజెక్టు'పైనా మాట్లాడాలి. వేదవతి, ఆర్డీఎస్‌లపైనా చర్చించాలి. భూసేకరణతో ఈ రెండు ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయి. టీబీ డ్యాం నుంచి ఎల్లెల్సీ, కేసీసీ కాల్వకు నీటివాటా అందడం లేదు. కేసీసీ నీటివాటాలో ఈఏడాది 3.500 టీఎంసీలు పొరుగు జిల్లాకు తరలించినా పట్టించుకోవడం లేదు.

పందికోన జలాశయం కింద 56 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు అవకాశమున్నా.. పంటకాల్వలు లేకపోవడంతో అమలు కావడం లేదు. 68 చెరువుల ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో బడ్జెటు కేటాయించాలి.

నేటి ఉదయం 11 గంటలకు ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇరు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు హాజరవుతారు. గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయం, జలవనరులశాఖలను అజెండాలో చేర్చారు. 2025-26 ఏడాదికి గానూ జడ్పీ, మండల పరిషత్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పలు సమస్యలు పరిష్కారమవుతాయనిభావిస్తున్నారు.

# 'వంద'రోజుల ఉపాధికి భరోసా..!



విజయనగరం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏడాదిలో వంద రోజుల పనిదినాల కల్పన గగనమవుతోంది. చట్టంలో నిర్దేశించినట్లు ఒక కుటుంబానికి వందరోజుల పని కల్పించాలి. జిల్లాలో గత ప్రభుత్వంలో వేతనదారులకు ఉపాధి కల్పన అందని ద్రాక్షగా మారింది. గడిచిన మూడేళ్లలో మరింత దయనీయం. దీంతో కుటుంబాలు ఆదాయాన్ని కోల్పోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికీ పూర్తిరోజులు పని కల్పించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

గత అయిదేళ్లలో 18.24 లక్షల కుటుంబాలు ఉపాధి పనిలోకి రాగా, 3.32 లక్షలకు మాత్రమే పూర్తి పనిదినాలు దక్కాయి. 2021-22 నుంచి 2023-24 మధ్య ఇంకా దారుణమైన పరిస్థితి నెలకొంది. 10.47 లక్షలకు 69,278 మేర పూర్తి రోజులు పని కల్పించారు. ఇళ్ల నిర్మాణానికి 90 రోజుల పనిదినాలు కల్పించి ఎక్కువ సంఖ్యలో జాబ్‌కార్డులు జారీచేయడం, మొక్కల పెంపకం, ఇతరత్రా వ్యక్తిగత పనుల కోసం కొందరు జాబ్‌కార్డులు పొందారు. తర్వాత వీరంతా పనుల్లోకి రావడం మానేశారు. ప్రతి 15 రోజులకొకసారి మస్తర్ అప్‌డేట్ చేసుకోని పరిస్థితులే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు.

**కూటమి ప్రభుత్వంలో..**

2024-25లో 3.10 లక్షల కుటుంబాలు పనిలోకి వస్తున్నాయి. ఇప్పటివరకు 18,109 మేర పనిదినాలు కల్పించారు. ఈ నెలాఖరు నాటికి ఇంకో 77,265 కుటుంబాలకు పనికల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో 81-99 రోజులు పూర్తిచేసుకున్నవారు 47,894 కుటుంబాలు ఉన్నాయి. 71-80 రోజుల మధ్య 29,371 మంది ఉన్నారు. సాంకేతిక సమస్యలతో 1,125 మంది పూర్తి పనిదినాలకు దూరమవుతున్నారు. వీరికి పనికల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు డ్వామా పీడీ శారదాదేవి కు తెలిపారు.

# చిన్నారులకు ప్రత్యేక సాయం



గరివిడి : దివ్యాంగ విద్యార్థులకు అన్నివిధాలా చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రత్యేకావసరాల పిల్లలందరికీ ఉపకరణాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 377 మందికి రూ.38.52 లక్షల విలువైన పరికరాలను మంజూరు చేసింది. వీటిని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులు 4,367 మంది ఉన్నారు. వీరిలో 2,800 మంది భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతుండగా.. మిగతా వారు పాఠశాలల్లో చదువుతున్నారు.

ఇదివరకే సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వైద్యులతో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గుర్తించారు. అవసరాల మేరకు చంక కర్రలు, చక్రాల కుర్చీలు, బ్రెయిలీ కిట్‌లు, బుద్ధి మాంద్యం పిల్లలకు అవసరమైన సామగ్రి అందించనున్నారు.

బకాయిల చెల్లింపు.. : భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న పిల్లలకు చెల్లించాల్సిన భత్యాలను గత ప్రభుత్వం బకాయి ఉంచగా, ప్రస్తుత ప్రభుత్వం చెల్లించింది. జిల్లాలో 27 కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న ప్రత్యేకావసరాల పిల్లలకు 2024-25కి సంబంధించి పది నెలల కాలానికి భత్యాలు రూ.73.9 లక్షలు తల్లిదండ్రుల ఖాతాలకే జమచేసింది. పిల్లలను తీసుకొస్తున్న తల్లిదండ్రులు, ఎస్కార్ట్, రవాణా భత్యం, ఇంటి వద్దే సేవలందుకున్న వారికి హోమ్ బేస్డ్ అలవెన్స్ చెల్లించింది.

త్వరలో పరికరాల పంపిణీ..

ప్రత్యేకావసరాల విద్యార్థులకు మజూరైన ఉపకరణాలన్నీ త్వరలోనే పంపిణీ చేస్తాం. దివ్యాంగుల చదువును ప్రోత్సహించి వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రామారావు, పీవో, సమగ్ర శిక్ష, విజయనగరం.

# ఎస్.కోట ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రం

శృంగవరపుకోట : శృంగవరపుకోట ప్రాంతీయాసుపత్రిలో రెండు నెలల్లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించడంతో జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పాలకొల్లులో జరిగిన డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవంలో ఆమేరకు ఆయన ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జాతీయ ఆరోగ్య మిషన్-ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద 13 జిల్లాల్లోని 15 ఆసుపత్రుల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందుకు చండీఘర్‌కు చెందిన రాహి కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా మరో రెండు నెలల్లో ఎస్.కోటతో పాటు ఇచ్ఛాపురం, సీతంపేట, వింజమూరుల్లో కేంద్రాలు ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. సేవలను ఆ సంస్థ అందించనుండగా, అవసరమైన వసతి, మంచినీటి సదుపాయం, విద్యుత్తు ప్రభుత్వం సమకూర్చనుంది.

**కొత్త భవనంలో ఏర్పాటుకు నిర్ణయం**

ఎస్.కోట ఆసుపత్రి ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న భవనం కింద అంతస్థులో ఈ కేంద్రం ఏర్పాటుకు వైద్యాధికారులు నిర్ణయించారు. ఎక్కువ ఓపీలు నమోదవుతుండడం, స్థలాభావం కారణంగా అక్కడ ఏర్పాటు చేయనున్నారు. ప్రాంతీయాసుపత్రి ఇన్‌ఛార్జి డా.నీల వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా మంజూరైన కేంద్రాన్ని కింది అంస్థులో ఏర్పాటు చేస్తామని, సర్వీసు ప్రొవైడర్లకు అవసరమైన విధంగా సిద్ధం చేస్తామన్నారు. ఈ ప్రాంత డయాలసిస్ రోగులు ఇప్పటి వరకు విశాఖ, విజయనగరం వెళ్లాల్సి వచ్చేదని, 35 నుంచి 60 కి.మీ. దూరం ప్రయాణించేవారన్నారు. ఇది ఏర్పాటైతే ఆర్థిక భారం తప్పుతుందని పేర్కొన్నారు.

# కార్మిక బీమా.. కొండంత ధీమా..!

శ్రీకాకుళం : కార్మిక రాజ్య బీమా.. వ్యవస్థీకృత రంగంలో పని చేసేవారికి అండగా నిలిచే పథకం ఇది. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రయోజనాలు అందిస్తున్నాయి. అవగాహన లేక చాలా మంది వాటిని పొందలేకపోతున్నారు. రేపు కార్మిక రాజ్య బీమా సంస్థ(ఈఎస్ఐసీ) దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పరిస్థితిపై ప్రత్యేక కథనం..

రణస్థలం మండలంలోని పైడి భీమవరంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ, శ్రీకాకుళం నగరంలో శాఖా కార్యాలయం ఉన్నాయి. జిల్లాలో సుమారు 30 వేల మంది కార్మికులు ఉండగా.. పైడిభీమవరం డిస్పెన్సరీ పరిధిలో 23 వేల మంది వరకు నమోదయ్యారు. ఇక్కడ పూర్తిస్థాయి భవనం సమకూరినప్పటికీ డిస్పెన్సరీలో రెగ్యులరు వైద్యుడు లేరు. పది పడకలతో కూడిన డయాగ్నోస్టిక్ సెంటరు, ఐదుగురు వైద్యులను నియమిస్తామని ఆసుపత్రి ఏర్పాటు సమయంలో జీవోలో పేర్కొన్నా జరగలేదు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న విజయనగరం జిల్లా గరివిడి డిస్పెన్సరీ వైద్యుడు రెండు రోజులకోసారి ఇక్కడికి వస్తున్నారు. ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నప్పటికీ రోగ నిర్ధారణ పరీక్షలు చేసే పరికరాల్లేవు. జిల్లాలో లోకల్ ఆఫీసు సౌకర్యం లేకపోవడంతో సెలవు పెట్టిన రోజులకు వేతనం పొందాలంటే విజయనగరం వెళ్లాల్సి వస్తోంది. కార్మికులు అస్వస్థతకు గురైనప్పుడు, కార్మికురాలు ప్రసవించినప్పుడు, ఉద్యోగ నిర్వహణలో ప్రమాదాలకు గురైనప్పుడు, ఇతర పరిస్థితుల్లో వైద్య సౌకర్యం కల్పిస్తారు.

ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకూ వైద్య సేవలు, రోగనిర్ధారణ పరీక్షలు ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా అందిస్తారు.

పని చేయలేని పరిస్థితుల్లోనూ వైద్యుని ధ్రువీకరణపై ఆర్థిక సాయం పొందొచ్చు. కార్మికుడు విధి నిర్వహణలో ఉన్నప్పుడు, ఉద్యోగానికి వెళ్తున్నప్పుడు ప్రమాదం జరిగి మృతి చెందితే వారిపై ఆధారపడిన వారికి నెలవారీ పింఛను రూపంలో ఇస్తారు.



స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన బీమాదారులు వారి జీవిత భాగస్వామికి ఏడాదికి రూ.120 ముందుగా చెల్లిస్తే ఆయన మరణించినా ఆమె వైద్య సేవలు పొందే వీలుంటుంది.ః ప్రసవం, కొన్ని శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి నిర్దేశిత రోజులకు వేతనం చెల్లిస్తారు. ఏదైనా సంస్థ, పరిశ్రమలో కనీసం పది మంది కార్మికులు ఉండి.. వారిలో రూ.21 వేలు కంటే తక్కువ జీతం ఉన్నవారంతా ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. వారి పేరున ఆయా సంస్థలు ఇచ్చే వేతనంపై యజమాని వాటాగా 3.25 శాతం, కార్మికుడి వాటాగా 0.75 శాతం ఈఎస్ఐకి జమ చేయాలి. దీని ద్వారా కార్మికులు అనారోగ్యం పాలైనా, ఇతర ఏ సమస్య వచ్చినా ఈఎస్ఐసీ ద్వారా లబ్ధి పొందవచ్చు.

**ఆయా సంస్థలపై చర్యలు తప్పవు..**

అర్హులైన కార్మికులను ఆయా సంస్థలు ఈఎస్ఐ పరిధిలోకి చేర్చాలి. లేకుంటే చర్యలు తప్పవు. అర్హులందరి వివరాలు శ్రమ సువిధ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అవగాహన లేనివారు శ్రీకాకుళం నగరంలో బలగలోని ఈఎస్ఐ శాఖ కార్యాలయాన్ని సంప్రదించొచ్చు. - ప్రజ్ఞ, ఈఎస్ఐ కార్యాలయం బ్రాంచి మేనేజరు,

# అడుగంటిన గొట్టా..!


శ్రీకాకుళం : వంశధార ఆయకట్టు పరిధిలో రబీ సాగు చేస్తున్న రైతన్నలకు నీటికష్టాలు తప్పలేదు. క్యాచ్‌మెంట్ ఏరియా ఒడిశాలో గతేడాది అక్టోబరు నుంచి వర్షపాతం నమోదు కాకపోవడంతో గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఫలితంగా కుడి, ఎడమప్రధాన కాలువలకు సాగు నీరు అందించలేని పరిస్థితి నెలకొంది.

**ఎడమ కాలువకు అరకొర..**

బ్యారేజీ వద్ద కనీస నీటిమట్టం 36 మీటర్లుంటేనే కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బెడ్ లెవెల్ 35 మీటర్ల నీటి మట్టం మాత్రమే నీరుంది. ఈ నిల్వతో ఎడమ ప్రధాన కాలువకు కేవలం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగలుగుతున్నారు. నీటి ప్రవాహం జలుమూరు మండలం వరకు మాత్రమే చేరుతోంది.

**డెడ్ స్టోరేజీ..**

వంశధార జలాశయంలో డెడ్ స్టోరేజీ (2 టిఎంసీలు) నిల్వ ఉంది. కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టేందుకు అవసరమైనంత నీరు లేకపోయినప్పటికి ఇటీవల ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు రవీంద్ర, రైతుల వినతి మేరకు జలాశయ గర్భంలో పొక్లెయినర్‌తో కాలువ తవ్వి లింకు కాలువ ద్వారా కుడి కాలువలకు నీరు విడిచిపెట్టారు. నీటి మట్టం



తగ్గడంతో ఈ సరఫరా నిలిచిపోయింది.

**వర్షాభావంతో ఇక్కట్లు**

సాధారణంగా 300 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటేనే కాలువలకు నీరు విడిచిపెట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ వద్ద 130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లోను సరైన వర్షాలు లేకపోవడంతో వరద కాలువ ద్వారా జలాశయంలోకి నీటిని నింపలేకపోయారు. దీంతో ఇప్పుడు సమస్య నెలకొంది.

**జలాశయపనులు పూర్తయితేనే పరిష్కారం**

జిల్లాలో సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం వంశధార జలాశయంతోనే సాధ్యం. 17 ఏళ్ల వ్యవధిలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన బిల్లులు మంజూరైతే గుత్తేదారు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి జలాశయంలో 19 టీఎంసీల నీటి నిల్వ చేసుకునేందుకు వీలు కలుగుతుంది. తద్వారా జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.ఇన్‌ఫ్లో తగ్గడంతో సమస్య.. నది క్యాచ్‌మెంట్ ప్రాంతం ఒడిశాలో వర్షాల్లేకనే సమస్య నెలకొంది. రబీలో అనధికారికంగా నీరు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ సరిపడేంత లేకనే ఈ పరిస్థితి. ఉన్న నీటిని రైతులు పొదుపుగా ఉపయోగించుకోవాలి. ఎత్తిపోతల పథక పనులు 36 శాతం జరిగాయి. వీటితో జలాశయం పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు నీరందిస్తాం.- తిరుపతిరావు, వంశధార ఎస్ఈ, శ్రీకాకుళం

# దస్త్రం తొక్కిపెట్టి.. టీడీఆర్‌లు కట్టబెట్టి

విశాఖపట్నం: ఓ కీలక దస్త్రాన్ని అధికారుల కమిటీ తొక్కిపెట్టింది. గత ప్రభుత్వంలో వైకాపా నేతల ఒత్తిళ్లతో నివేదికల్లో ఎక్కడా ఆ దస్త్రం గురించి ప్రస్తావించలేదు. సుమారు రూ.200 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు అనుకున్నవారికి కట్టబెట్టేశారు. స్థల యజమానికి ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వడం, మళ్లీ అదే స్థలంలో ఆక్రమణదారులకు నాలుగు రెట్లు టీడీఆర్‌లు ఇవ్వడం ప్రస్తుతం కలకలం రేపుతోంది.గోశాల నుంచి అడవివరం వరకు సింహాచలం బీఆర్టీఎస్ రహదారి విస్తరణ గతంలో చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా సింహాచలం దేవస్థానం భూములు కొంత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 2012లో దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా సర్వే నెంబరు 26లో 7 ఎకరాల భూమిని ముడసర్లోవలో కేటాయించింది. దాని విలువ ఇప్పుడు రూ.500కోట్ల వరకు ఉంటుంది. స్థలానికి స్థలం ప్రత్యామ్నాయంగా ఇచ్చినా మళ్లీ అక్కడున్న ఆక్రమణదారులకు కొన్ని నెలల క్రితం టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. 2.72 ఎకరాల భూమికి సంబంధించి 210పైగా బాండ్లు మంజూరు చేశారు. వాటి విలువ సుమారు రూ.200కోట్లు పైమాటే. గజం రూ.35వేల చొప్పున దానికి



నాలుగు రెట్లుగా గజానికి రూ.1.40లక్షల బాండ్లు ఇచ్చారు. టీడీఆర్‌లు అందుకున్న వారిలో కొందరు వైకాపా నాయకులున్నారు.

**అనుకూలంగా రాసిచ్చేశారు..**

టీడీఆర్‌ల మంజూరుపై తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్, జీవీఎంసీ రెవెన్యూ అడిషనల్ కమిషనర్, సీసీపీ అధికారులతో పరిశీలన కమిటీ వేశారు. గతంలో దేవస్థానానికి జీవీఎంసీ స్థలం ఇచ్చిందని ఎక్కడా పొందుపర్చకుండా, పరిశీలన కమిటీ టీడీఆర్‌లు మంజూరు చేయడానికి అనుకూలంగా నివేదిక ఇచ్చిందనే విమర్శలున్నాయి. వాస్తవానికి దేవస్థానానికి భూమి ప్రత్యామ్నాయంగా ఇస్తూ, ఆక్రమణదారులకు కూడా టీడీఆర్‌లు ఇస్తున్నామని నివేదికలో రాయాలి. అలా రాయకపోగా, రిజిస్టర్ గిఫ్ట్‌డీడ్ ద్వారా టీడీఆర్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, నోటరైజ్డ్ అఫిడవిట్ మీద టీడీఆర్‌లు ఇచ్చేయొచ్చని ఉచిత సలహా ఇచ్చారు.

**తాజా నివేదికల్లోనూ ఆ దస్త్రం లేదు..**

బీఆర్టీఎస్ విస్తరణలో ఇప్పటికే 210 టీడీఆర్ పత్రాలు ఇచ్చారు. అయితే పలు ఆరోపణల నేపథ్యంలో వాటిని వినియోగించకుండా హోల్డ్‌లో పెట్టారు. ప్రస్తుతం ఆ టీడీఆర్‌ల వినియోగానికి అవకాశం కల్పించాలంటూ కొందరు పావులు కదిపారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దీనిపై తాజాగా నివేదిక కోరగా, జీవీఎంసీ అధికారులు ఆగమేఘాలపై జిల్లా కలెక్టర్‌కు దస్త్రం పంపారు. అందులోనూ దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూమికి సంబంధించి దస్త్రం చూపకపోవడం గమనార్హం. పాత టీడీఆర్‌లు విడుదల చేయడంతోపాటు... కొత్తగా మరో 186 టీడీఆర్‌లు ఇవ్వాలంటూ కొందరు నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

# తాగినా.. తాకినా రోగాలే

నంద్యాల : ఉమ్మడి జిల్లా ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తున్న తుంగభద్ర, హంద్రీ, కృష్ణా, కుందూనదులు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. నీటిలో కోలిఫాం బ్యాక్టీరియా అసలు ఉండకూడదు. కర్నూలు మండలం పంచలింగాల, తాండ్రపా డు, మామిదాలపాడు, జొహరాపురం తదితర ప్రాంతాల్లో తుంగభద్ర నీటిలో ఈ బ్యాక్టీరియా ఉన్నట్లు తేలింది. కోలిఫా 50 సీఎఫ్‌యూ దాటితో కచ్చితంగా ఆ నీటిని శుద్ధిచేసి తాగాలి. డయేరియా తదితర వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. ఈ నీళ్లతో నేరుగా స్నానం చేసినా చర్మవ్యాధుల బారినపడాల్సి ఉంటుంది.

**జలచరాల ఉక్కిరిబిక్కిరి**

జలచరాలు మనుగడ సాగించాలంటే నీటిలో కరిగిన ఆక్సిజన్ (డీవో) తగు మోతాదులో ఉండాలి. లీటరు నీటిలో కనీసం 4 మిల్లీగ్రాములు.. అంతకన్నా ఎక్కువ ఉండాలి. అంతకంటే తక్కువుంటే జలచరాల ప్రాణాలకు ముప్పు కలుగుతుంది. కుందూనది పొడవునా డీవో తక్కువగా ఉంది. నంద్యాల పట్టణ శివార్లలోని ఉడుమాల్పురం నుంచి పాణ్యం మండలం తొగర్చేడు, మద్దూరు, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, గోస్పాడు తదితర మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో నీటిలో ఆక్సిజన్



3.5 మిల్లీగ్రాముల వరకే ఉంటోందని పరీక్షల్లో వెల్లడైంది.

**నదుల్లోకి నేరుగా మురుగు**

తుంగభద్ర నదిపై 11 సీపీడబ్ల్యూ పథకాలు నడుస్తున్నాయి. 133 గ్రామాల పరిధిలోని సుమారు 3 లక్షల మందికి ఈ నీళ్లే ఆధారం. కర్నూలు నగరం నుంచి రోజూ విడుదలవుతున్న 60 ఎంఎల్‌డీ మురుగునీరు నేరుగా నదిలో కలుస్తోంది. సాధారణంగా మురుగునీటిలో కోలిఫాం 100 మి.లీకు సగటున 600 సీఎఫ్‌యూ ఉండాలి. తుంగలో ఇది 1100- 1200 సీఎఫ్‌యూ దాటుతున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది.

నంద్యాల పురపాలక సంఘంలో రోజూ 30 ఎంఎల్‌డీ మురుగునీరు నేరుగా కుందూనదిలోకే వదలుతున్నారు. ఈ మురుగులో కోలిఫాం 1000 సీఎఫ్‌యూ వరకు ఉంది.

ఉమ్మడి జిల్లాలో 306 కి.మీలు ప్రవహించే కేసీ కాల్వ మురుగు కూపంగా మారింది. పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు వదులుతున్నారు. నంద్యాల పట్టణ శివార్లలోని విత్తన శుద్ధి కేంద్రాల వారు వ్యర్థ జలాలను కేసీలోకి కలుపుతున్నారు.

**టర్బిడిటీతో సమస్యలు** నీటిలో 1- 4 పాయింట్ల వరకు టర్బిడిటీ ఉండాలి. పరిమితి దాటితే మట్టితో సహా ఇతర కణాలు దెబ్బతింటాయి. పశ్చిమ ప్రాంతంలోని గోనెగండ్ల, మంత్రాలయం, కౌతాళం ప్రాంతాలతో పాటు తూర్పు ప్రాంతలోని ఆత్మకూరు, కొలిమిగుండ్ల మండలాల్లో అర్బిడిటీ అధికంగా ఉంది. ఈ నీటిని పంటలకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాంతాల్లో మొక్కలకు సరిగ్గా ఆక్సిజన్ అందడం లేదని గతంలోనే వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

# బాధలెవరికి చెప్పుకోవాలి స్వామీ!



అనంతపురం : జిల్లా నుంచి తిరుపతి వెళ్లాలనుకునే శ్రీవారి భక్తులు ఇదివరకు ఎన్నడూ లేని ప్రయాణ కష్టాలను చవిచూస్తున్నారు. తిరుపతి చేరుకునేందుకు అసలే అంతంత మాత్రం రైళ్ల సదుపాయం ఉంది. ఈ నేపథ్యంలో ఏకంగా రెండు ప్యాసింజరు సర్వీసు రైళ్లను రద్దు చేయడంతో భక్తులకు కష్టాలు రెట్టింపయ్యాయి.

**వామ్మో.. వారాంతపు రైళ్లా?**

గుంతకల్లు నుంచి తిరుపతికి రాత్రి వేళలో తిరుపతి-కదిరిదేవరపల్లి (57405/06), పగటివేళల్లో (57403/04) రైళ్లు నడుస్తున్నాయి. జిల్లావాసులు వీటికే ప్రాధాన్యం ఇస్తారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు వారంలో ఐదు రోజులు ఉన్నా.. అర్ధరాత్రి సమయంలో వెళ్లిపోతాయి. సీట్లు దొరకవు. ఈ వారాంతపు రైళ్లు అన్నీ సికింద్రాబాద్, కాచిగూడ, అమరావతి, అకోలా నుంచి నడిచేవి కావడంతో జిల్లావాసులకు రిజర్వేషన్ దొరకదు. అందుకే ప్యాసింజర్ రైళ్లకే మొగ్గు చూపుతారు. కదిరి దేవరపల్లి రైలు రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం, కదిరి, మదనపల్లి మీదుగా తిరుపతికి వెళ్తుంది. కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి ప్రయాణికులకు ఇది బాగా అనుకూలం. జనవరిలో ఈ రెండు సర్వీసులను రద్దు చేసి.. కుంభమేళాకు పంపారు. కుంభమేళా గత నెల 25నే ముగిసింది. అయితే మార్చి 7 నుంచి తిరిగి నడుపుతామని తొలుత రైల్వే అధికారులు ప్రకటించారు. మళ్లీ మార్చి నెలాఖరు రద్దు కొనసాగిస్తున్నట్లు ప్రకటన చేయడంతో భక్తుల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది.

**ఛార్జీల మోత..**

అనంతపురం నుంచి తిరుపతికి వెళ్లాలంటే ప్యాసింజర్ రైలులో సాధారణ బోగీలో అయితే రూ.65, రిజర్వేషన్ అయితే రూ.180 ఛార్జీ ఉంది. బస్సులో అయితే రూ.350కు పైమాటే. ప్రైవేటు వాహనాల్లో అయితే రూ.500 నుంచి రూ.2000 దాకా చెల్లించి వెళ్లాల్సిన పరిస్థితి.

**ఒక్కటి కూడా లేదు!**

గుంతకల్లు డివిజన్ కేంద్రం నుంచి అనంతపురం మీదుగా తిరుపతికి వెళ్లడానికి ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు కూడా లేకపోవడం దారుణం. ఉన్నవన్నీ వారాంతపు రైళ్లే. గతంలో మీటరు గేజును బ్రాడ్ గేజుగా మార్పు చేయక మునుపు, బళ్లారి నుంచి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలు నడిచేది. గేజు మార్పిడి జరిగిన తర్వాత పట్టాలు ఎక్కలేదు. గతంలో కాచిగూడ- తిరుపతి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ అనంతపురం మీదుగా నడిచేది. గేజు మార్పిడి తర్వాత ఇదీ పట్టాలెక్కలేదు. ప్రస్తుతం వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ గుత్తి, తాడిపత్రి, రేణిగుంట మీదుగా తిరుపతికి వెళ్తోంది. ప్రస్తుతం ధర్మవరం నుంచి తిరుపతి మీదుగా నర్సాపూర్ వెళ్లే రైళ్లను అనంతపురం దాకా పొడగించాలని ప్రయాణికులు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఆచరణలోకి రాలేదు.

# నిధులు నిష్ప్రయోజనం.. వైకాపాదే పాపం!



కదిరి : శ్రీసత్యసాయి జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఎంపీఎఫ్‌సీ గోదాములు నిరుపయోగంగా మారాయి. రైతులకు ఎంతగానో ఉపయోగపడాల్సిన గోదాములు నిర్మించి నెలలు గడుస్తున్నా ఎందుకూ కొరగానివిగా మిగిలాయి. మొత్తం 90 నిర్మిస్తే 3 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. వాటిని సరైనచోట నిర్మించకపోవడమే అందుకు కారణం. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు (ఎంపీఎఫ్‌సీ) నాబార్డు నిధులతో నిర్మించారు.

**మూడు మాత్రమే వినియోగం**

2022 నుంచి 2024 మధ్య కాలంలో శ్రీసత్యసాయి జిల్లాకు 500, 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన మొత్తం 90 గోదాములు మంజూరయ్యాయి. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాములు మొత్తం 75 మంజూరుకాగా 58 నిర్మాణాలు పూర్తయ్యాయి. 17 వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఒక్కో దాని నిర్మాణానికి రూ.40 లక్షలు నాబార్డు నుంచి విడుదలయ్యాయి. అదేవిధంగా 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాములు 15 మంజూరు కాగా 2 నిర్మాణాలు పూర్తయ్యాయి. 13 నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఒక్కో దాని నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ప్రాథమిక సహకార సంఘాలకు నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 90 గోదాములకుగాను 60 నిర్మాణాలు పూర్తయ్యాయి. పాలసముద్రం, రొద్దంలో ఉన్న 3 గోదాములు మాత్రమే వినియోగంలో ఉన్నాయి.

**స్థలాల ఎంపికలోనే లోపం**

పంటలకు సరైన ధర లేని సమయాల్లో, ప్రకృతి విపత్తుల సందర్భంలో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోదాములు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో గత ప్రభుత్వం వాటి నిర్మాణం చేపట్టడంతో ఇబ్బందులు తొలగిపోతాయని అన్నదాతలు ఆశించారు. అయితే నిర్మాణానికి స్థలాల ఎంపిక చేపట్టేటప్పుడు ప్రాథమిక సూత్రాలను కూడా పరిగణలోకి తీసుకోలేదు. వైకాపా నాయకులు మితిమీరిన జోక్యం వల్లే గ్రామానికి, రోడ్డుకు దూరంగా.. పంట ఉత్పత్తులు తరలించేందుకు అనువుగాని చోట గోదాములు నిర్మించారు. దీంతో వాటిని రైతులు వినియోగించుకోవడంపై ఆసక్తి చూపడంలేదు. ఫలితంగా అవి నిరుపయోగంగా మారాయి. రూ.కోట్లు వెచ్చించినా ప్రయోజనం చేకూరింది శూన్యం.

**ఇతర శాఖలకు కేటాయిస్తాం- కృష్ణానాయక్, జిల్లా సహకార శాఖ అధికారి, పుట్టపర్తి**

రైతులు ఆసక్తి చూపని ఎంపీఎఫ్‌సీ గోదాములను ఇతర శాఖలకు అద్దెకు ఇస్తాం. ఖాళీగా ఉన్న వాటి సమాచారం ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు ఇచ్చాం. నిబంధనల మేరకు వాటిని కేటాయిస్తాం.

# చూస్తే.. జలదరింపే!



భీమవరం : జిల్లాలోని ప్రధాన పంట కాలువల్లో ఒకటైన గోస్తనీ- వేల్పూరు కెనాల్ ఇది. తణుకు నుంచి అత్తిలి, పాలకోడేరు మండలాల మీదుగా భీమవరం వరకు విస్తరించి ఉన్న ఈ కాలువ ద్వారా 35 వేల ఎకరాలకు సాగునీరు, 70కి పైగా గ్రామాలకు తాగునీరు అందుతుంది. దీని వెంబడి వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఆక్వా ఆధారిత పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను గుట్టు చప్పుడు కాకుండా ఈ కాలువలోకి వదులుతుండటంతో నీరు కలుషితమైన ఇలా నల్లగా మారిపోతోంది.

ఆక్వా రంగంలో కొందరి స్వార్థం, బాధ్యతా రాహిత్యం, అధికారుల అలసత్వం కారణంగా పంట కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. ఆక్వా పరిశ్రమల్లో వ్యర్థ జలాలను శుద్ధి చేసిన తర్వాత మురుగు కాలువల్లోకి మాత్రమే వదలాలి. దీనికి భిన్నంగా జిల్లాలోని పలు చోట్ల నేరుగా పంట కాలువల్లోకి వదులుతున్నారు. అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటంతో పరిస్థితి నానాటికీ దిగజారిపోతోంది.

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఆక్వా మేతలు, ఇతర అనుబంధ పరిశ్రమలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో కలుషిత నీటిని శుద్ధి చేసే ప్లాంట్లు ఉండాలి. వాటిని పక్కాగా నిర్వహించాలి. ఖర్చు తగ్గించుకునే ఉద్దేశంతో చాలా పరిశ్రమలు గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ జలాలను కాలువల్లోకి వదులుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

నోటీసులు ఇచ్చాం.. ఏడాదిన్నర కిందట అన్ని ఆక్వా పరిశ్రమల్లో మురుగు శుద్ధి ప్లాంట్లు పెట్టించి పర్యవేక్షణ చేస్తున్నాం. కొన్ని చోట్ల ఆక్వా చెరువులు, పరిశ్రమల్లో వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి వదులుతున్నారంటూ ఫిర్యాదులొస్తున్నాయి. చర్యలు తీసుకుంటున్నాం. కొందరికి నోటీసులు కూడా ఇచ్చాం.

కె.వెంకటేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ

పాలకోడేరు మండలం పెన్నాడలో పలు చోట్ల ఆక్వా వ్యర్థాల నీటిని గొట్టాల ద్వారా ఇలా నేరుగా ఈ కాలువలోకి వదులుతున్నారు. ఈ నీటిని చేలల్లోకి మళ్లించే పరిస్థితి లేదని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.

ఉభయ జిల్లాల్లో ఇలా..

ప్రధాన పంట కాలువలు 14

ఆక్వా సాగు విస్తీర్ణం 2.30 లక్షల ఎకరాలు

వరిసాగు విస్తీర్ణం 4.10 లక్షల ఎకరాలు

మంచి నీటి చెరువులు 1,250

# కాలువ గట్లనూ వదల్లేదు..!

జీలుగుమిల్లి : మట్టి మాఫియా ఇష్టానుసారంగా రెచ్చిపోతుంది. పగలు రాత్రి తేడా లేకుండా మట్టి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరి అక్రమార్జనకు కొంత మంది అధికారు లు చేతులు కలపడంతో ఏకంగా కిలోమీటర్ల మేర కాలువ గట్టునే తవ్వేస్తున్నారు. గోదావరి జలాలను కృష్ణమ్మకు చేర్చి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో తెదేపా ప్రభుత్వం పదేళ్ల కిందట చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభించింది. తొలి రోజుల్లో ప్రధాన కాలువ తవ్వి మట్టిని గట్టుగా ఇరువైపులా పోశారు. వైకాపా హయాంలో పనులు నిలిపోయాయి. దీంతో ఈ కాలువ గట్టుపై కన్నేసిన మాఫియా ఎక్కడ పడితే అక్కడ తవ్వేస్తున్నారు.

అడిగేవారు లేరని.. ఎత్తిపోతల పథకం మూలనపడటంతో ఆ శాఖాధికారులు వేరే శాఖలకు బదిలీ అయ్యారు. రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేమీ సంబంధం లేదంటూ తప్పుకొంటున్నారు. దీంతో అక్రమార్కులు జీలుగుమిల్లి మండలం పి.రాజవరం నుంచి టి.నరసాపురం మండలం సీతంపేట, గంగినీడిపాలెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం వరకు గట్టుకు గండ్లు పెట్టి మట్టిని దోచేస్తున్నారు. ఇలా పది కిలోమీటర్ల మేర కాలువ గట్టు కానరాకుండా చేశారు. మాఫియా తవ్వేసిన కాలువ గట్టుపై కొన్ని



చోట్ల రైతులు పంటలు కూడా సాగు చేయడం గమనార్హం.

గ్రావెల్‌కు గిరాకీ ఉండటంతో.. ప్రస్తుతం గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉంది. ఒక ట్రక్కు మట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అమ్ముతున్నారు. దీంతో సీతంపేటకు చెందిన వైకాపా నాయకుడు రెండు యంత్రాలు ఏర్పాటు చేసి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి నిత్యం మట్టి రవాణా చేస్తున్నారు. భవిష్యత్తులో కాలువ పనులు సాగిస్తే గట్టును పటిష్ఠం చేసేందుకు గ్రావెల్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ప్రస్తుతం గట్టు లేకపోవడంతో వర్షపు నీరు నేరుగా కాలువలోకి వస్తూ గండ్లు పడుతున్నాయి. పలుమార్లు రెవెన్యూ సిబ్బం దిని కాలువ గట్టుపై తవ్వకాలను నివారించేందుకు పంపించానని టి.నరసాపురం తహసీల్దార్ సత్యసాయిబాబా తెలిపారు. వారం రోజుల పాటు గస్తీ ఏర్పాటు చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

# దృష్టి పెడితే గట్టి మేలు

ఏలూరు: వైకాపా ప్రభుత్వ అలసత్వం..జగన్ అభివృద్ధిని గాలికొదిలేయడం..కేటాయించిన నిధులను దారి మళ్లించడం వంటి కారణాలతో జిల్లాలో ఎన్నో ప్రభుత్వ భవనాలు మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను వెక్కిరిస్తున్నాయి. బడ్జెట్ వేళ కూటమి సర్కారు కొద్దిపాటి నిధులు కేటాయిస్తే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

**గుత్తేదారుకు బకాయిలతో..**

మన్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 2020లో పోలవరంలో 30 పడకల సీహెచ్‌సీ ప్రారంభించారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉన్నా వైకాపా పాలకులు నాలుగేళ్లు కాలం గడిపేశారు. రూ.5.16 కోట్లతో మొదలు పెట్టిన నిర్మాణ పనులు 50 శాతం పైగా పూర్తయ్యాయి. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు తదితరాలు పూర్తి చేయాల్సి ఉంది. గుత్తేదారులకు భారీగా బకాయిలు ఉండటంతో చాలా కాలంగా పనులు ఆగిపోయాయి. దీంతో ప్రస్తుత ఆసుపత్రిలో చాలీచాలని గదుల్లో రోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**100 పడకలకు అయిదేళ్లుగా..**

చింతలపూడిలోని 100 పడకల ఆసుపత్రి నిర్మాణం రూ.22 కోట్లతో 2020లో మొదలు పెట్టారు. ఇప్పటికి అయిదేళ్లు గడుస్తున్నా నిధుల సమస్యతో పూర్తి కాలేదు. వైకాపా పాలనలో గుత్తేదారులకు దాదాపు రూ.4 కోట్ల బకాయిలున్నాయి. ఇప్పటికి 60శాతం వరకు పూర్తి కాగా నిధులిస్తే త్వరగా ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది.



అంతటా అంతే.. జిల్లాలో సచివాలయాలు మొదలు..రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు, మార్కెటింగ్ శాఖ పరిధిలోని మల్టీపర్పస్ గిడ్డంగులు, నాడు - నేడు పాఠశాలలు ఇలా చాలా నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అంగన్‌వాడీ, క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు తెదేపా ప్రభుత్వ హయాంలో 60 నుంచి 80 శాతం వరకు పూర్తి అయినా వైకాపా సర్కారు కనీసం పట్టించుకోలేదు. అసంపూర్తి అంగన్‌వాడీ కేంద్రాలైతే నియోజకవర్గానికి మూడు నాలుగు ఉన్నాయి. వీటిల్లో రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తే పూర్తి చేసే పనులే అధికం. తెదేపా మొదలు పెట్టిన పనులు తాము ఎందుకు పూర్తి చేయాలన్న అక్కసుతో గాలికొదిలేశారు.

**రాజకీయ క్రీనీడ**

భీమడోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2017 తెదేపా పాలనలో రూ.2.5 కోట్లతో క్రీడా వికాస కేంద్రం, ఇండోర్ మైదానం, క్రీడాకారులకు వసతి గృహ నిర్మాణం మొదలు పెట్టారు. ఏడాదిన్నరలో శరవేగంగా 65 శాతం పనులు చేశారు. ప్రభుత్వం మారటంతో వైకాపా సర్కారు వీటికి పైసా విదల్చలేదు. రూ.కోటి కేటాయిస్తే అన్ని పనులు పూర్తి చేయవచ్చు. ఈ కేంద్రాలు జిల్లాలో దాదాపు 10 వరకు అసంపూర్తిగా మిగిలాయి.

**కూటమి సర్కారు కరుణిస్తేనే..**

గత తెదేపా పాలనలో చివరి దశలో ఉన్న భవనాలను సైతం వైకాపా గాలికి వదిలేసింది. అలానే వైకాపా అధికారంలో ఉన్న సమయంలో మొదలు పెట్టిన పనులనూ అర్ధంతరంగా నిలిపేసింది. ఫిబ్రవరి-28న కూటమి సర్కారు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో అసంపూర్తి భవనాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటికి ఎంత ఖర్చు అవుతుందో అంచనాలతో నిధులు మంజూరు చేస్తే పూర్తయ్యే దశలో ఉన్న పనులన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

## గ్లామర్‌తో స్టైల్ కలబోత..
## పాయల్ రాజ్‌పుత్ బోల్డ్ లుక్ వైరల్

టాలీవుడ్‌లో గ్లామరస్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పాయల్ రాజ్‌పుత్, మళ్లీ తన స్టన్నింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇటీవల ఆమె షేర్ చేసిన ఫొటోషూట్ పిక్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. డార్క్ పర్పుల్ గౌన్‌లో, చక్కని మెటాలిక్ బెల్ట్‌తో, హెయిర్ స్టైలింగ్‌ను రెండు పిక్కీటైల్స్‌లా మార్చి తనను ఒక డిఫరెంట్ గ్లామర్ లుక్‌లో చూపించింది. ముఖ్యంగా ఒక ఫోటోలో కనబడిన తీరు తీరు నెటిజన్లను ఆకట్టుకుంది. పాయల్ ఈ ఫొటోషూట్‌లో స్టైల్‌తో పాటు ఫన్ మూమెంట్స్‌ను కూడా కలిపింది. ఒకవైపు బోల్డ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆకట్టుకోగా, మరోవైపు చిరునవ్వుతో ఫోటోలకే కొత్త స్పార్క్ ఇచ్చింది. "మీ హృదయం ఎల్లప్పుడూ మిమ్మల్ని నడిపించనివ్వండి" అనే క్యాప్షన్‌తో ఈ ఫొటోషూట్‌లో ఉన్న భావోద్వేగాన్ని చెప్పకనే చెప్పింది. పాయల్ రాజ్‌పుత్ కెరీర్‌ను పరిశీలిస్తే.. పంజాబీ చిత్రాలతో ప్రారంభమైన ఆమె ప్రయాణం, 'RX100'తో తెలుగులో



బ్రేక్ ఇచ్చింది. ఆ సినిమా తరువాత ఆమెను గ్లామర్ బ్యూటీగా చూడటం మొదలుపెట్టారు. 'వెంకీ మామ', 'డిస్కోరాజా', వంటి సినిమాలతో టాలీవుడ్‌లో మంచి మార్క్ ఏర్పరచుకుంది. కానీ కొంతకాలంగా మంచి హిట్ లేకపోవడంతో వెబ్ సిరీస్‌లు, గ్లామర్ ఫొటోషూట్ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతోంది. చివరగా ఆమె 'మంగళవారం' అనే థ్రిల్లర్‌లో కనిపించింది. ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చినా.. ఆమె పెర్ఫార్మెన్స్ పట్ల మాత్రం ప్రశంసలు వచ్చాయి. ప్రస్తుతం పాయల్ మరికొన్ని వెబ్ ప్రాజెక్ట్స్ చేస్తోంది. తెలుగు ఇండస్ట్రీలో మళ్లీ ఓ మాస్ హిట్ కోసం ఎదురు చూస్తోంది. ఈ మధ్య పాయల్ పోస్ట్ చేసే ఫోటోలు, క్యాప్షన్లు, క్యాజువల్ బోల్డ్ స్టైల్.. వాటన్నిటిలోనూ ఆమె తన అస్తిత్వాన్ని, భావప్రదర్శనను స్పష్టంగా చూపిస్తోంది. ఈ లేటెస్ట్ ఫొటోసెషన్ చూస్తే, పాయల్ గ్లామర్ గేమ్‌ను మరింత హై స్టాండర్డ్‌కు తీసుకెళ్లే దిశగా ఉందని చెప్పవచ్చు.

## రుక్మిణిని ఆపడం కష్టమే ఇక..!

కన్నడ భామలకు తెలుగులో సూపర్ ఫాలోయింగ్ ఉంటుంది. ప్రస్తుతం నేషనల్ మొత్తం షేక్ చేస్తున్న రష్మిక మందన్న కూడా కన్నడ పరిశ్రమ నుంచి వచ్చి టాలీవుడ్ లో పాపులర్ అయ్యాకే పాన్ ఇండియా లెవెల్ లో క్రేజ్ తెచ్చుకుంది. రష్మిక దారిలోనే మరికొంతమంది హీరోయిన్స్ టాలీవుడ్ బాట పడుతున్నారు. అందులో తన క్యూట్ లుక్స్ తో ఆల్రెడీ తెలుగు ఆడియన్స్ మనసులు కాజేసిన రుక్మిణి వసంత్ కూడా ఉంది. కన్నడలో సప్త సాగర దాచె ఎల్లో సినిమా చేసిన రుక్మిణి ఆ సినిమా తెలుగు వెర్షన్ సప్త సాగరాలు దాటితో మెస్మరైజ్ చేసింది. ఆ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్



కాకపోయినా రుక్మిణికి మాత్రం మంచి పాపులారిటీ వచ్చింది. ఐతే అమ్మడి టాలీవుడ్ ఎంట్రీ గ్రాండ్ గా ప్లాన్ చేస్తుండగా సైలెంట్ గా నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసింది. ఐతే అది ఎలా వచ్చిందో అలా వెళ్లింది. ఇక లేటెస్ట్ గా అమ్మడు ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో ఛాన్స్ అందుకుందని టాక్. ఎన్టీఆర్ నీల్ సినిమాకు రుక్మిణి దాదాపు కన్ ఫర్మ్ అన్నట్టే లెక్క. ఐతే అమ్మడు ఆ సినిమా చేస్తే మాత్రం తప్పకుండా నెక్స్ట్ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనేలా ఉంటుందని చెప్పొచ్చు. రుక్మిణి కూడా టాలీవుడ్ టాప్ చెయిర్ మీదే కన్నేసినట్టు తెలుస్తుంది. తారక్ తో ఛాన్స్ అది కూడా ప్రశాంత్ నీల్ సినిమా కాబట్టి సినిమా ఎలా లేదన్నా అదరగొట్టేస్తుందని చెప్పొచ్చు. ఐతే ఈ సినిమా ఓకే అవ్వడమే ఆలస్యం రుక్మిణి కోసం తెలుగు దర్శక నిర్మాతలు క్యూ కడుతున్నట్టు తెలుస్తుంది. ఎన్టీఆర్ సినిమా పూర్తయ్యే దాకా వేరే సినిమా చేసే ఛాన్స్ లేదు. అందుకే రుక్మిణి మరో సినిమా సైన్ చేయలేదని తెలుస్తుంది. ఐతే తారక్ సినిమా పూర్తై రిలీజ్ అయితే మాత్రం రుక్మిణిని ఆపడం ఎవరి వల్లా కాదనిపించేలా క్రేజ్ తెచ్చుకుంటుందని చెప్పొచ్చు. ఆల్రెడీ యూత్ అంతా అమ్మడి మాయలో పడిపోగా ఎన్టీఆర్ సినిమాతో టాప్ రేంజ్ కి వెళ్లబోతుంది. సో టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చినట్టే అని సౌండ్ చేయాల్సిందే అని చెప్పొచ్చు.




## కుబేర ఫస్ట్ సింగిల్ ప్రోమో అదుర్స్..!




శేఖర్ కమ్ముల డైరెక్షన్ లో కోలీవుడ్ స్టార్ ధనుష్ హీరోగా వస్తున్న సినిమా కుబేర. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్ లో సునీల్ నారంగ్ ఈ మూవీ నిర్మిస్తున్నారు. సినిమాలో మన కింగ్ నాగార్జున కూడా నటిస్తున్నారు. కుబేర సినిమాలో ధనుష్ సరసన రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమా నుంచి లేటెస్ట్ గా ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్ చేశారు. కుబేర సినిమా నుంచి పోయ్ రా.. పోయ్ రా మామా అంటూ సాంగ్ ప్రోమో రిలీజైంది. ఈ ప్రోమోతోనే సాంగ్ పై ఒక మంచి బజ్ క్రియేట్ చేశారు. దేవి మ్యూజిక్ అంటే ఇన్ స్టంట్ గా ఎక్కేస్తాయి. అందులో భాగంగానే కుబేర ఫస్ట్ సాంగ్ ప్రోమో అదిరిపోయింది. ఈ సాంగ్ ని ధనుష్ ఆలపించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. కుబేర సినిమా సాంగ్ ప్రోమోకి ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో ధనుష్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తుంది. ఈ సినిమాలో నాగార్జున రోల్ కూడా ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. శేఖర్ కమ్ముల ఈ కథను ఆయన స్టైల్ లో తెరకెక్కించబోతున్నారని తెలుస్తుంది. రాయన్ తో సూపర్ హిట్ అందుకున్న ధనుష్ కుబేర సినిమాతో మరో హిట్ టార్గెట్ పెట్టుకున్నాడు. కుబేర సినిమా తో పాటు ధనుష్ ఇడ్లీ కొడై సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా ధనుష్ డైరెక్షన్ లో వస్తుంది. కుబేర సినిమాను తెలుగు తమిళంతో పాటు పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. సినిమాపై ఇప్పటికే సూపర్ బజ్ క్రియేట్ కాగా అందుకు తగినట్టుగానే సినిమా నుంచి ప్రచార చిత్రాలు వస్తున్నాయి. ధనుష్ నాగార్జున రష్మిక మందన్న ఈ స్టార్ కాంబినేషన్స్ తో వస్తున్న కుబేర సినిమా సంథింగ్ స్పెషల్ కానుంది. తప్పకుండా ఈ కాంబో అంచనాలను అందుకునే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. శేఖర్ కమ్ముల సినిమా అంటే తప్పకుండా ఆడియన్స్ ని మెప్పించేలా ఉంటుంది. అందులోనూ ధనుష్ తో శేఖర్ కమ్ముల చేస్తున్న ఈ కుబేర మీద భారీ హైప్ ఏర్పడింది. మరి ఈ సినిమాపై ఉన్న ఈ ఎక్స్ పెక్టేషన్స్ కి తగిన ఫలితం ఉంటుందా లేదా అన్నది చూడాలి. ఐతే సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ సాంగ్ ప్రోమో మాత్రం అదరగొట్టేసిందని చెప్పొచ్చు.

## 'మే'లో మూడు భారీ సినిమాలు.. పండగే పండగ..



2025లో అప్పుడే రెండు నెలలు కంప్లీట్ అయిపోయాయి. అయితే ఇప్పటి వరకు అనేక సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యాయి. కొన్ని హిట్స్ గా మారాయి. మరికొన్ని అంచనాలకు మించి రాణించాయి. ఇంకొన్ని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టాయి. అయితే ఎప్పటిలానే పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. అయితే మార్చిలో వివిధ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. కిరణ్ అబ్బవరం దిల్ రూబా సహా అనేక చిత్రాలు రిలీజ్ కానున్నాయి. బాక్సాఫీస్ వద్ద తమ లక్ ను టెస్ట్ చేసుకోనున్నాయి. అదే సమయంలో ఇప్పుడు మే నెలలో విడుదల కాబోయే సినిమాల కోసం జోరుగా చర్చ సాగుతోంది.

నేచురల్ స్టార్ నాని.. హిట్ 3 మూవీతో మే నెలను స్టార్ట్ చేయనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో నాని అర్జున్ సర్కార్ గా పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. రీసెంట్ గా వచ్చిన టీజర్ కు ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. భారీ బజ్ క్రియేట్ చేసింది. హిట్ ఫ్రాంచైజీలో మూడో సినిమాగా వస్తుండడం, ఇప్పటికే స్ట్రాంగ్ ఫ్యాన్ బేస్ ఉండటంతో.. హిట్ 3 విజయం సాధిస్తుందని అంటున్నారు. హిట్ 3 రిలీజ్ కాబోయే మే1న కోలీవుడ్ స్టార్ హీరో సూర్య రెట్రోతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాపై మంచి హోప్స్ పెట్టుకున్నారు. రీసెంట్ గా కంగువా ఫ్లాప్ అవ్వడంతో సూర్య.. ఈ మూవీతో హిట్ కొడతారని అంతా అంచనా వేస్తున్నారు. వింటేజ్ యాక్షన్ నేపథ్య చిత్రంగా మూవీ ఉండనుందని టాక్. మే నెలాఖరులో 30వ తేదీన విజయ్ దేవరకొండ కింగ్ డమ్ విడుదల కానుంది. సినిమాలో విజయ్.. కొత్త అవతార్ లో కనిపించనున్నట్టు ఇప్పటికే క్లారిటీ వచ్చింది.

టీజర్ లో విజయ్ పోలీస్ గెటప్ లో ఓ రేంజ్ లో కనిపించడం, బ్యాక్ డ్రాప్ సీరియస్ అండ్ ఇంట్రెస్టింగ్ గా ఉండడంతో ఆడియన్స్ లో సినిమాపై ఆసక్తి పెరిగింది. విజయ్ నుంచి స్పెషల్ కంటెంట్ వస్తుందని అంతా అంచనా వేస్తున్నారు. ఏదేమైనా మేలో మూడు భారీ హైప్ ఉన్న సినిమాలు రిలీజ్ కానున్నాయి. దీంతో టాలీవుడ్ మూవీ లవర్స్ కు పండగే పండగ! మరి ఆ చిత్రాలు ఎలాంటి హిట్ అవుతాయో వేచి చూడాలి.

## చూడముచ్చటగా అందాల రాశి

'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రాశి ఖన్నా. అంతకు ముందు తెలుగులో మనం, హిందీలో మద్రాస్ కేఫ్ సినిమాల్లో నటించింది. ఆ రెండు సినిమాలు పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. కానీ 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో నటిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంతో పాటు, కమర్షియల్ బ్రేక్‌ను సొంతం చేసుకుంది. దాంతో ఈ అమ్మడు తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా బిజీ అయింది. అందమైన ఈ అమ్మడికి టాలీవుడ్‌లో యంగ్ హీరోలకు జోడీగా వరుస సినిమాలు చేసే అవకాశం దక్కింది. అంతే కాకుండా టైర్ 2 హీరోలకు మోస్ట్ వాంటెడ్‌గా మారింది. ఒకానొక సమయంలో కాస్త బరువు ఎక్కువగా ఉన్న రాశి ఖన్నా సౌత్ ఇండస్ట్రీలో సక్సెస్‌ల కోసం, ఆఫర్ల కోసం సన్నబడింది. సహజ పద్ధతిలో వర్కౌట్స్ చేస్తూ బరువు తగ్గింది. బరువు తగ్గి, సన్నగా నాజూకుగా కనిపించడం ద్వారా టాలీవుడ్‌లో మరిన్ని సినిమాలను ఈ అమ్మడు సొంతం చేసుకుంది. రాశి ఖన్నా ఈ మధ్య కాలంలో తెలుగు సినిమాల కంటే హిందీ, తమిళ్ సినిమాల్లో నటిస్తోంది. ప్రస్తుతం తెలుగు కదా అనే ఒకే ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది. హిందీలో ఈ అమ్మడు సినిమాలు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. తెలుగులో ఈమె దక్కించుకున్న విజయాలను మరే భాషలోనూ దక్కించుకోలేక పోయింది.



ఇన్‌స్టాగ్రామ్‌లో 12 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న రాశి ఖన్నా రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన క్యూట్ అందమైన ఫోటోను షేర్ చేసింది. చీర కట్టులో, పాపట బిల్ల పెట్టుకుని, సింపుల్ హెయిర్ స్టైల్‌తో, చేతికి గాజులు ధరించి పద్ధతైన అమ్మాయిగా రాశి ఖన్నా లుక్‌తో మెస్మరైజ్ చేసింది. వావ్ అంటూ ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయే విధంగా స్టిల్ ఇచ్చింది. అలా సైడ్‌కి చూస్తూ ఉన్న రాశి ఖన్నాను నెటిజన్స్ తెగ లైక్ చేస్తున్నారు. రాశి ఖన్నా షేర్ చేసిన కొన్ని గంటల్లోనే లక్షకు పైగా లైక్స్‌ను దక్కించుకుంది. ఈమె అందంకు ఎంతో మంది లవ్ ఈమోజీలు షేర్ చేస్తూ తమ అభిమానం పంచుకున్నారు. తెలుగులో ఈమె ఊహలు గుసగుసలాడే సినిమా తర్వాత జోరు, జిల్, శివం, బెంగాల్ టైగర్, సుప్రీమ్, హైపర్, జై లవకుశ, ఆక్సీజన్, టచ్ చేసి చూడు ఇలా వరుసగా పెద్ద సినిమాల్లో నటించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. పలు సినిమాలు సూపర్ హిట్ కాగా కొన్ని సినిమాలు యావరేజ్ టాక్‌ను సొంతం చేసుకున్నాయి. కానీ ఈమె స్టార్ హీరోకు జోడీగా జై లవకుశలో తప్ప మరే సినిమాలో నటించే అవకాశాన్ని దక్కించుకోలేక పోయింది. నటిగా ప్రస్తుతం బిజీగా ఉన్నప్పటికీ ఇంకాస్త జోరు పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రాశి ఖన్నాకు తెలుగులో మరిన్ని ఆఫర్లు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## అనన్య పొట్టి ఫ్రాకు సొగసు చూడతరమా?

నటుడు చంకీ పాండే నటవారసురాలిగా అనన్య పాండే కెరీర్ ప్రారంభించినా కానీ తన హార్డ్ వర్క్ ప్రతిభను నమ్ముకుని పరిశ్రమలో ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. %-%లైగర్%-% చిత్రంతో ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, బ్యాక్ టు బ్యాక్ మంచి విజయాలను అందుకుంది. సీఆర్‌టిఎల్, కాల్ మీ బే వెబ్ సిరీస్ లలో నటిగా నిరూపించింది. అనన్య పరిణతి చెందిన నటనతో ఆకట్టుకుంది. మరోవైపు అనన్య నిరంతర ఫోటోషూట్లు యూత్‌లో హాట్ టాపిగ్గా మారుతున్నాయి. తాజాగా వోగ్ కవర్ షూట్ నుంచి కొన్ని ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారుతున్నాయి. షార్ట్ బ్లాక్ గౌనులో థై అందాలను ఎలివేట్ చేస్తూ అనన్య ఇచ్చిన ఫోజు చూపరులను కట్టి పడేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. చిన్నప్పుడు అనన్య పాండే - సుహానా



ఖాన్ అమెరికాస్ నెక్స్ట్ టాప్ మోడల్ వంటి రియాలిటీ టీవీ సిరీస్‌లను కలిసి చూశారు. నేటికీ ఆ ఇద్దరూ పార్టీల్లో కలుస్తారు. నటీమణులు అయ్యాక మరింత క్లోజ్ గా మారారు. నేను నేనేనా? చాలా మారిపోయానని ప్రజలు అనుకుంటున్నారు అని తాజా ఫోటోషూట్ పై అనన్య స్వయంగా వ్యాఖ్యానించింది.

ఫోటోషూట్ల పరంగా అనన్య ప్రయోగాలకు యువతరం ఫిదా అయిపోతోంది. ఓవరాల్ గా అనన్య లుక్ కి మంచి మార్కులే పడ్డాయి.. ఈ కొత్త రూపంపై ఒక రేంజులో కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. మతి పోగొడుతున్న అనన్య పొడుగు కాళ్ల సౌందర్యంపై యూత్ రకరకాల కామెంట్లు చేస్తున్నారు. అనన్య పొట్టి ఫ్రాకు సొగసు చూడతరమా? అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536